POCKET BOOKS EMESCO

శివరామ కరంత్

చోముని డప్పు

అనువాదం : శర్వాణి

విశ్వరూపం దాల్చిన
ఆర్థిక వ్యవస్థలో
నికృష్టజీవుల ఆక్రందనలకు
నిరాశలకు
బ్రతికున్న శవాల
ఘోషకి ప్రతీక




చోముని డప్పు

చోముని మనస్సు ఉద్విగ్నమయింది. పన్లోకి వెడుతూనే వున్నాడు. వస్తూనే వున్నాడు. పెదవులమీద లేని నవ్వు తెచ్చుకుంటూనే వున్నాడు. కానీ అంతరంగంలో ఎన లేని మత్సరం చోటుచేసుకుంది. మొత్తం పల్లె లోని రైతులమీదే అతనికి అసూయగావుంది. ఒకే ఒక్క కారణం కోసం — తనని బతుకంతా కూలీగా బ్రతకమని నిర్దేశించి, వాళ్ళంతా వ్యవయసాయదారులుగా ఉన్నందుకు. వ్యవసాయం చేస్తున్న వారికి దొరికే స్వర్గ సౌఖ్యాలేమిటన్న ఆలోచన లేదతనికి. అది స్వర్గం కానీ, నరకం కానీ తనకీ ఎందుకు దొరక్కూడదన్నదే అతని వాదన.

శివరామకరంత్

శర్వాణి



ఎం. శేషాచలం అండ్ కో
మచిలీపట్నం మద్రాసు హైదరాబాదు

POCKET BOOKS
EMESCO
341

శివరామ కరంత్ కన్నడ నవల

చోముని డప్పు

శర్వాణి అనువాదం



CHOMUNI DAPPU

Kannada Original : SIVARAMA KARANTH
Telugu Translation : SARVANI

Publishers :
M. SESHACHALAM & CO.,
Machilipatnam, Secunderabad, Madras.

EMESCO POCKET BOOKS

First Edition :
SEPTEMBER, 1978

Printers :
HINDU PRESS, MACHILIPATNAM

Cover Design :
BAPU

Distributors :
Andhra Pradesh Book Distributors,
Rashtrapathi Road, Secunderabad.

Price : Rs. 3-50

341

1

చిమ్మ చీకటి కళ్ళు పొడుచుకున్నా కానరాని కటిక చీకటి. చంద్రోదయానికింకా రెండు గడియ లున్నట్లున్నాయి. అడవి. దిబ్బలు —— —— భీతి గొలిపే చీకటిని చీల్చి. రవ్వంతైనా ప్రాణ మున్న జాడ తెలుపడానికి మిణుగురు పురువులూ మిణుక్కుమనడం లేదు. చప్పుడా? ! ఊహూఁ .... ఎక్కడా దానిజాడ కూడా లేదు. దట్టమైన అడవది. కొండచరియ లోనే ఉన్నా. ఒక్క ఆకు కదలికకూడా లేదు. నేలమీద పడిన ఎండుటాకులమీద ఓ పురుగైనా తిరిగి చప్పుడు చెయ్యడంలేదు. గాలి వీచేమాట అసలే లేదు. వెదురుతోపులో ఎండుటాకులు కూడా రాలి పడటం లేదు. వెదురుబొంగులు ఒకదానికొకటి ఒరుసుకొని "ఛీరీ....ం" అంటూ సచేతన ప్రాణులను వెక్కిరించడమూ లేదు.

ఆ ఊరి పేరు భోగన పల్లె.

రాత్రి పది లేదా పదకొండు గంటలయ్యిందచ్చు. కాని ఒక్క ఇంట్లోంచి కూడా దీపపు కాంతి కానరావడం లేదు. భోగన పల్లె మరీ అడవి ప్రాంతంలోని పల్లె. మొత్తం పల్లె అంతా కలిపి ఏభై-అరవై గడప ఉండొచ్చు. మనుషులంతా కలిపి వందా, రెండు వందల మంది కంటే ఎక్కువ ఉండరు. కాని ఇవ్వాళ ఎక్కడా మనుషుల జాడే లేదు. మరి, అడవి మృగాలో? వాటికేమైందట? ! వాటికీ ఏకాదశి కాదు కద ! ఏమో మరి ప్రతి రాత్రి ఏదో మూల నుంచి వినిపించే పులి గర్జన కూడా వినిపించటం లేదివ్వాళ. అర్ధరాత్రిని వెక్కిరిస్తూ అరిచే గుడ్లగూబ ధ్వని కూడా వినిపించ డంలా. చెవిలో పోటు వచ్చేలా రాత్రి. పగలూ అరిచే కీచురాళ్ళు కూడా విసుగు పుట్టి మౌనం వహించినట్టున్నాయి.

ఇంతటి నిరుత్సాహపు జాడని. పూర్ణ జడత్వాన్ని చూశాక ఈ భోగనపల్లె ఉంటేనేం? ఊడితేనేం అని మీరనొచ్చు. అలా

అనకుండా ఉండాలనే కాబోలు. అకస్మాత్తుగా ఈగాఢ నీరవాన్ని చీల్చి చెండాడేలాంటి విచిత్రమైన ధ్వని వినిపిస్తోంది. ఆధ్వని ఎక్కడ నుంచి వస్తోందని పోల్చుకోలేం. భోగనపల్లె ఓ కుగ్రామం. నూరామడల దూరం వరకూ ఎక్కడా సమతలంగా ఉన్న ప్రదేశమంటూ కనుపించదు. అలాంటి పల్లెలో ఈధ్వని దిబ్బమీదనుంచి దిబ్బకు తగిలి–ఒకటిరెండై, రెండునాలుగై, వచ్చి చెవులను తాకుతోంది. తుదీ, మొదలూ తెలియనట్టుగా కలసిపోతోంది. పదినిమిషాల పాటు ఆ విచిత్రమైన ధ్వని 'డమ్మడక్క. డమ్మడక్క' అని పైకెగసి తేలి వస్తోంది. మళ్ళీ కాసేపు దాని చప్పుడే వినిపించదు. ఆఊరి పరిచయం లేనివారెవరైనా మొదటిసారిగా ఆ చీకటిలో అటువచ్చే సాహసం చేసివుంటే ఈచప్పుడు విని ఏమయిపోతారో చెప్పడం కష్టమే. ఒక్కోసారి ఆధ్వనిలో ఆవేగం ఎక్కువవుతూ, ముందుకు దూకుతూ మరణించబోయే ప్రాణిగుండె చప్పుడులా వినిపిస్తోంది. మరోసారి మందగతిలో సాగేడప్పుడు, కమ్మరి లయబద్ధమైన సుత్తి దెబ్బలా వినిపిస్తోంది. ఇంకోమారు భీకరమైన ఆధ్వని ప్రళయం ఇంకెంతోసేపు లేదనేలా వినవస్తోంది. అది ఉట్టిచప్పుడులేలాదు యాంత్రికమైనా, కేవలం జడప్రపంచ నియమానికి బద్ధమైనచప్పుడు కాదది, అది జడవాదనం, నిజమే కాని, దానివెనుక ఆ ధ్వనిని మ్రోగింపచేసే అద్భుతమైన శక్తి ఏదో ఉన్నట్లు తోస్తోంది. ఊహించి 'ఇదీ' అని చెప్పలేం.

ఇవ్వాళ భోగనపల్లె పక్కనే ఉన్న మరొక పల్లెలో జాతర. సంవత్సరానికోసారి వచ్చే జాతరంటే ఇక చెప్పక్కర్లేదు కదా! ఆ అడవి ప్రదేశంలో మరే ఉత్సవాలు ఉంటాయి? ఊళ్ళోసంతకూడా లేదాయె. చుట్టుప్రక్కల పదిపన్నెండు ఊళ్ళకి ఇదొక్కటే జాతర. ఊళ్ళన్నీ ఖాళీచేసి పల్లెవాసులందరూ జాతరలో పాల్గొన్నారు. ఇక భోగనపల్లెవారు మాత్రం వెళ్ళకుండా ఉంటారా?

సూర్యోదయానంతరం రెండు గడియలకల్లా రథారోహణం జరుగుతుందని విని తెల్లవారక ముందే కొందరు వెళ్ళారు కూడా. ఉదయపు భోజనం గురించిన ఆలోచనే లేదెవరికీను. మధ్యాహ్నపు

భోజనం ఎలాగూ దేవస్థానంలో దొరికే అవకాశం ఉంది. ఇక రాత్రి భోజనం సంగతా! జాతర రోజున దాని గురించి పట్టించుకో రెవరూ. దేవస్థానంలో సమారాధన భోజనం చేసే అవకాశం ఉన్న వారు మాత్రం రాత్రికిక భోజనం లేదన్న సంగతి గుర్తుంచుకుని మరీ భోజనం కానిస్తారు. మిగతా వారు దేవుడి గుడి వెనుక ఉన్న కుంట దగ్గర వంట ఏర్పాట్లు తప్పకుండా చేసుకుంటారు. నిజం చెప్పాలంటే పండుగ రోజున భోం చేసే నాలుక, రుచి చూసే శక్తిని కోల్పోతుంది. మనసంతా దేముని ఊరేగింపు, అలంకారం, బాజాల సంబరం, చుట్టాలు, పక్కాలు, సంత, పరస (పరిష), నగా, నట్రా....ఇంకా ఎన్నెన్నో-ఇలాంటి వాటి మీద ఉంటుందే గాని, రోజూ చేసే భోజనం మీద ఉండగలదా? ఈ పల్లెవాసుల సంగతీ అంతే,

కనుకనే భోగనపల్లెలో ఈరోజు అందరూ జాతరకని బయ ల్దేరి వెళ్ళోయారు, ప్రయాణం చెయ్యలేని వాళ్ళు మాత్రమే ఇళ్ళలో ఉండిపోయారు, మిగతావారు వాళ్ళ గురించిన బెంగేమీ పెట్టుకో కుండా జాతర కోసం సంబర పడుతూ తరలి వెళ్ళారు. ఇక తిరిగి రావడం రాత్రి ఉత్సవం పూర్తయ్యాకే. దేముడు గుడికి తిరిగి వచ్చి, హారతిచ్చాక, పానక ఫలహారాలు గొంతులో పడి నిద్రతో జోగిపోతున్నప్పుడే,

ఇప్పుడా సమయం కూడా ఆసన్నమయింది. అర్థరాత్రి దాటి. పూజారికీ, ఉత్సవమూర్తిని మోసిన వారికీ నిద్ర కళ్ళల్లోకి కూరుకు వస్తుంటే, 'తొందరగా ఈ గొడవ పూర్తైతే చాలు' అనిపిస్తోంది.

'ఆఁ....హారతీ ఏదీ? ఫలహారం పంచి పెట్టండి. పానకం కూడా....ఆఁ....అదీ, అలాగ కానివ్వండి' అంటూ కేకలు పెట్టి పన్లు పురమాయిస్తూ, పగలంతా తిరిగి తిరిగి అలసి పోయిన స్వామి వారిని నిద్రపుచ్చేందుకు ఉయ్యాల వద్దకు చేర్చారు, ఇక అందరూ ఆవలించుకుంటూ గుడి బయట కొచ్చారు. ఊరు, ఇల్లు—వాకిలి, గొడ్డు—గోదా, వీటి ఆలోచన ఇప్పుడిప్పుడే మనసులో మెదల సాగింది, కొంత మంది అలాగా అనుకోలేదు, అరుగు మీద,

నేలమీద: రాతి మీద ఎక్కడ పడితే అక్కడే పడుకున్నారు. రేపటి ఆలోచన కల రైతులూ. గృహిణులూ ఇంతకు మునుపే వెడితే బాగుండేది కదా అని ఎవర్నో తిట్టుకుంటూ బయల్దేరారు. కొంత మంది దేవాలయం వద్ద అటూ-ఇటూ పడి ఉన్న చెత్త-చెదారం పోగుచేసి వెలిగించారు. చాలా మంది ముందే ఆలోచించి తెచ్చుకున్న కాగడాలను వెలిగించారు. దేవుడి గుళ్ళోని పది దీపాలు నూనె, వత్తిలేక కొండెక్కుతుండగా పల్లెవారి ఎనిమిది-పది కాగడాలు వెలగసాగాయి. కాగడా వెలుగులో ఒకర్నొకరు గుర్తిస్తూ తమ తమ పల్లెకు పోయే స్నేహితులతో కలసి గుంపులు గుంపులుగా బయల్దేరారు. అలా బయల్దేరిన వారిలో భోగనపల్లె వారూ ఉన్నారు.

త్రోవ పొడుగునా ఆ కబుర్లూ, ఈ కబుర్లూ చెప్పుకుంటూ నడుస్తున్నారు. 'ఇవ్వాళ వాద్యగాడు చాలా బాగా వాయించాడు కదూ!' 'ఉత్సవమూర్తిని మోసే అతను అడుగులు బాగా వేశాడు కదూ!' 'ఆ ముసలి పూజారి మంత్రాలలో చాలా భాగం తినేసి నట్టున్నాడు' అని కొందరు మాట్లాడుకుంటుంటే:

ఇంకొందరు—'మొత్తం సంతలో ఎక్కడా మంచి మరమ రాలే లేవు.' 'అబ్బ ఇవ్వాళ కుమ్మరి వాళ్ళు ఏం ధరలు చెప్పారు!' 'కాని. చేమంతి పూలు మాత్రం కారు చౌక.' 'నేనివ్వాళ్ళ రెండు మట్టిగాజులు వేయించుకున్నాను.' అని మాటాడుకుంటూ నడుస్తు న్నారు. నిద్ర కళ్ళ మీదకి కూరు కొస్తుంటే ఎంత సేపని మాటలు వస్తాయి? వినేవారికి. చెప్పే వారికి విసుగే. ఇక మౌనంగా నడక సాగించారు.

భోగనపల్లె రిజర్వ్‌ఫారెస్ట్ వచ్చింది. ఫారెస్ట్‌అడవి అని పల్లెవారు దానికి పెట్టినపేరు. అడవిలోని స్తబ్దత ఈ ప్రయాణీకుల సందడితో దూరంగా తొలగిపోయింది. గుబులు పుట్టించే చీకటి కాగడాల వెలుతురుకి చోటిచ్చింది. ఆవెలుగులో జాతరనుండి భోగనపల్లెకు బయల్దేరుతున్న మొదటిగుంపును పరిశీలించవచ్చు. అందరికన్నముందు ఉన్నది పల్లెలోని పేదరైతు అతని వెనుక సంకపప్పయ్యగారు ఆయన మొహం వెలుగులో బాగా కనుపిస్తోంది.

ఆయన వెనుకఉన్న పదిపన్నెండు మంది స్త్రీ, పురుషుల మొహాలు కనుపించడంలేదు.

సంకప్పయ్యగారు ఊళ్ళోని ప్రముఖ జమీందారులలో ఒకరు. ఆయన కాగడా వెలుగులో కాళ్ళీడ్చుకుంటూ నడుస్తున్నారు. ఆయనకూ చాలా బడలికగానే ఉంది. ఎప్పుడు ఇల్లు చేరుకుంటానా అన్న ఆలోచనలో ఉన్నారు. ఆయన ఆలోచనకు అకస్మాత్తుగా భంగం కలిగింది. అలా భంగం కలిగించినది—ఇంతకు మునుపు చెప్పిన చప్పుడు డమ్మడమ్మ డక్కడక్క అన్న వాయిద్యం. దాని ప్రతిధ్వని అలలు అలలుగా వచ్చి, ఒక్కసారిగా విరుచుకుపడి, పిడుగుపాటులా ఆయన చెవులో మార్మోగింది. ఆయన ఒక్క క్షణం గాభరాతో నుంచుండిపోయారు. ఆయనతోబాటు వెనుక వస్తున్నవారినడకా ఆగిపోయింది. ఎవ్వరికి ఏమీఅర్థంకాలా. సంకప్పయ్యగారి కాళ్ళు తడబడ్డాయి గనుక, వారి కాళ్ళూ తడబడ్డాయి కాని, మరుక్షణంలోనే ఆ గాభరా పోయి నవ్వొచ్చింది. ఎప్పటినుండో వింటూ వస్తున్న చప్పుడు అది. క్రొత్తదేంకాదు దేహానికి, మనసుకూ కలిగిన అలసట. చీకటి. నీరవనిశీధి—వీటిమధ్య అకస్మాత్తుగా ఆ చప్పుడు వినపడ్డంతో కొంతగాభరా కలిగింది. అది ఫలానా అని తెలియగానే 'ఓహో! మొదట్లో ఏమిటా అని పోల్చలేకపోయాను. ఇది మనచోముడు మ్రోగించే దప్పుచప్పుడే.' అని నవ్వారు.

కాని, ఎవరూ ఆయన నవ్వు గమనించే స్థితిలో లేరు. మౌనంగా నడక సాగుతోంది. సంకప్పయ్యగారు కూడా నడక సాగిస్తూనే, "ఈ పుణ్యాత్ముడు ఏ ముహూర్తంలో పుట్టాడో గాని, వాడికి చావూ, పుటకా రెండూ ఒకటే. పగలూ లేదు. రాత్రీ లేదు. తాగటం, దప్పు వాయించడం, అదే పని' అన్నారు. అలా అనుకుంటూనే ఇంటికి చేరడం, పడుకుని నిద్రపోవడం జరిగిపోయింది గాని, చోముడి దప్పు ఇంకా మ్రోగుతూనే ఉంది.

చోముడి దప్పులో విశేషమేమీ లేదు. వాడి బ్రతుకులో విశేషముంటేగా. దప్పులో ఉండటానికి! చోముడు మాదిగవాడు. వెనుక బడిన జాతి వాడు. భోగనపల్లె అడవి ప్రాంతంలో ఆతనికో

చిన్న 'కొప్ప' ఉంది. 'కొప్ప' అంటే చాలా ఇళ్ళు కాదు. ఒక్కటే ఇల్లు. ఇల్లూ కాదది. 'కొగణ'—అంటే గుడిసె. అక్కడున్నది అతడు. అతడి ఐదుగురు పిల్లలూను. ఇంకా చెప్పా లంటే ఒక నల్లకుక్క, రెండు ఆవు దూడలు. ఇవే అతని బలగం. అతని వయసు 'ఇంత' అని ఖచ్చితంగా చెప్పలేం. ఏభై అయిదు ఉండవచ్చు. చెపితే మనమే చెప్పాలి. లేదా పుట్టినప్పట్నుంచీ చూసిన వారు చెప్పాలి అతడినే అడిగితే, "ఏంటోనయ్యా. నాకేం ఎరిక?" అంటాడు. 'వందవుండవచ్చా?' అంటే 'ఏమో మరి' అంటాడు. 'ఇరవై ఉంటాయా?' అన్నా, అదే సమాధానం. ఒకసారెప్పుడో 'మా సంకప్పయ్య బాబుగారికి, మా చనియుడికీ పదిరోజుల తేడా' అన్నట్లు గుర్తు. ఇంకోసారి పెద్దయ్యగారికి, నాకు ఒకటే వయసట' అన్నట్టు గుర్తు. పెద్దయ్యగారంటే సంకప్పయ్యగారి తండ్రి దీన్ని బట్టి, అతనికి ఏభై అయిదు దాటి ఉండొచ్చని అనుకోవచ్చు. మనిషి దృఢంగా ఉంటాడు, అయినా ముదితనం ఛాయలు కన్పిస్తున్నాయి, మీసాలు పూర్తిగా కాక పోయినా. సగం సగం నెరిశాయి.

చోముడినే అడిగితే 'నేనింకా నూరేళ్ళు బతకనూ!' అంటాడు. అతడికి నూరు అంటే ఎంతఅని తెలిస్తేగా అతని ఇంటిది చనిపోయి అయిదేళ్ళవుతోంది.• 'గుళిగ' ఉపద్రవంతో రక్తం కక్కుకు చనిపోయిందట? ఇక మిగిలిన బలగం అయిదుగురు పిల్లలు. పెద్దవాడికి సంకప్పయ్యగారి వయసు. అంటే సుమారు పాతికేళ్ళు. పేరు చెప్పాముకదా 'చనియ' అతని తమ్ముడు 'గురువ' అతడికి తమ్ముడులేడు చెల్లెలు—'బెళ్ళి' ఆమెఅంటే ప్రాణం చోముడికి. ఆమెకంటే చిన్నవాళ్ళు ఎనిమిదేళ్ళ 'కాళ' అతనికన్న ఒకటి రెండేళ్ళ చిన్నవాడు'నీల' ఇంతమంది సంసారమది.

చోముడి కుటుంబంలో పూరేకుల్లో ఉన్నంత అన్యోన్యత ఉంది. చనిపోయిన వారంతా బ్రతికిఉంటే ప్రపంచం ఎలాఉండేదో? చోముడు సంకప్పయ్యగారింట మూలపు పాలేరు. మూలపువాడంటే

• "గుళిగ" ఒక క్షుద్రదేవత (శక్తి)

అయింటి యజమాని అనుమతిలేకుండా ఇతడుగాని, ఇతడితరం వారుగాని మరోయజమాని ఆశ్రయాన్ని లాభానికైనా నష్టానికైనా పొందకూడదు. యజమానికూడా ఏపరిస్థితిలోనైనా(అప్పు-సొప్పు ఉన్నాసరే)చోముడ్నీ, సంతతివారిని కనిపెట్టి పోషించవలసిందే.

చోముడుకూడా జాతరకు సకుటుంబ సపరివార సమేతుడై వెళ్ళాడు, ఉదయంనుండి సాయంత్రం వరకు సంబరంలో గంతు లేసి అలసిపోయాడు. రాత్రికికూడా ఉండిపోవాలనుకున్నారు గాని, సాయంత్రం వెలుగుండగానే గుడిసెకు చేరుకోవలసి వచ్చింది. కారణం చోముడిఇంట్లో ఆరోజు పొయ్యి వెలిగించలేదు. నాలుగు రోజులక్రిందట చుట్టాలు వచ్చారని ఆరురోజులకూలి ముందుగా అడిగి తెచ్చేసుకున్నాడు. చుట్టాలేమో వచ్చారు, వెళ్ళారు. ఉన్నదేదో తినేసి పోయారు, ఇవాళ పండుగ రోజు. తినటానికి ఏమీ లేదు. ముందురోజు గడబిడలో యజమానిని 'పండక్కైనా ఇప్పించండని' అడుగుదామని గుర్తే రాలేదు. ఇవాళ అడుగుదామని వెళ్ళేసరికి ఆయన వెళ్ళిపోయారు. మళ్ళీ ఆయన్ని చూడ్డం జాతర లోనే. చూసి వంగి దండం పెట్టాడు, కళ్ళలోంచి, పెదాలమీంచి నవ్వు చిందించాడు. కాని, దాని అర్థం యజమానికి బోధ పడలేదు, నోరు తెరచి అడిగే సాహసం చోముడికి లేదు,

సరే, సాయంత్రం వరకు అలా గెంతడం అయింది, పిల్లలకి తినడానికి ఏమీ లేదు, తన కసలేలేదు. చేతిలో పైసలున్న అతని పరిచయస్థులంతా కల్లు పాకకి బయల్దేరారు. అందులో కొందరు చోముడినీ రమ్మన్నారు. కాని, చోముడికి తన దగ్గర డబ్బు ల్లేకుండా వెళ్ళి వాళ్ళచేత ఖర్చు పెట్టించడం ఇష్టంలేదు. అందుకని, నేనిప్పుడే వెళ్ళి వచ్చానని'' ఉట్టి కబుర్లు చెప్పి తప్పించుకున్నాడు. ఉత్తకడుపుతో ఇంటికి వచ్చాడు. పెద్దపిల్లలు పరిస్థితి నర్థం చేసుకుని ఊరుకున్నారు. చిన్నవాళ్ళు. కాళ, నీల ఇద్దరూ ఆకలితోనూ, జాతర సగంలో వదిలి రావల్సి వచ్చినందుకు ఏడ్చారు. దెబ్బలు తిన్నారు. అందరూ అలసటతో పడుకున్నారు. బెళ్ళి మాత్రం తండ్రి మొహం చూస్తూ కూర్చుంది. ఇలాటి పరిస్థితి వాళ్ళకి

కొత్తేమీ కాదు. రోజూ ఉంటున్నదే. చోముడు బాధ భరించలేక డప్పు చేతికి తీసుకున్నాడు. అదే అతనికి ఉపశాంతినిచ్చే సాధనం. బెళ్ళి 'లే, లే, లే' అని పాడసాగింది. పాటకు అనుగుణంగా ఆడటానికి అడుగులెయ్యడానికి ఎవ్వరూ లేరు. అందరూ పడుకున్నారు. కనుకనే బెళ్ళికి ఉత్సాహం తగ్గింది. కూర్చున్న చోటునే జోగసాగింది. అయితేనేం, చోముడి డప్పు మ్రోగుతూనే ఉంది. అతనికీ నిద్ర వస్తోంది. కొంచెం కళ్ళు తెరపున పడగానే పదింతలు ఆవేశంతో డప్పు మ్రోగిస్తాడు. శివుడి చేతిలో ఢమరుకంలాగ చోముడి చేతిలో ఈ డప్పు.

2

చోముడి కుటుంబంలో నీల, కాళ—ఇద్దరూ రోగిష్టి పిల్లలు. కొద్ది రోజులు జబ్బుతో పడుకుంటే, మిగిలిన రోజులు ఆయాసంతో పడకేస్తారు. తల్లి చనిపోయిన రోజు నుంచి వాళ్ళకేదో జబ్బు ఉంటూనే ఉంది. నాల్గారు రోజులకోసారి చలిజ్వరం వచ్చేది. భోగనపల్లెలో అదొక విశేషమేమీ కాదు. కాని, ఆ పిల్లలు దానికే తట్టుకోలేక విలవిల్లాడుతారు. వాళ్ళు అలా రోగిష్ఠి వాళ్ళు కాకపోతే చోముడి సంసారానికి చాలా లాభమే కలిగేది. ఊళ్ళో గొడ్లు కాసే పనన్నా చేసేవారు. ఇప్పుడు పెద్ద పిల్లల్లో ఎవరో ఒకరు అపనికి వెళ్ళాల్సివస్తోంది.

ఇక ఇంట్లో ఉంటున్నది బెళ్ళి. రోజూ బయట పనికి కూడా వెళ్తుంది. కాని సాయంత్రం వరకు ఇల్లు వదలి ఉండడం సాధ్యం కాదామెకు. వంటపని పిల్లల్ని చూసుకోవడం అంతా తనే చెయ్యాలి. అందుకని ఉదయం తొందరగా లేచి అడవికి వెళ్ళి ఒక మోపెడు ఆకు* తెచ్చి యజమాని ఇంటి పెరట్లో పడేస్తే ముఖ్యమైన పని ఒకటి పూర్తయినట్లే లెక్క. ఆమె అన్నలిద్దరూ అదే పని కోసం అడవికి వెడతారు. అడవి ఉండటం చాలా దగ్గర

* ఆకు - అడవిలోని ఒక రకం ఆకును మోపులుగాతెచ్చి ఎరువుగా వాడుకుంటారు—దక్షిణ కన్నడ జిల్లాలో.

గానే ఉంది గాని, అవి గవర్నమెంటుది అక్కడ కత్తి జోరు చూప డానికి వీలులేదు. దూరంగా ఉన్న దిబ్బల మీదకు వెళ్ళి, లేవి చెట్లను వెదికి రెండు మోపుల ఆకు తెచ్చి పడేసేసరికి మధ్యాహ్నం రెండు మూడు గంటలు దాటుతుంది. ఇక మిగిలింది చోముడు. అతడికి ఫలానా పని అంటూ లేదు. యజమాని ఇంటి ముంగిట నుంచుని 'ఓ, చోమూ!' అనేసరికి సిద్ధంగా ఉండాలి, వెంటనే 'ఇదిగో, వస్తున్నా' అనాలి. ఒక్క క్షణం ఆలస్యమైనా, 'ఎక్కడ చచ్చాడో కల్లుపాక దగ్గర తప్పతాగి పడుంటాడు' అని తిట్టి పోస్తాడు యజమాని. ఆయన దృష్టిలో ఊళ్ళో ఉన్న ఒక్క కల్లు పాకనూ చోముడే గుత్తకు తీసుకున్నట్లు అనిపిస్తూ ఉంటుంది.

మొత్తంమీద చోముడు సదా యజమాని ఇంటి ముందే ఉంటాడు ఆపని ఈపని అని ఏదో ఒకటిచేస్తూనే ఉంటాడు. సాయం త్రానికి అర్ధశేరు బియ్యం దొరుకుతుంది ఉదయంనుండి సాయం త్రం వరకు ఒళ్ళు హూనమయ్యేలా చాకిరీ చెయ్యాల్సిన రోజులూ ఉంటాయి. కానివానికి వచ్చేకూలిలో తేడా ఏమీ ఉండదు.

ఇంట్లో అందరూ ఒళ్ళు దాచుకోకుండా పనిచేస్తే అర్ధశేరు బియ్యం, శేరుసోలెడు వడ్లు దొరుకుతాయి వడ్లుదంచి, చెరిగితే అర్ధశేరుకన్నా ఎక్కువ బియ్యం రావు, శేరుబియ్యంతో ఆరుగిరి కడుపులు నిండాలి అంతా సరిగ్గా ఉన్నరోజున బెళ్ళి అర్ధశేరు బియ్యాన్ని ఉడికించి గిన్నెనిండా గంజికాస్తుంది. దాన్నితాగి పక్లోకివెడితే మళ్ళీ రెండవ భోజనం సాయంత్రం పొద్దుగూకే ముందే. చీకటిపడ్డాక గుడిసెలో దీపం వెలిగించడమన్న మాటేలేదు. దీపం వెలిగించడానికి వాళ్ళేమీ శ్రీమంతులు కారుగా!

ఈ సంపాదనలోనే చోముడికి కల్లూకావాలి. కల్లుతాగకపోతే తనప్రాణాలు ఎగిరిపోతాయనే అతడినమ్మిక. వానాకాలంలో చుట్టూ వున్న ప్రదేశాలన్నీ నీళ్ళతో నిండిపోయినప్పుడు కల్లుపాకవేపు వెళ్ళకుండా రోజులతరబడి ఉండడమూ ఉంది. అయినా కల్లుతాగక పోతే తానుచచ్చిపోతాననే చోముడి నమ్మకం. యజమాని ఇంట్లో అతడు సంపాదించే అర్ధశేరు బియ్యమూ కల్లంగడికే వెడతాయి.

ఆ బియ్యానికి ఎంతకల్లు వస్తుందో గాని. అంగడి యజమాని బిరుమ పూజారి మాత్రం—చోముడి సంగతి తెలుసుగనుక తగినన్ని నీళ్ళు కలిపి ముంతనిండా కల్లుపోసి చోముడిని తృప్తిపరచేవాడు. బెళ్ళి ఎప్పుడైనా కాస్తఖాళీ దొరికితే రెండు బుట్టలల్లి ఉంచేది. చోముడు వాటిని కూడా పట్టుకెళ్ళి బిరుమడికిచ్చేసి మరికాస్త కల్లుగొంతుకో పోసుకుని వచ్చేవాడు. అతడురోజూ కల్లుతాగే మాటమాత్రం వాస్తవం కాని మత్తెక్కి పడిపోయేలా తాగుతాడా? అంటేమాత్రం చెప్పలేం చోముడి పిల్లల క్కూడా తాగే అలవాటుందని వాళ్ళు. వీళ్ళు అనుకుంటారు, అందులో ఆశ్చర్యపడాల్సింది కూడా ఏమీ లేదు. నీల, కాళ లాంటి పిల్లల్ని కూడా కల్లు పాకకి తీసు కెళ్ళడం వాళ్ళ జాతిలో మామూలే. కాని చోముడు మాత్రం ఎప్పుడూ అలాటి పని చేసి ఎరుగడు. కారణం తాగుడు చెడ్డదని చోముడు ఛస్తే ఒప్పుకోడు. అలసి సొలసిన శరీరానికి ఒక్క బొట్టు కల్లైనా లేకపోతే బ్రతకటం వృథా అని వాడి ఉద్దేశం. అతడు పిల్లల్ని తనతో తీసుకెళ్ళకపోవడానికి కారణం ఒక్కటే— వాళ్ళూ తనలా త్రాగడం మొదలు పెడితే ఇంట్లో ఒక్క బియ్యపు గింజ కూడా రాదన్న సత్యం తెలుసు గనుక. తన పెద్ద పిల్లలు చనియ, గురువలు త్రాగరాదని అతడి ఉద్దేశం.

ఇలాటి సంసారం అతడిది. ఇందులో కష్ట నష్టాలు, ఏడుపులూ, నవ్వులూ ఏ పాళ్ళలో ఉంటాయో మనం ఊహించటం కష్టమేం కాదు. అతనికి అప్పూ, సొప్పూ ఉందా అంటే, అతని ఇల్లున్న గుట్ట అంచు ఎన్నో తరాలుగా అతని పూర్వీకులు బతుకు సాగించిన చోటు. దానికేం శిస్తు కట్టక్కర్లేదు, ఇక గుడిసె; అది అతనిదే మరి, అతనిది కాదంటే ఎండదీ, వానదీ, గాలిదీ అనొచ్చు. ఎనిమిది మంది కాళ్ళు సాచి పడుకునేలాంటి విశాలమైన ఇల్లది. ఇంటి కప్పు ఉంది గాని, గోడలు లేవు, గోడలుండ వలసిన చోట వెదురు తడికలున్నాయి. లోపల అంతా ఏక గది. వంటగది. పడక గది, అతిధుల గది—ఇలా శ్రీమంతుల అట్టహాసం ఏమీ లేదు. వేసవిలో. చలికాలంలో అరు బయట నిద్రపోతారు. వర్షాకాలమే

..కి ఇబ్బంది కలిగించేది. ఒకటి, రెండు వర్షాలు కురిసి, ని.. బాధ పడ్డాక, పిల్లలకు దగ్గు, రొంప పట్టుకున్నాక ఇంటి కప్పు ..ు చేస్తాడు. ఇక ఏ అప్పూ, సొప్పూ లేదతడికి. ఆస్థి ఇల్లు ..వారికి అప్పు ఇస్తారు గాని, చోముడికి అప్పు ఇచ్చే ఉదారు ..రు? అప్పు చెల్లించవల్సిందేమయినా ఉందంటే అది సంకప్పయ్య ..కే. ఆయనకూ తెలుసు—చోముడి అప్పు బిరుమడి కల్లుపాక ..నే జమ అయ్యేదని. అలా ఒకటో, అరో డబ్బులు ఎక్కువగా ..ముడికి ఇచ్చి ఉన్నట్లయితే, దానికి నీళ్ళొదులు కున్నట్టేనని. ..క చోముడికి సంతోషించడానికి, గర్వపడ్డానికి ఒక్క అంశం ..త్రమే ఉంది. తాను అందరిలా అప్పు బాకీ పడలేదని. దానితో ..టు ఇంకో కోరికా ఉంది, తాను స్వంతంగా సాగుచేసి, పంట ..డించాలని.

వ్యవసాయదారుడవ్వాలన్న కోర్కె గుండెల నిండా ఉన్న ..ట వాస్తవమే. కాని ఊళ్ళో మాదిగ వ్యవసాయదారులెవ్వరూ ..ంత వరకూ లేరు. అలాంటపుడు ఎవరినైనా ఏమిటి, సంకప్పయ్య ..రినే 'నాలుగు సెంట్ల భూమి నాకు కౌలుకివ్వండి' అనే సాహసమూ ..దు. కాని ఇవ్వాళ కాకపోతే రేపు నాగలిపట్టి దున్నాలనే ఆకాంక్ష ..త్రం మనసులో లోతుగా వేళ్ళు నాటుకుంది. అందుకోసమే ..ూడేళ్ళగా రెండు ఆవు దూడల్ని పెంచుతున్నాడు. ఇప్పుడు ..టికీ మూడేళ్ళు. నాగలిని మోసే యోగ్యత వచ్చింది, ఊళ్ళోని ..ాపిళ్ళై షాహుకారు రెండు మూడు మార్లు వచ్చి, "చోమూ! అవి ..ి కెందుకు? నాకు ఇచ్చెయ్యి. పది రూపాయల నగదు ఇస్తాను" అని అడిగాడు, పది రూపాయలంటే చిన్న మొత్తమేమీ కాదు. ..ాని, చోముడు గట్టి పట్టే పట్టాడు. పది కాదు. నూరురూపాయలు ..చ్చినా అమ్మడట! నూరు కాదు కాని, దొంగ చేతికి దొరికినా, ..ుప్పై రూపాయలకు తక్కువ రాదు. అవి చోముడి దగ్గరున్నాయి ..దా అని మాపిళ్ళై పది రూపాయలకు అడిగాడు గాని....

ఇవ్వాళ కూర్చున్న చోటనే ఎన్నో ఆలోచనలు చోముడి మనసులో మెదులుతున్నాయి....దూడలు ఎద్దులయ్యాయి. ఇక

వాటిని పని లేకుండా ఉంచకూడదు. యజమాని దగ్గరకి వెళ్ళి ఒక సెంటు భూమైనా తనకి కౌలుకి ఇప్పించమని అడగాలి. ఇ అడగక తప్పదు. ఇంతవరకు మనసులోనే ఉన్న ఆలోచనల ఇవాళ పిల్లలకు చెప్పాడు. అతని మాట కాదనే వారు కారు అత పిల్లలు. ఏమైనా ప్రతిగా చెప్పాలంటే బెళ్ళి ఒక్కతే చెప్పాలి బెళ్ళి చెప్పనే చెప్పింది. 'అనవసరంగా యజమానిని అడిగి లేద పించుకోవద్దని. ఇంత వరకు చోముడి పెద్దలెవరూ సాగుచే ఎరుగరు. యజమానికి మాదిగ రైతు లెవరూ లేరు. 'మాదిగ వాళ్ళు నాగలి పట్టడమంటే ప్రళయం వచ్చిందన్న మాటే' అ భావించే మనుషులు ఆ పల్లెలోని వారు.

ఎక్కడో ఏదో పల్లెలో ఎవడో మాదిగవాడు గవర్నమెంటు భూమి పట్టాకి తీసుకుని నాలుగుగింజలు పండించినంత మాత్రాన చోముడూ అలా చేయాలనుకోవడం ఏం సబబు? కనుకనే బెళ్ళి ఖచ్చితంగా వద్దంది. చోముడికి అమితమైన కోపం వచ్చింది కోపం దుఃఖంగా మారి ఏడ్చేవాడు కూడా. 'ఇంటిది' ఉన్నప్పుడే నాగలిపట్టా లనుకున్నా చూసే యోగం దానికి లేకపోయింది. చచ్చేలోపల నాకా భాగ్యం కలుగుతుంది పిల్లలుచూసి ఆనందిస్తారనుకుంటే నువ్వే నా ఆశను కాదంటున్నావా? అని ఏడ్చిమొత్తుకున్నాడు. తండ్రి కళ్ళలో నీరుచూశాక ఇక బెళ్ళి మాట్లాడేదేముంది? తల్లిచనిపోయిన రోజున అతడు ఏడవడం చూసింది. ఇప్పుడు మళ్ళీ ఏడవడం చూస్తోంది. అతడిని ఎలా ఓదార్చాలో తెలీక డప్పుదగ్గరకెళ్ళి దానిమీద వేళ్ళా డిస్తూ కూర్చుంది. చోముడికి డప్పు కళ్ళబడగానే దూకుడుగా వెళ్ళి దాన్ని లాక్కుని ఆవేశంతో దాన్ని వాయించసాగాడు. బెళ్ళి తేలిగా ఊపిరి పీల్చుకుంది.

డప్పుమోత ఇంటి అరుగుమీద కూర్చున్న సంకప్పయ్య గారి చెవినబడింది. ఆయన నవ్వుతూ ఆహా పావుశేరు బియ్యం బిరుమడి ఖాతాలో జమ అవడం, రశీదు రావడం కూడా అయ్యిందే అన్నారు.

చోముడు డప్పు వాయిస్తూనే ఉన్నాడు అదేవారు, పాడేవారు రు. బెళ్ళి లోపల గంజికాస్తోంది. సాయంత్రం లోపల భోజనాల వ్యాలిగా మరి; పెద్దపిల్లలింకా అడవినుంచి తిరిగిరాలేదింకా. చోముడు నమయి డప్పువాయిస్తూనే ఉన్నాడు మామూలు డప్పు; సన్నటి బైపుల్లతో డమ్మడమ్మ, డక్కడక్క అని కొట్టడమే పని. దానిలో త్తదనంగానీ తాడనంలో ప్రత్యేకతగానీ ఏమీ ఉండదు కానీ చోముడికి మాత్రం తానో మృదంగం విద్వాంసుడనన్నంత ఆనందం. దే పనిగా వాయిస్తాడు డమ్మడమ్మ, డక్క డక్క.

ఇదంతా జరుగుతున్నది అతని. ఇంటిముందు ఆవరణలో అలా డప్పుమ్రోగిస్తుండగా ఎవరో పైఊరి వాళ్ళు వచ్చి అతని ముందు నుంచున్నారు. చోముడి చెయ్యి ఆగింది.

వచ్చిన వారి మొహం వేపు విస్తుపోతూ చూశాడు. లేచి నుంచోవాలనే ఆలోచన తట్టలేదు. వచ్చినవారే గొంతు సరిచేసుకుని. "చోముడివి కదూ నువ్వు?" అన్నారు. ఆ గొంతు, ఠీవి చూసి చోముడు చటుక్కున లేచి నుంచున్నాడు తల వంచేశాడు. "అవు నయ్యా" అన్నాడు వినయంగా. "తోట దొరగారు ఆ ఇరవై రూపాయలు నీకు దానంగా ఇచ్చారా ఏది?" అని గద్దించాడు వచ్చిన మనిషి. మొదట చోముడికి అసలు సంగతి ఏమిటో అర్థం కాలేదు. తన జ్ఞాపకాల తెరలను తొలగించి చూసుకున్నాక ఒక్కొటొక్కడే అర్థమవసాగింది.

చోముడు తన 'ఇంటిది' చనిపోయే ముందు సంవత్సరం 'కలసం' దగ్గర కాఫీ తోటలకి కూలిగా వెళ్ళాడు. అంతకు ముందు కూడా వెళ్ళి వచ్చాడు. 'ఇంటిది' చనిపోయాక వెళ్ళడం మానేశాడు ఆఖరిసారి వచ్చేటప్పుడు కొంత అప్పు చేసి వచ్చాడు. 'ఎంత' అన్న సంగతి గుర్తులేదు. అయిదేళ్ళు గడిచిపోయాయి. బహుశః నాలుగు రూపాయలో, ఆరు రూపాయలో అయి ఉండొచ్చు. ఇరవై మాత్రం ఖచ్చితంగా కాదు. మాదిగవాడి దగ్గర ఏముందని? అతడి ఒంట్లోని ఎముకల్ని చూసి అంత డబ్బు అప్పు ఇవ్వగలరా ఎవ రైనా? ఆ తరువాత అతడిని ఎవరూ కాఫీ తోటలకి రమ్మని

పిలువనూలేదు, అతను వెళ్ళనూలేదు, కాఫీ తోటలకి తనం
తానుగా వెళ్ళాలన్న ఉత్సాహం ఎవరికుంటుంది? ఈ సంవత్స
అక్కడ కూలీల సంఖ్య తక్కువగా ఉన్నందు వల్ల వెతుక్కుం
వచ్చారు మరి. అయిదేళ్ళ వ్యవధిలో నాలుగయిదు రూపా
అప్పుని గురించి ఇరవై రూపాయలుగా తేల్చి బెదిరిస్తున్నా
చోముడు 'ఇరవై రూపాయలే!' అనినోరు తెరచేలోపలే తోటవే
కళ్ళెర్రజేసి ఏం? ఇరవైరూపాయలు కాదూ? ఇచ్చినడబ్బుకి వ
గిడ్డి ఉండదనుకున్నావా? ఇచ్చినసొమ్ము వెనక్కి ఇవ్వాల
ఆలోచనే ఉండదు పుండాకోర్ వెధవలకి ఊ!, చెప్పు ఎప్పు
బయల్దేరుతావ్ తోటకి....? అన్నాడు చోముడికి. ఏం చెప్పాలో తె
లేదు. అతడింకా ఆలోచిస్తూ ఉండగానే మేస్త్రీ మన్వేలనోజగ
'రేపు శనివారం వస్తాను బయల్దేరడానికి సిద్ధంగా ఉండు.'
ఆజ్ఞాపించి వెళ్ళారు.

శనివారానికింక మూడురోజులే వ్యవధి ఉంది మూ
రోజుల్లోపల అన్నింటినీ ఒదులుకొని చోముడు తోటకివెళ్ళా
వెళ్ళకపోతే ఇరవై రూపాయల అప్పుతీరేదెలా? నిజానికి అ
సంగతి అతనికి గుర్తేలేదు యజమాని ఒకసారి 'తోట' అ
ఏమీలేదుకదా! అని ప్రశ్నించినప్పుడు లేదని తలాడించాడు. ఇప్పు
ఏమొహం పెట్టుకుని ఈసంగతి చెప్పగలడు? చెప్పకుండా ఉ
యించడానికి మనసొప్పదు. ఆ సమయానికి సరిగ్గా మేతకు వెళ్ళి
ఎద్దులు ఇంటికి మరలి వచ్చాయి. వాటినిచూసి చోముడికి కా
ధైర్యం కలిగింది. వాటిని మాపిళ్ళెకి అమ్మేసి ఇరవై రూపాయ
అప్పు తీర్చేద్దామని నిశ్చయించుకున్నాడు.

మరుక్షణమే సాగుచెయ్యాలన్న ఆకాంక్ష అడ్డునిలిచింది
మళ్ళీఆలోచన ముందుకు సాగలేదు. ఇంట్లోకి వచ్చి డప్పుమ్రోగిం
సాగాడు డమ్మడక్క డమ్మడక్క....సంగీతంలో లీనమైపోయాడు

* * *

3

ఇవ్వాళ శుక్రవారం రేపే శనివారం మన్వేలుడు వచ్చే రోజు ఒకటి—అతడడిగిన ఇరవైరూపాయలు ఇచ్చెయ్యాలి. లేదా తోటకు వెళ్ళాలి అప్పు న్యాయమైనదో, కాదో! ఏమైతేనేం? మన్వేలుడి మాటను ప్రపంచం నమ్ముతుంది గాని, చోముడిమాటకు విలువెక్కడిది? ఇవ్వటానికి చోముడి దగ్గర చిల్లిగవ్వలేదు ఎద్దుల్ని అమ్మేసి ఋణం తీర్చుకుందామని ఒకవేపు అనుకుంటున్నా ఇప్పుడు గనక ఎద్దుల్ని [illegible]స్తే ఇకజన్మలో తాను సాగుచెయ్యాలన్న ఆశ తీరడం [illegible]న్న భయం ఇంకోవేపు తొంగి చూస్తోంది. ఎద్దుల్ని అమ్మేస్తే వచ్చేదంతా లాభమే కారణం. అతనేమీ వాటిని డబ్బుపెట్టికొన్న వాడుకాదు. ఒకసారి అడవిగుండా వస్తున్నప్పుడు, ఎక్కడినుండో పరుగెడుతూ వస్తున్న దూడల్ని తోలుకువచ్చాడు. దగ్గరగా వేరే ఊరుకూడా లేదాయె. అక్కడ వాటిని వదిలేసి వచ్చినా పులినోట పడడం ఖాయం అందుకే తనవి కాకపోయినా పెంచుతూ వచ్చాడు. అప్పుడే ఎవరైనా హక్కుదారులు వచ్చి తమదని అడిగితే ఇచ్చేసేవాడేమోకూడా కాని, ఇప్పుడు వాటిమీద మమత పెరిగింది. చనియ, గురువలిద్దరూ వాటిని అమ్మెయ్యమని ఎంతగానో చెప్పారు. కాని అతనికి అమ్మడం ఇష్టంలేక పోయింది. అమ్మటానికి మనసు రాలేదు. బెళ్ళి అంది, "వీటిని యజమాని దగ్గర అట్టిపెట్టి ఇరవై రూపాయలు తెచ్చుకుందామని. కాని డబ్బు ఎక్కడి నుండి తెచ్చినా మళ్ళీ తీర్చే శక్తి తమకు లేదని చోముడికి తెలియదూ! అందుకే దానికీ ఒప్పుకోలేదతడు.

ఇక మిగిలిన దారి ఒక్కటే. కాఫీ తోటకు వెళ్ళి ఋణం తీరే దాకా అక్కడ పని చెయ్యడం. అందులోని రహస్యం

చోముడికి తెలియనిదేముంది? కాఫీ తోటల్లో పని చేసే వారి అప్పు
ఇంత వరకు తీరడమన్న మాటే లేదు. ప్రతి సంవత్సరమూ అప్పు
చెయ్యడం తప్పని సరిగా జరుగుతూనే ఉంటుంది. అది కా
కూడా తరగకుండా అలాగే ఉండనూ ఉంటుంది. కాఫీ తోటలో
అప్పు, అక్కడి జ్వరాలు ఒకేలాంటివి. పట్టుకోడమే గాని వది
పెట్టడం తెలియదు వాటికి.

సరె. ఇక వేరే దారేముంది గనుక! యజమాని దగ్గర కెళ్ళి
అప్పు అడగడం ఆయన కాదంటే ఒకరో ఇద్దరో తోటకు వెళ్ళి
అప్పు తీరే దాకా మన్వేలుడి యజమాని దగ్గర చాకిరీ చేసి రావడం
ఎంత ఆలోచించినా చోముడి మనసులో రెండవ దానికే ఎక్కువ
బలం ఉన్నట్టు తోస్తోంది. కాని అతడికి తోటలోని బ్రతుకు
బొత్తిగా ఇష్టంలేదు. సంవత్సరానికి ఎంతో మంది పేదవాళ్ళు
తోటలకి వెడుతూనే ఉన్నారు వస్తూనే ఉన్నారు. చోముడు కూడా
వెళ్ళాడు; వచ్చాడు. కాని, అక్కడి బ్రతుకుమీద అతనికి
కోశానా మమత కలుగలేదు. వెళ్ళడం, చాకిరి చెయ్యడం, తిరి
రావడం వెళ్ళేడప్పుడున్నంత సంపదే వచ్చేడప్పుడూను. ఆమాత్ర
బ్రతుకు వెళ్ళదీయడానికి ఉన్న ఊళ్ళో పని చేసుకుంటే పోలా
ఈ ఆలోచనలన్నీ ఉట్టుట్టి వేదాంతమే. రేపు యమదూతలా మన్వే
లుడు వచ్చి నుంచున్నాడంటే అతనెదుట ఏ మాత్రం పనికి రా
ఆలోచనలే ఇవన్నీను. కనుకనే బెళ్ళిని పిలిచి, "బెళ్ళీ నేను
ఉట్టినే ఏదేదో ఆలోచిస్తున్నాను గాని, ఒక్కటి కూడా పనికి రావిదే
రేపు వెడతాను. నాలుగు నెలలుండి వస్తాను" అన్నాడు. బెళ్ళికి
నెత్తిన పిడుగుపడ్డట్టయింది. వృద్ధుడైన తండ్రి ఈ వయసులో
తోటలో చాకిరీ చెయ్యడం ఆమెకు నచ్చలేదు. అతడు వెడితే
ప్రయోజనమూలేదు. నగదుగా దొరికిన పైసా కూడా అప్పులో
జమ అయ్యే మాటుండదు. కాఫీ తోటల దగ్గర కల్లు అంగళ్ళు
ఉండనే ఉంటాయి.

బెళ్ళి మౌనంగా ఉండిపోవడాన్ని చూసి చోముడే అన్నాడు. అవును, వెళ్ళక తప్పేదేముంది? లేదంటే చనియ, గురువలని ంపాలి. కాని, వాళ్ళింకా చిన్నపిల్లలు."

చనియ, గురువలు ఇంకా చిన్నపిల్లలు! నిజమే, ఆ తండ్రికి శ్శైప్పటికీ చిన్నపిల్లలే. వారి మనసుల్లో మాత్రం మీసాలు చ్చినా కూడా తామింకా పెద్దవారు కాలేదా. అనిపిస్తుంది. స్వతం ంగా బ్రతకాలన్న ఆశా ఉంది. ఆతోట పేరు విని చోముడికి తి కలిగినా వాళ్ళకి అది ఆకర్షణీయంగానే ఉంది. నెలకి ఎనిమిది. ది రూపాయల నగదు, జీతంగా చేతిలో పడుతుంది. అలాం ప్పుడు అది ఒదులుకుని ఊళ్ళో రెండు పావుశేర్లు వడ్లగింజల ోసం చాకిరీ చెయ్యడం ఏం న్యాయం? అని వారి ఆలోచన. బెళ్ళి ననే అంది. "ఈ వయసులో నువ్వు ఈ చిన్నిపిల్లలని ఇల్లు- ాకిలిని వదిలి పెట్టి దూరం వెళ్ళడం మంచిది కాదు. కాళు, వీలు మైపోతారు? వాళ్ళనీ తీసుకుని బయలుదేరి పోవడం మాటలా? దెలాగూ కుదరదు, ఇక్కడ యజమాని ఋణం తీరుతుందా ంటే అదీలేదు."

చోముడి మొహం నల్లబడింది. అదీ నిజమే. యజమాని నసు నొప్పించడం ఇష్టంలేదు. అతని పిల్లలమీద భరోసా ఉంచి తడిని వెళ్ళనివ్వరు. ఇక ఉన్నది ఒక్కటే దారి. పెద్ద కొడుకు ద్దరినీ అక్కడకి పంపడమే. ఒక్కడినే పంపడానికి ధైర్యం ాలదు. అక్కడేదైనా రోగం-రొచ్చు వస్తే ఒకరికొకరుంటారన్న ధైర్యం. ఇద్దర్నీ పంపితే ఇంకో భయం ఉంది. ఇద్దరు కలిసి డెడు సావాసాలకి లోనై, తాగుడూ అవీ నేర్చుకుని, అప్పు తీర్చేం దుకు బదులుగా ఎక్కువ చేసుకుని వస్తే!

ఉన్న ఊళ్ళోనే దొంగతనంగా వాళ్ళు తాగుతున్న సంగతి ముదుసలి చోముడికేం తెలుసు? ఆఖరికి బెళ్ళి నచ్చచెప్పింది.

'అయ్యో! వాళ్ళింకా చిన్నపిల్లలే అనుకుంటున్నావా? బాధ్యత తెలు
కుని కాపురాలు చేసుకోవలసిన వాళ్ళు, పెళ్ళీడు వచ్చిందిగా! ఇవా
రేపో ఎవళ్ళనో ఒకళ్ళని కట్టుకుని కాపురాలు చేయవలసిన వాళ్ళ
ఇంట్లో కూర్చోబెట్టుకోవడం న్యాయమా?

చోముడి ఆలోచనలు ఎక్కడెక్కడికో పోయాయి. పె
కొడుకు చనియుడికింత వరకు పెళ్ళిచెయ్యలేదు. అతని వయ
ఉన్న యజమాని సంకప్పయ్యగారికి పెళ్ళయి నాలుగేళ్ళయిందప్పుడ
తను పీదవాడు నిజమే. అలాగని కొడుక్కి పెళ్ళిచేయడం మా
స్తాడా? ఊహూఁ కొడుక్కి తొందరగా పెళ్ళిచెయ్యాలి తప్పద
పెళ్ళిచేసి తోటకి పంపినా బాగుండును. కాని మన్వేలుడు రే
వస్తున్నాడు కదా! కొడుక్కి కాస్త పెళ్ళి ఆశపెట్టిపంపితే కా
డబ్బులు మిగిల్చి తెచ్చే అవకాశం ఉంది.

పెళ్ళి అనగానే బెళ్ళిసంగతీ గుర్తొస్తుంది. దానికి పెళ్ళి
దాటిపోలా? కాని కూతుర్ని అల్లుడితో పంపించాల్సి వస్తుందన
బెంగతో ఆమెపెళ్ళి ప్రస్తావనే తీసుకురాడు చోముడు. 'ఇం
చిన్నపిల్ల తొందరేం?' అంటూ ఉంటాడు.

మాటల్లోనే పొద్దుపోయిందని గబగబ యజమాని ఇం
కేసి బయల్దేరాడు చోముడు. బెళ్ళి తమ్ముళ్ళకు తాగడానికి గం
ఇచ్చి ఆకుకోసుకు రావడానికి అడవికేసి బయలుదేరింది. చోముడ
ఇంకా వందడుగులు వెయ్యకముందే, 'చోమూ!' అన్న యజమా
పిలుపు వినిపించింది, ఆయన ఇతనికోసం ఎదురుచూస్తున్నాడు.

చోముడు యజమాని ఇంటిముందుకు వచ్చేసరికి కూ
వాళ్ళంతా పలుగూ, పార తట్ట బుట్ట పట్టుకుని సిద్ధంగా నుంచ
న్నారు. యజమాని చోముడికోసమే అన్నట్టుగా ఎదురు చూస్తున్నార
చోముడికి సందర్భం అర్థమయింది.

మారు మాట్లాడకుండా చకచక పన్లోకి ప్రవేశించాడు. వెనుక
వర్షాకాలంలో ఓ కుంట నిండి గట్టు తెగి దిబ్బమీద మట్టినంతా ఒ

మడిమీదకి తెచ్చి పేర్చింది. ఈసారి వర్షాకాలం లోపల ఆ మట్టిని తీసేసి కుంటగట్టుని సరి చెయ్యకపోతే మొత్తం బయలు లోని సాగుకే దెబ్బ. ఇంకా రెండు మూడు రోజులు చేస్తే గాని పని పూర్తవదు. అకాల వృష్టి భీతి ఉండనే ఉంది.

చోముడు అమిత ఉత్సాహంతో మడిలో పేరుకుపోయిన మట్టి, చెట్ల కొమ్మలను తవ్వి తవ్వి తట్టల కెత్త సాగాడు, ఆవాళ అతనికి ఆవేశం వచ్చిందనే చెప్పాలి. మోసే కూలీలు అతని వేపు ఆశ్చర్యంతో చూడసాగారు. ఇన్ని రోజులూ అప్పుడప్పుడు అలసట తీర్చుకోడాని కన్నట్లు మధ్య మధ్యలో కబుర్లాడుతున్న చోముడు ఇవాళ ఊపిరి పీల్చుకోవడం మర్చిపోయినట్లుగా పని చేస్తున్నాడు. ఒకరోజు పూర్తిగా చేస్తే గాని అవని పని మధ్యాహ్నానికి పూర్తయి పోయింది. సంకప్పయగారి సవారి, పనివాళ్ళు ఎలా పనిచేస్తున్నారో చూడ్డానికి అటు వచ్చింది. చోముడి చురుకుదనం చూసి ఆయనకీ ఆశ్చర్యం వేసింది. ''ముదుసరి చోముడికి పడుచుదనం వచ్చిందే?'' అనుకున్నారు సంతోషంగా. ఉదయపు పని ఆపేసరికి పొద్దు తిరిగి అర గంటయింది. పనివాళ్ళు ఆయాసంతో రొప్పుతూ నడుస్తున్నారు. చోముడు వేళ్ళతో చమట తుడుచుకుంటూ యజమాని ఇంటి ముందు 'ఉస్సప్పా' అంటూ కూర్చున్నాడు. సంకప్పయ్యగారు అప్పుడే భోజనం కానిచ్చి వీధి వాకిట్లో అరుగు మీద కూర్చున్నారు. ప్రసన్నవదనంతో తమల పాకులు—వక్కలతో బాటు ఓ పొగాక్కాడనీ వాడి వేపు విసిరారు. పొగాకంటే చోముడి రెండవ ప్రాణం. ఇవాళ సంకప్పయ్యగారు స్వయంగా తాము వేసుకునే పొగాకు కాడనే అతని వేపు పడేశారు. ఇక చోముడి ఆనందం 'ఇంత' అని చెప్పలేం. తమలపాకులు నములుతూ, పొగాక్కాడకు సున్నం రాస్తూ కూర్చున్నాడు. అకస్మాత్తుగా సంకప్పయ్యగారు, "అవునూ, నీ ఎద్దుల్ని దేవుడి పేర వదిలి పెట్టావా ఏమిటి?'' అన్నారు.

చోముడు చిరునవ్వు నవ్వాడు.

సంకప్పయ్యగారే మళ్ళీ, "చోమూ! మా ఇంటి ఎద్దు జత ముసలితనంలో పడ్డాయి. "వాటిని నమ్ముకుని ఈ సంవత్సరం వర్షాకాలం గడపలేం. నీ ఎద్దుల జత నెందుకు కట్టకూడదు?" అన్నారు.

చోముడి నోట్లోంచి మాటే రాలేదు.

"వాటిని మాకు అమ్మినా సరే, లేదా నీవిగా మా ఇంట్లో ఉంచినా సరే, నీ ఇష్టం."

చోముడికి ఏం చెప్పాలో తోచలేదు.

"ఊరుకున్నావేం? వాటిని నాగలికి కట్టనని మొక్కుకున్నావా ఏం?"

ఇక విధిలేక నోరు విప్పాడు చోముడు. "నాగలికి కట్టకుండా ఉండటానికి నేనేమైనా గంగిరెద్దులాడించే వాడినా?"

"సరే అయితే, ఈసారి నీ ఎడ్లని నాగలికి కడదాం. నేను వేరే జతకోసం చూడక్కర్లేదు కదా! నగదుగా కావాలంటే ఇస్తాను. ధర ఎంతో నువ్వైనా చెప్పు, పైవాళ్ళయినా చెప్పనీ, ఇచ్చేస్తాను."

"డబ్బుకి అమ్ముకోవాలని లేదు. వాటిని మీ పనికి వాడకూడదనీ కాదు. కాని, చాలా కాలంగా నా మనసులో ఒక భ్రమ ఉండి పోయింది. దాన్ని తమరే తీర్చాలి."

సంకప్పయ్యగారికి చోముడి మనసులోని భ్రమ సంగతి తెలుసుకునే అవకాశం రాలేదు. ఏదో పనిమీద లోపలికి వెళ్ళిన ఆయన మళ్ళీ వెంటనే బయటకు రాలేదు. మధ్యాహ్నపు పనికి వేళయిందని చోముడు వెళ్ళిపోయాడు. ఉదయంలాగానే చురుగ్గా పని చేశాడు. పని పూర్తి చేసుకున్నాకా తిరిగి వచ్చాడు.

సంకప్పయ్యగారికీ సంతోషమయింది. చోముడు నమ్మిన బంటని తెలుసాయనకు.

చిరు చీకట్లు క్రమ్ముతున్నాయి. యజమాని కూలివాళ్ళకు బియ్యం కొలిపిస్తున్నాడు. అందరూ వెళ్ళిపోయినా చోముడు మాత్రం ఆయనతో మాట్లాడాలనే ఆశతో కూర్చునే ఉన్నాడు. ఏదో అడగడానికి చోముడు కూర్చున్నాడనే సంగతి ఆయనకూ అర్థమయింది. చిరునవ్వు నవ్వుతూ, ''ఏమిటివాళ, చోముడి సవారి కల్లు పాకవేపు వెళ్ళదా ఏం?'' చోముడికి కల్లు పాక మరుపు రావడం సాధ్యమా? మరో ఆశతో ఇక్కడ కూర్చుని ఉండి పోయాడు గాని....

"ఇవ్వాళ వెళ్ళను.... ''

''అయితే కూర్చున్నావేం? ఇంటికి వెళ్ళి దప్పు మ్రోగించక!....... ఊళ్ళో ఎవరూ నిద్రపోకూడదనికదా నీ ఉద్దేశం....?''

ఆయన పరిహాసానికి చోముడు నవ్వాడు.

సంకప్పయ్యగారు అతడిని పలుకరించడానికి ప్రయత్నిస్తున్నారు 'మరి ఎందుకూర్చున్నావ్?'

'మరేంలేదు ఎడ్లసంగతి....'

'చెప్పు సంకోచ పడక్కర్లా.'

'అదేంకాదు తమరికి ఇంతమంది కౌలుదార్లున్నారు. ఈ బికారికీ ఓచెక్క భూమి దున్నడానికి ఇస్తే మీపేరు చెప్పుకుని బతుకుతాడు.'

చోముడి మాట సంకప్పయ్యగారికి అమితమైన ఆశ్చర్యాన్ని కలుగజేసింది.

'మాదిగ వాళ్ళు సాగు చెయ్యడమా!' అనిపించింది. కాని ఆయన దగ్గర బంజరు భూమి చాలానేవుంది దాన్ని అతడు సాగు చేసుకుంటే ఏం? అనిపించి ఆ సంగతి తన తల్లిని అడగడానికి లేచి లోపలికి వెళ్ళారు. చోముడు మనసులోని ఆశ అంతటిని కళ్ళల్లో నింపుకుని ఎదురు చూస్తున్నాడు. తను నాగలిపట్టే మంచిరోజులు వచ్చాయని హృదయం ఉల్లాసంతో ఉప్పొంగింది కాఫీతోట సంగతే మర్చిపోయాడు.

'చోముా, ఇంతకు మును పెప్పుడూ మా పెద్దలు మీ
వాళ్ళకి కౌలుకి భూమి ఇవ్వలేదు, ఇప్పుడలా ఇవ్వడానికి వీలూలేద
అన్నారు' ఇక మాటకి తిరుగులేదు. ఆ ప్రస్తావన అంతటితో
పూర్తయినట్లే ఇంట్లోనుండి సంకప్పయ్యగారి తల్లి. 'అబ్బ ఈ
మాదిగవాళ్ళెంత మితిమీరిపోయారో' అని విసుక్కోవడం విని
పించింది. చోముడు నిరాశతో ఇంటికి బయల్దేరాడు కాని అతడి
దురదృష్టానికన్నట్టు సరిగ్గా అదే సమయానికి మన్వేలుడి సవారి
సంకప్పయ్యగారి దగ్గరకొచ్చింది.

రాగానే అపశకునంలా మీ పాలేరునుంచి మరో ఇరవై
రూపాయలు రావాలి ఎప్పటికి వస్తుందో తెలియకుండా ఉంది.
అన్నాడు. అని మన్వేలుడే అంతా చెప్పుకొచ్చాడు.

సంకప్పయ్యగారు కోపంతో'చోమా, అప్పులేమీ లేవని
నాతో అనలేదూ నువ్వు?' అంటూ గద్దించాడు చోముడు తల వంచే
శాడు. మన్వేలుడు రాత్రిభోజనానికి అక్కడే ఉండిపోయాడు చోముడు
కాళ్ళీడ్చు కుంటూ బయల్దేరాడు ఇంటికికాదు, బిరుమ పూజారి
కొట్టుకి.

4

సంకప్పయ్యగారి ఇంటినుండి బిరుమపూజారి దుకాణం సుమారు
మైలున్నరదూరం ఉంటుంది, చోముడు కాళ్ళీడ్చుకుంటూ నడవ
సాగాడు. దారి పొడుగునా తనకి ఎవరు ఎదురు వచ్చారో, ఏమిటో_
అతడికి ఆధ్యాసేలేదు. అతడి మనసంతా ఉద్వేగంతో ఉడికిపోతోంది.
తన నుదుట నాగలి పట్టే రాతలేదే అని మాటిమాటికీ వాపోవసాగాడు.
ఎన్నోమార్లు ఒక గవర్నమెంటు ఆఫీసరెవరో వచ్చి అతడిని పిలిపించి

ద్దరిస్తామన్నారు. భోగనపల్లెకు అవలఉన్న ఓమడిచెక్కని గవర్న
ంటు ద్వారా ఇప్పిస్తాననీ అన్నారు. అలా జరిగుంటే. ఈపాటికి
న్ని దున్ని, సాగు చేసుకుని ఉండేవాడు. తనదంటూ కొంత భూమి
ండేది. తృప్తి మిగిలేది. కాని అతడే ఆవిషయం వేపు దృష్టి
నివ్వలేదు. పోనిచ్చినా సుఖంగా ఉండేవాడినన్న ధైర్యమూలేదు.
నుకా, ముందూ చూడకుండా ఝూమ్మని సంకప్పయ్యగారిని కాదను
ని వెళ్ళి, ఊరిబయట 'బంగళా' కట్టుకుని కూర్చుంటే చాలా?
ప్పుడయితే రోజుకి తప్పని సరిగా పావుశేరు బియ్యం దొరుకుతోంది
అక్కడికి వెళ్ళిపోతే అదీ సున్నాకదా! అతడి మనసులో ఇలాంటి
ఆలోచనలు సుళ్ళు తిరుగుతూండగానే కల్లుఅంగడి వచ్చేసింది.
రుమపూజారి తలుపులు మూసుకుని వెళ్ళే ప్రయత్నంలో ఉన్నాడు.
అతడినిచూసి ఆగాడుగాని. లోపలకల్లు చాలా కొద్దిగా మాత్రమే ఉంది.
చోముడు వస్తాడుకదా అని అతని వాటా ఎవరు దాచి ఉంచుతారు?

చోముడు రాగానే కాళ్ళు బార్లాజాపి కొట్టుముందు కూలబడి పోయాడు. గుడ్డలో మూటకట్టి తెచ్చిన రెండు రోజుల భత్యం శేరు బియ్యాన్ని బిరుమడి ముందు పోశాడు. బిరుమపూజారి మొదట బియ్యాన్ని కొల్చుకుని లోపలకి తీసుకెళ్ళాడు. వెడుతూ వెడుతూ, శేరుకి అరపావు తక్కువగానే ఉంది అని చెప్పిమరీ వెళ్ళాడు. మొత్తంమీద సంకప్పయ్యగారి శేరుకీ, బిరుమ పూజారి శేరుకీ అరపావు బియ్యం తేడా వచ్చింది. ఏదేమైనా బియ్యం తీసుకుని లోపలకి వెళ్ళినందుకు ఒక ముంతనిండా కల్లునింపి ఇచ్చాడు. అదికూడా అంతా కల్లుకాదు. నీరు కలపగా ఆమాత్రం ఇవ్వగలిగాడు.

చోముడికి ముంత అంటే ఒక్క గుక్కకు సరిపోదు. "నంజుడికేమైనా ఉందా?" అన్నాడు. అంత పొద్దుపోయాక ఇంకా ఏముంటుంది? వేలు కొరుక్కోవలసిందే!

"ఇంతేనా ముప్పావు శేరు కీను?"

"ఇందులో నీళ్ళు కలపలేదు మరి" అన్నాడు బిరు పూజారి. కాని చోముడు ఒక పట్టాన వదలడని తెలుసు గను లోపలికి వెళ్ళి కుండకి అంటుకున్న కాస్తో కూస్తో కల్లుకి నీళ్ళ కలిపి, మరో ముంత తెచ్చి ఇచ్చాడు. చోముడు క్షణంలో ముంత పైకెత్తి గొంతులో పోసుకున్నాడు. "ఇంకా...." అనే లోప బిరుమపూజారి తలుపులు మూసేసి చకచక వెళ్ళిపోయాడు. చోముడి ఎక్కడలేని కోపమూ ముంచుకొచ్చింది. "కే. హే" అంట పిచ్చిగా అరిచాడు. ఏవో పదాలను గొణుగుతూ పిచ్చి గంతు వేస్తూ గడిపాడు. చాలా సేపే అలా ఉండిపోయాడేమో. అతడి తెలివి వచ్చేసరికి అర్ధరాత్రి దాటిపోయింది. అకస్మాత్తుగా వచ్చి వర్షం వల్ల అతడి ఒళ్ళు తడిపి మెలకువ వచ్చింది.

పైకి లేచి, చెప్పకుండా వచ్చిపడిన వర్షాన్ని తిడుతూ ఇం దారి పట్టాడు. సన్నగా తుంపర పడుతూనే ఉంది. అప్పుడప్పుడు మేఘాలు గర్జిస్తున్నాయి. మెరుపులు మెరుస్తున్నాయి. ఆ మెరుప వెలుగులో తడబడుతూ. తూలుతూ గుడిసెవేపు నడవ సాగాడు ఇప్పుడు యజమాని జ్ఞాపకంగాని, వ్యవసాయం గురించిన వ్యథ గాని ఏవీ లేవు అతనికి—వర్షం మీద, బిరుమ పూజారి మీద కోపం తప్పించి.

వర్షంలో తడిసిపోతూ, జారి పడుతూ అతడు గుడిసె చేరు కునే సరికి గంట పైగానే పట్టింది. అయినా చోముడికి గంటలతో పనేమిటసలు? గుడిసె ముందు నిలబడి "బెళ్ళి" అని కేక పెట్టాడు. "బెళ్ళి తండ్రిని గురించిన బెంగతో నిద్ర పట్టక మెలకువగానే ఉంది. తండ్రి గొంతు వినగానే చటుక్కున లేచి తడిక తలుపు తీసింది. ఒక్కసారిగా వీచిన గాలితో పాటు చోముడూ లోపలి కొచ్చి పడాడు. మళ్ళీ తలుపు మూసేసింది బెళ్ళి. లోపలంతా చీకటి. కొంచమయినా వెలుగు తెప్పిద్దామని పొయ్యి ముందు కూర్చుని ఊద సాగింది. మొహం నిండా బూడిద పడ్డం తప్పించి,

మరే ప్రయోజనం లేక పోయింది. ఇంకేం చెయ్య లేక గంజి ఉంచిన చట్టినితెచ్చి తండ్రిచేతికిచ్చింది. "నీకేది?" అనడిగాడు. కాని అప్పటికి బెళ్ళిభోజనం అయింది. చోముడు ఒక్కగుక్కలో గంజి అంతా తాగేశాడు. కల్లుమీది కోపం గంజిమీద చూపించాడు. బయట వర్షం వస్తూనే ఉంది. చోముడి మనసులో అశాంతి తగ్గేలా లేనే లేదు. అందుకే దప్పుకోసం చీకట్లోనే తడుముకుంటూ వెతక బోయాడు. బెళ్ళి "అయ్యా, ఏమిటి నువ్వు వెతికేది?" అనడిగింది. "మరి. మరి...." అంటూ వెతుకుతూనే ఉన్నాడు. బెళ్ళి అతని జబ్బ పట్టుకుని పిల్లల్ని తొక్కేస్తావు అంటూ ఆపింది. "నాకు కళ్ళులేవా?" అని కూతుర్ని గద్దించాడు చోముడు. ఆఖరికి దప్పు, చేతికి దొరికింది. దప్పు చేతికిదొరగ్గానే ఆవేశంతో రెండు దెబ్బలు వేశాడు.

ఇక ఆ చప్పుడుకి పిల్లలు లేస్తారన్న బెంగతో బెళ్ళి తండ్రి చేతిలోని దప్పులాక్కుని గద్దించింది. "అర్థరాత్రి అపరాత్రి అంటూ లేకుండా పీకలదాకా తాగిరావడం దప్పు వాయించడం. ఇక పిల్లలు నిద్రపోనక్కర్లా?" అంటూను, అపూర్వమైన ధైర్యం బెళ్ళిది. తండ్రిమీద ఆమెకున్న అమితమైన ప్రేమే ఇప్పుడతని మీద కోపం తెప్పించింది. ఆమె కంఠం వింటుంటేనే భీతికలిగింది చోముడికి. ఏం చెయ్యాలో తోచలేదు. బెళ్ళి అతనికిక మాట్లాడే అవకాశం ఇవ్వలేదు. "ఊఁ, ఇకరా ఇటు పడుకో రేపు మేస్త్రీ వస్తాడని తెలియదూ?" అంటూ తండ్రిని లాక్కొచ్చి పడుకో బెట్టింది. తండ్రి పీకలదాకా తాగి వచ్చుండాలని బెళ్ళి అభిప్రాయం. చోముడిక్కూడా తాను బాగా తాగి మత్తెక్కి గొడవ చేస్తున్నానేమో అనుమానం. ఇంతకీ అతను తాగిన దాంట్లో అరముంతే తాజాసరుకు మిగతాదంతా నీళ్ళేకదా!

చోముడు పడుకున్నాడు బెళ్ళి పడుకుంది. నిద్రపోయారో లేదోగాని తెల్లవారింది. చోముడు తప్ప అందరూ నిద్రలేచారు. బెళ్ళి త్వరగా పొయ్యిలో నిప్పు చెయ్యబోయింది. గాని, అక్కడ

ఒక్క నిప్పు రవ్వ కూడా లేకపోవడంతో యజమాని ఇంటి వరుగున వెళ్ళి. నాలుగు అగ్గిపుల్లలు అడుక్కుని తెచ్చింది. వస్తూ సంకప్పయ్యగారింట ముంగిట్లో కాఫీతోట మేస్త్రీ ఉండటాన్ని చూసి త్వరగా తండ్రిని లేపుదామని వెళ్ళింది. తట్టిలేపబోయి. ఉలిక్కి పడింది బెళ్ళి.

చోముడు మగతగా నిద్రపోతున్నాడుగాని. ఒళ్ళుకాలి పోతోంది. గాబరా పడుతూనే తనపన్లు చేసుకోసాగింది. త్వరగా నాలుగు మోపుల ఆకు తెచ్చి యజమాని ఇంటిదగ్గర పడెయ్యమని అన్నలిద్దరికీ పురమాయించింది. వాళ్ళు గంజికోసం కూడా కాచు కోకుండా కత్తి తీసుకుని అడవికి బయల్దేరారు. నీల, కాళలు బయటకు వచ్చి చూచేసరికి చెట్టుకు కట్టిఉన్న ఎడ్లజత వణుకుతూ నుంచుని ఉండడం కనిపించింది. వాటికోసం వేసిన పాక ఎప్పుడో పడిపోయింది, మళ్ళీ కొత్తగా వెయ్యడం పడలేదింకా. పిల్లలిద్దరూ అక్కదగ్గరికి వెళ్ళి. "అక్కా, ఎడ్లు రాత్రంతా వానలో తడుస్తూ ఉండిపోయాయి." అన్నారు.

బెళ్ళికి, వర్షంలో ఎడ్లు తడుస్తాయని ఆలోచించేటంత తీరికేది? ముదుసలి తండ్రి గురించిన చింత, మన్వేలుడి అప్పు గురించినచింత— వీటిమధ్యన ఇక దీన్ని గురించి ఆలోచించే తీరిక లేకపోయింది. బయటికి వచ్చి. వాటికి కట్టిన తాడు విప్పి మేతకు తోలి వచ్చింది. వస్తూ, ఈ ఎడ్లజత తమ స్థోమతుకి ఎక్కువ కామా?'' అనుకుంది.

ఏరి తెచ్చిన తడిపుల్లలతో నిప్పురాజేసి, గంజికాచి దించేసరికి చోముడు లేవడం, మన్వేలుడు రావటం అన్నీ ఒక్కసారే జరిగాయి. "చోమూ!" అని గట్టిగా కేకేశాడు మన్వేలుడు. "ఎవరది?" అన్నాడు చోముడు. బెళ్ళి వచ్చింది. ఎవరొచ్చారో తండ్రికి చెప్పి. "నువ్వు పడుకో అయ్యా, ఒళ్ళు కాలిపోతోంది. వానలో తడిస్తే జ్వరం రాకేం చేస్తుంది?" అంది. తండ్రిని లేవనీయకుండా తనే బయటికి వచ్చి. "అయ్యకి జ్వరం, కాస్త ఆగిరండి." అంది.

మన్వేలుడు కోపంతో మండిపడ్డాడు. "జ్వరమా! జ్వరం రాడానికేం! నిన్న సాయంత్రం సంకప్పయ్యగారింటి దగ్గర చూడలేదూ వాడిని! మహాశూరుడిలా వాగుతున్నాడుగా! ఇప్పుడు నేను వస్తున్నానని జ్వరం ముంచుకొచ్చిందా ఏం?" అన్నాడు. నిజం చెప్పినా నమ్మటం లేదే అని బెళ్ళికి కోపమూ దుఃఖమూ ముంచుకొచ్చాయి. ఆమె బదులు చెప్పనేలేదు. అయినాసరే మన్వేలుడి నోటికి అడ్డులేక పోయింది. తనకి తెలిసిన తిట్లన్నీ ప్రవాహంలా బయటికి కక్క సాగాడు. ఎంతయినా అప్పు ఇచ్చినవాడు కదా! నేరుగా ఇవ్వక పోయినా ఇప్పించాడుగా!

అతని మాటల తీవ్రత ఎక్కువయిన కొలదీ, లోపల చోముడి ఓర్పు నశించసాగింది. వణుకుతూ, తడబడే అడుగులతో తలుపు దగ్గరకి వచ్చి, "జ్వరం ఉందో లేదో నా ఒళ్ళు ముట్టి చూడండి" అన్నాడు. అతని మొహం, మాటల్లోని వణుకు అతని పరిస్థితిని మన్వేలుడికి తెలియపరిచాయి. దాంతో కాస్త మెత్తపడి శాంతంగా, "కాదు చోమా, ఇవాళ నన్ను రమ్మన్నావా మరి. నేను, నిన్ననే మీ యజమానితో ఈ సంగతి ప్రస్తావించాను. ఆయనా నీ పాతబాకీ తీర్చడానికి ఒప్పుకోలేదు" అన్నాడు.

"అయ్యో, మా అయ్యగారి దగ్గర నా అప్పు సంగతి ఎందు కెత్తారు బాబూ!"

"అడిగాను మరి! నువ్వు తోటకు రాలేకపోతే మా అప్పు తీరడానికి ఏదో మార్గం చూడాలిగా మరి."

"మీ అప్పు తీర్చక నేను తినేస్తాననుకున్నారా?"

"ఈ అయిదేళ్ళుగా తీర్చావా ఏం? నీకూ పెద్ద వయసు వచ్చి పడుతోంది. నీకు రావాలని లేకపోతే పోనీయ్. నీ ఎడ్ల జత నైనా అమ్మేసి...."

"నా ఎడ్లజతని అమ్ముతాను, మానుతాను. మీకెందుకు? మీ డబ్బు ఇరవై రూపాయలూ తీరిస్తే సరికదూ! నేను రాలేను. అదిగో నా పిల్లలిద్దరున్నారు తీసుకెళ్ళండి."

ఆ వేళకు సరిగ్గా చనియ, గురువలు ఆకు మోపులతో వచ్చారు, వాళ్ళని చూపిస్తూ,

''చూశారా, మీ డబ్బుకేం భయంలేదు. ఇద్దరూ ఇద్దరే, ఉక్కు పిడుగుల్లా ఉన్నారు తీసుకెళ్ళండి. మీ అప్పు తీరేదాకా వాళ్ళ చేతుల్లో చిల్లిగవ్వ పెట్టకండి భోజనానికి ఎంత కావాలో అంతే ఇవ్వండి మీ అప్పు తీరే దాకా నాలుగు నెలలో, ఆరు నెలలో పని చేయించుకుని వెనక్కి పంపేయ్యండి.''

చనియ, గురువలిద్దరికి ఈ సంగతి ముందుగానే తెలుసు. వాళ్ళు వెళ్ళడానికి సిద్ధంగానే ఉన్నారు. బెళ్ళి అన్నలిద్దర్నీ పిలచి ఆప్యాయంగా పలుకరిస్తూ గంజి త్రాగటానికిచ్చింది. ఇహ భోజనం అయిందనిపించుకుని ఇవతలకి వచ్చారు, మన్వేల మేస్త్రీకి లోలో పల ఖుషీగానే ఉంది. ఒక జీతగాడికి మారుగా ఇద్దర్ని కొట్టుకు పోతున్నందుకు.

కొడుకులిద్దరూ బయటకి రాగానే ప్రయాణానికి సిద్ధంగా ఉండమన్నాడు చోముడు. కాని వాళ్ళ కలాటి హంగామా ఏముం టుంది గనుక; ఉన్న పళంగా బయల్దేరడమే. తండ్రి వాళ్ళకి ఏమేమి అవసరం వస్తాయో ఊహించుకుని, ఒక 'బీళలు'* పెట్టి, తన కంబడి, ఒకటి, రెండు చినిగిన గుడ్డల్ని పోగుచేసి ఇచ్చాడు. ఇహనిప్పుడు వాళ్ళు ప్రయాణానికి సిద్ధమైనట్లే. పాపం భోగనపల్లె వదిలి పది మైళ్ళు కూడా ఎప్పుడూ వెళ్ళనివారు, ఇప్పుడు ముసలి తండ్రిని వదలి వెళ్ళాలంటే కష్టంగానే ఉంది. తండ్రిని, బెళ్ళిని చూసి కంటనీరు నింపుకున్నారు. చోముడు వాళ్ళని దగ్గరకు తీసు కుని, "చనియ, మళ్ళీ అప్పు చేసుకుని రామాకు, ఎలాగైనా పని చేసి వారి అప్పు తీర్చేయ్యగలిగితే ఇక తోటకు వెళ్ళాల్సిన అవ

---

* బీళలు — పెద్ద పెద్ద వృక్షాలపై పరాన్న జీవులుగా జీవించే లతలు—ఆ చెట్టు కొమ్మల నుండి క్రిందకు వ్రేలాడుతూ ఉంటాయి. ఆ వ్రేలాడే తీగలతో పేము బుటల వంటివి తయారు చేస్తారు.

వరం ఉండదు గురువ. నీకు కోపం ముక్కుమీద ఉంటుంది కదా. దొరగారితోగాని, మేస్త్రీగారితో గాని దురుసుగా మాట్లాడకు. ఇద్దరూ అక్కడ చెడు సావాసాలు చేసి కల్లుపాకలో దూరకండి. నేనొక్కడిని ఈ అలవాటు చేసుకున్నది చాలు, నా బ్రతుకంతా ఇలా తిరిప మెత్తుతూనే గడిచిపోయింది. మీరింకా పెళ్ళి చేసుకుని ఇల్లు-ఇంటిది అనుకుని బతకాల్సిన పిల్లలు" అన్నాడు అతనికి దుఃఖంతో నోట మాట పెగల్లేదు. చనియడిని కౌగలించుకుని తన వేలికి ఉన్న ఒకే ఒక్క వెండి ఉంగరాన్ని తీసి, అతడి వేలికి తొడిగి, "అవ వరం వస్తే అమ్ముకుని తినండి పిల్లలూ చనియా, తొందరగా అప్పులేదనిపించుకుని వచ్చెయ్యండి. మళ్ళీ వర్షాకాలం లోపల నీకో మంచి సంబంధం చూసి ఉంచుతాను" అన్నాడు.

తరువాత ఎక్కువగా మాట్లాడలేదెవరూ. ఒకరి మొహం ఒకరు చూసుకుంటూ కళ్ళనీళ్ళు పెట్టుకున్నారంతే. సరె, ఇంకో గడియ లోపల తండ్రి చూస్తుండగానే కొడుకులు దూరదూరంగా వెళ్ళిపోయారు.

5

చనియ గురువులు ఇల్లువదలి చాలా ఉత్సాహంగానే తోటవారి పట్టారు. మన్వేలుడి వెనుక మొదట బయల్దేరింది వాళ్ళిద్దరే అయినా. సాయంకాలం లోపల పదిమందిదాకా కలిశారు. రెండు రోజులు ప్రయాణం చేసి 'బెళ్తంగడి' అనే ఊరు చేరుకున్నారు. అక్కడ వాళ్ళ గుంపులోనివారి సంఖ్య నూరుదాకా పెరిగింది. అప్పుడిహ మన్వేలుడి ఉత్సాహానికి పట్టపగ్గాలు లేవు.

కొంతమంది కూలీలకు తాము ఎటువేపునుండి వెడతామన్నది కూడా తెలియదు. తోటకి వెళ్ళడానికి బెళ్తంగడి నుండి బస్సు సౌకర్యం ఉంది. కాని కాలినడకన కళసం (తోట ఉండే ఊరు) చేరుకోవడానికి వేరే మార్గం కూడా ఉంది. కొంతమందికి బస్సులో వెళ్ళాలని కోరిక. కొంతమందికి నడిచే వెడదామని ఉంది. బస్సుకి పోసే డబ్బులు సారాకి ఇస్తే పోలా? అనే వేదాంతమున్నూ. మన్వేలుడు ఏమనుకుంటున్నాడో మాత్రం ఎవరికీ తెలియదు. అతడు నదివడ్డున అందర్నీ కూర్చోబెట్టి, వచ్చిన వాళ్ళ వివరాలన్ని వ్రాసుకున్నాడు. ఆ తరువాత తలకో అర్ధరూపాయ చొప్పున ఇచ్చేసి వెళ్ళిపోయాడు. అప్పుడిహ వాళ్ళకర్ధమయింది, తామిక ఎళనీరుఘాటు గుండా తమ ప్రయాణం సాగించాలని.

ఆ రాత్రి తమతో తెచ్చుకున్న ఆహారంతిని అందరూ నది వడ్డున పడుకున్నారు. తెల్లవారగానే అందరూ ప్రయాణానికి సిద్ధమయ్యారు. అక్కడున్న వందమంది కూలీలలో కార్కళం బంట్వాళం. పంజ – ఇలా నాలుగు మూలలనుండీ వచ్చినవారు ఉన్నారు. అందులో కొంతమంది తోటపనికి పాతవారే గనుక తెలిసినవారితో కబుర్లు చెబుతూ బయల్దేరారు. చనియ. గురువలకి అన్ని మొహాలు కొత్తవే. అందులో కొంతమందితో పరిచయం చేసుకున్నారు. కొత్త కూలీలను చూస్తే. పాత కూలీలకు జాలి వేస్తోంది. మనసులో ఎన్నెన్నో కోరికలతో వస్తున్నవారి కలలను ఇక్కడే భగ్నం చేసేలా ఉన్నాయి వారి మాటలు. అయినా. ఉడుకు రక్తం, తరుణ హృదయాల ఉత్సాహం తగ్గలేదు. తోట, ప్రపంచానికంతా చీకటిగా కన్పించినా తాము మాత్రం అక్కడ వెన్నెలను చూస్తామన్న నమ్మకంతోనే ఉల్లాసంగా కబుర్లు చెప్పుకుంటూ నడక సాగించారు.

ఉదయపు ఎండ వేడి పుంజుకుంటోంది. రెండురోజులు ప్రయాణంతో అలసిన జీతగాళ్ళు కాళ్ళీడ్చుకుంటూ నడుస్తున్నారు.

వాళ్ళలో ఆడవారు, పిల్లలు మరీ నీరసంగా, మెల్లిగా నడుస్తున్నారు వాళ్ళకోసం మగవాళ్ళు ఆగవల్సొస్తోంది. ఇలా గంటకు రెండు మైళ్ళ కన్న ఎక్కువ నడకసాగటంలేదు. దాంతోపాటు ఎవరిమటుకు వాళ్ళకే వాళ్ళ సంసారపు బరువు నెత్తిమీద ఉంది. అందులో పిల్లల్ని పడుకోబెట్టే ఉయ్యాల దగ్గర్నుంచీ-కుండ ముంత చాప కంబడి కోడి కోడిపిల్లలదాకా అన్నీ ఉన్నాయి. అందరూ మొహాలు, ఒళ్ళు చమట పట్టేసి దుమ్ముగొట్టుకుని ఎర్రగా ఉన్నారు. జుత్తు పూర్తిగా రాగిరంగు వచ్చేసింది. ఎనిమిది మైళ్ళ అడవిదారి పూర్తి కాగానే అందరూ 'హమ్మయ్య' అంటూ కూలబడ్డారు. మూటకట్టి తెచ్చుకున్న అటుకుల్ని కొందరు మరమరాల్ని కొందరు నోట్లోవేసు కున్నారు. కాని అక్కడ నీళ్ళేవి? మరోరెండు మైళ్ళదూరం నడచి తమదారికి అడ్డుగా వున్న కుంటలోని నీళ్ళు గటగట తాగారు. చాలా దప్పికగొన్న పశువులు కూడా ఆనీరు త్రాగడానికి భయ పడాలి అలా ఉందానీరు. కాని వాళ్ళకేం కొత్త వింత సంగతి కాదది. అదే నీటితో మొహాలు కడుక్కుని ముందుకి నడిచారు. పగలు ప్రయాణం పూర్తి కావడానికింకా మూడు మైళ్ళునడవాలి. నడిచారు. సూర్యుడు నడినెత్తికొచ్చేసరికి, గుంపులో కాస్త చురగ్గా నడవకలిగిన వాళ్ళు కిల్లూరు నదీతీరం చేరుకున్నారు. ఆనదీతీరం ఎంతో మనో హరంగా ఉంది. ఓ ప్రక్కన 'హిమగిరి గుప్పె' పర్వత శ్రేణులు. వానిమీదుగా విహరిస్తున్న మబ్బు తునకలు క్రిందికి రాళ్ళమీదుగా కలకలమని నవ్వుతూ ప్రవహించే నది. కవులు వదల్లేని సుందర దృశ్యం అది. కాని జీతగాళ్ళు, కూలీల బ్రతుకుల్లో మబ్బులు, పర్వతాలు నదులూ మాట్లాడతాయా ఏమిటి?

ఒకకూలి గురువణ్ణి పిలిచి చూడు ఎత్తుగా ఉన్న గుట్టలేదూ దాని వెనుకగా కనిపించే క్రిందికొండ అదే ఎళ్ళనీరుఘాటి దాన్ని ఎక్కివెళ్ళాలి మనం అన్నాడు. అవటానికి కండపుష్టిగల ధీరుడే మన గురువ. ఉడుకురక్తం ఎంతమాత్రం తగ్గని యువకుడన్న మాట నిజమే.

కొండని కొట్టి పిండి చేయాలన్నంత ఉత్సాహం ఉన్నమాటా నిజమే. కాని రెండున్నర రోజుల ప్రయాణం అతడి ఉత్సాహాన్నంతా తుడిచి పెట్టేసింది. గిరిశృంగాలను చూసి 'ఆహా! ఎంత అందమైన చోటు! అని మైమరచి పోడానికి మారుగా "ఏమిటి?? అక్కడిదాకా వెళ్ళి దాన్ని ఎక్కి 'కళసం' వెళ్ళడమా!" అని నిరుత్సాహంగా గొణిగాడు. ఆ లోపల వెనకబడిన వాళ్ళు, ఆడవాళ్ళు పిల్లలు అక్కడికొచ్చి చేరారు, పిల్లలు ఆకలికి ఏడుస్తున్నారు. ఎంతోమంది కుర్రాళ్ళకి అమ్మాయిలకి కాళ్ళు నడక వల్ల నొప్పితో వాచిపోయాయి ఎండకు కాలి బొబ్బలెక్కిన పాదాలను గబగబవచ్చి నదిలో ముంచితే ఇంకొక్క అడుగు వెయ్యడం అబద్ధమే.

ఇక 'వంట' అవాలి, వంట అన్న పెద్ద పేరేం అక్కర్లేదు దానికి. గంజి కాచుకునే పని అంటే సరిపోతుంది. నదిలో నీరుంది, తెచ్చుకున్న కుండలున్నాయి. వెదురు బద్దలను వంట చెరకుగా వాడుకుందుకు తెచ్చుకున్న వారూ ఉన్నారు, మిగతావారు అటు. ఇటు వెళ్ళి పుల్లల్ని ఏరి తెచ్చారు. మూడుమూడు రాళ్ళను పేర్చి అక్కడక్కడా పొయ్యిలు వెలిగించి కుండల్లో ఎసరు పెట్టారు. గురువ చనియలూ ఒక పొయ్యి వెలిగించారు. ఉన్న కాస్త బియ్యం లోంచి రెండుమూడు పిడికెళ్ళబియ్యం వేసి గంజి కాచారు. అక్కడే పడివున్న రాతిమీద నాలుగు ఉప్పురాళ్ళనీ, రెండు మిరపకాయల్ని దంపారు. పచ్చడి సిద్ధమైంది, ఇక భోజనమే తరువాయి!

అందరూ అలాంటి భోజనం చెయ్యటమూ అయింది. మరి అలసటగా ఉండటం చేత ఇంక ఏమీ ఆలోచించకుండ ఎక్కడి వాళ్ళక్కడే పడుకున్నారు. కళ్ళు ముయ్యగానే నిద్రలు ముంచు కొచ్చాయి. కొంతమంది ఎండలో కొంతమంది నీడలో కొంత మంది దారికడ్డుగా పడుకున్నారు. కొంతమంది నీడలో పడుకుని ఎండలో లేచారు, ఎండేమిటి? నీడేమిటి? అదో లెక్కకాదు.

సాయంత్రపు సూర్యుడు పడమటి పర్వతశ్రేణి వెనుకనుంచి తొంగిచూస్తున్నాడు, పశ్చిమాద్రిన గ్రుంకే సూర్యుడు ఇప్పుడు

నిజంగానే ఆడుకుంటున్నాడు. మబ్బులు అప్పుడప్పుడు సూర్యుణ్ణి మరుగు పరుస్తున్నాయి. ఎండ వేడిమి ఇంకా తగ్గనేలేదు. నిద్రపోతున్నవారిలో కొంతమంది ముందుగా లేచారు. పొద్దువాలి పోతున్నదనే గాబరాతో మిగతా వాళ్ళని లేవసాగారు. కొంతమంది తటాలున లేచిపోయారు. కొంతమంది కళ్ళు నులుముకుని మళ్ళీ పడుకున్నారు. మొదట లేచిన వారిలో చనియ, గురువలూ ఉన్నారు. వారి ప్రక్కనే కార్కళం ప్రాంతం నుండి వచ్చిన ఒక ముదుసలి మాదిగ వాడున్నాడు. లేవగానే ఆశ్చర్యంతో 'ఆఁ!!' అన్నాడు. వీరిద్దరికీ ఆ ఆశ్చర్యానికి కారణం బోధపడక 'ఏం?' అన్నారు. అతను మారు మాట్లాడక వీరిద్దరి చేతులూ పట్టుకుని నాలుగంగల్లో ఎదుట కనపడుతున్న సారా కొట్టు ముందు నుంచున్నాడు. తాను ఇంతసేపు తాగుడు మాటే మర్చిపోయి పడుకున్నానే! అని ఆశ్చర్యం ముసలతనికి. చనియ గురువలకు అక్కడ నుంచునే ధైర్యం లేదు. ఇంతకు మునుపు చాటుగా తాగలేదని కాదు. ఇంటి దగ్గర్నుంచి బయల్దేరేటప్పుడు తండ్రి చెప్పిన మాటలు ఇంకా మరుపుకు రానందున ఏం చేద్దామా అన్న ఆలోచనలే ఉండగానే సారా నింపిన సీసాలు వాళ్ళ చేతికి రానే వచ్చాయి. ముదుసలి వీళ్ళిద్దర్నీ కూర్చో పెట్టి సీసా చేతికి తీసుకుని త్రాగసాగాడు. వీళ్ళ మనసులోని సంధిగ్ధం మాయమై సీసాలు చేతికి తీసుకున్నారు తాగి పైకి లేచే సరికి, ఒక్కొక్కరికి నాలుగేసణాలు దండుగ అవనే అయింది. వీళ్ళే ఎక్కువ తాగారో, కొట్టు యజమానే అలా చెప్పాడో చెప్పే వాళ్ళెవరు? వీళ్ళు లేస్తుండగానే ఇంకా కొంతమంది వచ్చి చేరారు. కొంతమంది తమ పిల్లల్ని తీసుకొచ్చి వాళ్ళ గొంతుల్లోనూ పోశారు. సాయంత్రపు సూర్యుడు అస్తమించాడు. ఇంక తరువాతి ప్రయాణం గురించిన ఆలోచన వచ్చింది.

మళ్ళీ తోట చేరే వరకు భోజన వసతి ఉండదు. అందుకని ఒకటి రెండు మజిలీలకు కావలసినంత ఆహార సామాగ్రి అమర్చు కోడానికి ప్రయత్నం చెయ్యసాగారు, సారా కొట్టు ప్రక్కనే ఒక

మాపిళ్ళె కొట్టూ ఉంది. అక్కడ అటుకులు, బియ్యమూ దొరుకు తున్నాయి. అటుకులకి, బియ్యానికి కొంచెంకూడా వ్యత్యాసం లేదు. అటుకులు అంటే ధాన్యము నుండి బయట పడిన బియ్యమే. అదేనా తెచ్చి ఎన్నేళ్ళయిందో మరి. అలాంటిదాన్ని డబ్బులిచ్చి కొన్నారు। ఊళ్ళో శేరుకు అణాన్నర అయితే, ఇక్కడ కేవలం మూడణాలు॥ అదీ, ఇక్కడ శేరుకి మూడు పావులు మాత్రమే. కొన్నారు. కొనాలి. తప్పదు గనుక కొన్నారు. ఎంత ? అన్నది లెక్కకాదు. మన్వేలుడు. ఇచ్చిన డబ్బులో మిగిలిందంతా సారాకి. లేదా దీనికి.

ఇక రెండు గడియల్లో చంద్రుడుదయిస్తాడు. బయల్దేరి దిగువ భాగానికి చేరుకుందాం అని నిశ్చయించారు. ఆ దారి, నాలుగైదు మైళ్ళదూరం ఉంది. రాత్రేగనుక ఎండ బాధలేదు. నెమ్మదిగా నడిస్తే సరి. తాగి మత్తెక్కిన కొందరు, "తోటకు వెడితే వెడతాం, లేదా మన ఊరికి వెడతాం." అంటున్నారు. గురువ, చనియలు ప్రయాణానికి సిద్ధమై, తమతో పాటు తాగిన ముసలతనితో మాట్లాడుతూ నుంచున్నారు. ముసలతను తాగిన మైకంలో — "తోటమేస్త్రీ. యజమాని అన్నీనేనే. జీతం ఎంతైనా ఇస్తాం కాని బాగా పనిచెయ్యాలి. లేకపోతే నాలుగు ముంతలకల్లు జరిమానా." అంటూ అరుస్తున్నాడు. ఊహల్లో తేలిపోతున్నాడు. ఆలోపల వాళ్ళున్న చోట్లోనే ఒకమూలనుంచి ఒక స్త్రీ రోదించడం వినిపించింది. కొంతమంది అటువేపు పరుగెత్తుకుని వెళ్ళారు. గురువ, చనియలు వెళ్ళబోతుంటే ముసలతను వాళ్ళని ఆపేశాడు— "పనేంలేదు దానికి, ఉట్టినే ఏడుస్తుందంటూను". "ఏడుస్తున్నది అతని ఇంటిదే." పనిలేకకాదు ఏడవడం. ఆమె పక్కలో పడుకున్న పిల్ల, ఎనిమిదేళ్ళ చిన్నది. లేవటం లేదు. ఎంతలేపినా లేవటమే లేదు. అందరూ కలిపి ముసలతన్ని అక్కడికి లాక్కెళ్ళారు అయినాసరే, ఆపిల్ల లేవనేలేదు. ఇకలేవదుకూడా. ముసలతన

మత్తుదిగేసరికి. తల్లి నెత్తి బాదుకుంటూ ఏడుస్తోంది. పిల్ల చచ్చిపోయింది. ఉన్న ఒక్కగానొక్క పిల్ల. ఆపిల్ల ఆమెకూతురుకాదు. ఆమె కూతురు కన్నపిల్ల. తల్లి లేని పిల్ల నాలుగు రోజులుగా జ్వరం వస్తూనే ఉందట. అలాగే బయల్దేరి వచ్చారు. ఊళ్ళోనే ఉండిపోదామంటే బతకడానికి దారిలేదు. పిల్లని వదిలిపెట్టి వద్దామంటే వేరే దిక్కులేదు. జ్వరం అంటే ఇంత భయంకరమైనదని వాళ్ళకి తెలియదు. ఎందుకో ఒళ్ళు వేడెక్కుతుందని అనుకుంటారంతే. ఇప్పుడు ఒళ్ళు మంచులా చల్లబడిపోయింది. ముసలతను వెక్కి వెక్కి ఏడవసాగాడు. అందరూ సానుభూతి చూపుతూ ఓదార్చారు. తల్లి తనకూతుర్ని తల్చుకుని రాగాలు పెడుతూ మనవరాలి దేహాన్ని కన్నీటితో తడిపివేసింది అది వారి ఇంటి ముందుండే పంజుర్లి * ఉపద్రవమని నిశ్చయించారు. జ్వరంతో పిల్ల చనిపోయిందని వాళ్ళకి నమ్మకంలేదు. జ్వరంతో ఉండగా ఒళ్ళు పేలిపోతూ ఉంటుంది కదా! ఉట్టినే వేడెక్కి చావురావడానికి అదేమీ కర్రనుకాల్చివేసే నిప్పుకాదే!

ఏడుపు లయ్యాయి. భూతశక్తికి మొక్కుకోవడం, క్షమించుమని ప్రతిమాలుకోవడం అయ్యాయి. మామ్మ కడుపు తరుక్కుపోతోంది. కొన్నాళ్ళ దాకా ఆరని పుండు అది. అలాగని శవాన్ని ఉంచుకోలేరు కదా! పిల్లని ఆవిడ చేతుల్లోంచి లాక్కుని కొంత దూరంలో మట్టిచేసి వచ్చారు. మధ్యరాత్రి మళ్ళీప్రయాణం కొనసాగింది. చంద్రుడు ఈ పేదవారి బ్రతుకుల్ని చూపి నవ్వుతూనే వున్నాడు.

చనియ గురువలలో మిగిలిన కాస్త ఉత్సాహం అడుగంటిపోడానికి ఈ దృశ్యం ఒక్కటి చాలనిపించింది. వారి భవిష్యత్తుకు, ఈ పిల్లదాని చావుకీ సంబంధం లేదు. కాని బ్రతుకు అశాశ్వతమనడానికి ఉదాహరణగా ఒక దృశ్యం ఇప్పుడు వాళ్ళ కళ్ళ ముందునుంచుంది. అయిదేళ్ళ క్రిందట వాళ్ళ తల్లి చావుని చూశారు.

---

* పంజుర్లి — దక్షిణ కన్నడజిల్లాలో పల్లీయులు నమ్మిపూజించే మరొక క్షుద్రశక్తి

ఇప్పటికి మర్చిపోటమూ జరిగింది. కాని ఈపసిదాని చావు అంత కన్న ఎక్కువని పించింది. ఈ రెండు రోజుల ప్రయాణంలో అందరూ ఒక్క కుటుంబమన్న భావన కలిగింది. ఆ కుటుంబ యాత్రలో జరిగిన ఈ సంఘటనకి అపూర్వమైన ప్రాముఖ్యత. తీక్షత కలిగింది.

తోట యాత్ర గురించి ఇంకా వర్ణించడం దేనికి? కొండల్లో, మైదానంలో, ఎండలో వానలో దాని రూపు వేరుగా ఉండదు కదా! పైకి కనిపించే రంగు వేరైనా, అంతరంగపు ఆవేదన ఒక్కతీరుగానే ఉంటుంది. కనుక అతి సులువుగా మన్వేలుడి నోటివెంట రాగలిగే మాటల్లో పూర్తి చేద్దాం.

"దొరగారూ, వీళ్ళంతా మొన్ననే బెళ్ళంగడికి వచ్చి చేరారు. తలా ఎనిమిదణాల చొప్పున ఖర్చుకి ఇచ్చాను. త్రోవ పొడుగున తింటూ, తాగుతూ ఇప్పటికి వచ్చి చేరారు. తల్చుకుంటే నిన్న సాయంత్రానికే వచ్చుండే వారు."

త్రోవలో జరిగిన చిన్నదాని 'చావు' కూడా వాళ్ళ దృష్టిలో విశేషమేమీ కాదు. 'ఏమిటో, ఆ కొర్కాళపు ముసలి పొమ్మడు లేడూ? వాడి మనుమరాలు. ఇలా పుల్లలా ఉండేది. ఆ పిల్ల జ్వరంతో పోయిందట. ఇంత కాలం అది బతికిందే ఎక్కువ." అంతే, ఆమాట దొరగారి చెవిలో వేశాననిపిస్తాడు.

6

కొడుకుల ఎడబాటువల్ల కలిగిన వ్యధను రెండే రోజుల్లో సహించడం నేర్చుకున్నాడు చోముడు. పిల్లలు కళ్ళెదుట లేకపోయినా, "ఇవాళ కాకపోతే రేపయినా వేరుగా బ్రతకాల్సిన వాళ్ళే కదా, దేవుడు వాళ్ళని చల్లగా చూస్తే చాలు" అనుకున్నాడు.

ఇక తన సంగతి జ్వరం తగ్గక ఇంకా ఇంట్లోనే పడుకుని ఉంటున్నాడు గానీ, అదో వ్యధ పడాల్సిన విషయంగా కనిపించదు. ఇంతెందుకు, ఇంట్లో పనిచేసే ఇద్దరు మనుషులు దూరమై సంపాదన తక్కువైనా, దాన్ని తట్టుకోగల గుండెధైర్యం ముందతనికి. అతని చింత అంతా ఒక్కటే తను ఎప్పటికైనా వ్యవసాయం చెయ్యగలడా? ఎన్నో ఏళ్ళుగా పోషించుకుంటూ వస్తున్న కల అది. దానికి వత్తాసుగా అడవిలో దొరికిన రెండుదూడలు, పులివాత బడకుండా పెరిగిపెద్దవై అతని కోరికకు ఇంధనం వెయ్యడం ఇవాళ్ళకాకపోతే రేపు తను వ్యవసాయదారుణ్ణవుతానన్న ఆలోచనల స్వర్గంలో కాలు పెట్టడం. వీటి భవిష్యత్తేమిటి?

ప్రతిక్షణం అతని ఎదుట తనమీద అలిగి కూర్చున్న నాగలి కనిపిస్తుంది. ఒక్కోసారి నాకోసం నాగలిపట్టే అదృష్టం లేనపుడు మరొకరి కోసం ఎందుకు పట్టాలి అనిపిస్తుంది. వ్యవసాయదారుణ్ణయే యోగం తనకు లేనప్పుడు ఇంకొకరి పొలంలో బురదతొక్కి ఎందుకు బతకాలన్న రోషం కలుగుతుంది. ఆలోచనల అలజడితో అతడి మెదడు మొద్దు బారుతుంది. ఇదివరకు 'యజమాని' అనగానే వంగివంగి దండం పెట్టిన అతడి మనసు, వినయం వినయమేమిటి? దాస్యబుద్ధి ఇప్పుడు నిటారుగా నుంచోవాలని పోరాడుతోంది.

'నాకెక్కడ యజమాని? నాకోరికను చిల్లిగవ్వ విలువఇవ్వని యజమానితో నాకేమిటి పని?' అనుకుంటాడు ఇకమీదట గవర్నమెంటు ఆఫీసర్ ఆరోజు చెప్పినట్టుగా స్వతంత్ర జీవిగా ఊరు బయట గుడిసె వేసుకుని నేరుగా తనే గవర్నమెంటుకి శిస్తుకడుతూ ఉండిపోవాలని ఆలోచిస్తాడు కాని అప్పుడు పొట్టగడిచేదెలా? యజమాని ఇస్తున్న భత్యం ఉండదే! పోతేపోయింది అడవిలో పుల్లలున్నాయి. అక్కడా అక్కడా బీళ్ళు ఉన్నాయి, మొగలి వనాలున్నాయి. బీళ్ళు గావి, *మొగలి ఆకులుగాని తెచ్చుకోవడం చీల్చి

---

* మన ప్రాంతంలో ఈతాకులతో తయారు చేసినట్లు ఆ ప్రాంతం వారు మొగలి ఆకులను చీల్చి చాపలు బుట్టలు చేస్తారు.

చాపలను బుట్టలను అల్లి అమ్మడం. దానితో బ్రతకటం తనకు నేరాజా ?

ఎంత అందమైన కల! స్వతంత్ర జీవితాన్ని గురించిన ఆలోచనల కల్పనలోనే అతనిలో ఉత్సాహం ఉప్పొంగి, ఉదయమే డప్పు చేతిలోకి తీసుకున్నాడు. చేతులు శక్తిహీనమై వణుకుతున్నా ఆవేశంగా డప్పు వాయిస్తున్నాడు. ఇంట్లో ఎవరూలేరు. బెళ్ళి తమ్ముళ్ళను తీసుకుని ఉదయమే ఆకుకోసుకు రావడానికి వెళ్ళి పోయింది. రోజూ యజమాని ఇంటికి తెచ్చివేసే ఆకుమోపునుతెచ్చి పడెయ్యక పోతే నాలుగువేళ్ళూ నోట్లోకి వెళ్ళే మార్గమేముంది? ఇకనేం. ఇంట్లో ఎవరూ లేరాయె. చోముడు ఉత్సాహానికి పట్ట పగ్గా ల్లేవు. డమ్మడమ్మ. డక్కడక్క లయబద్ధంగా మ్రోగిస్తున్నాడు. బయటనుంచి 'చోమా. చోమా' అని ఎవరో పిలవడం వినిపించనే లేదు. ఆఖరికి ఆ పిలుస్తున్నవారు. "ఒరేయ్ చచ్చినాడా! నీ చెవులు మూసుకుపోయాయా?" అని అరవడం మాత్రం వినిపిం చింది. డప్పులు బాదుతున్న కర్రపుల్ల క్రింద పడింది. ఒక్కసారిగా ఉత్సాహం దిగజారిపోయి గొంతులో పచ్చివెలక్కాయ అడ్డుపడ్డట్ట యింది. బయట పిలుస్తున్నది అతడి యాజమాని సంకప్పయ్యగారు. గుడిసెకి కాస్త దూరంగా నుంచుని పిలుస్తున్నారాయన. బెళ్ళి ఉదయమేవెళ్ళి 'అయ్య'కు జ్వరంగా ఉందని చెప్పినపుడే అది తాము కౌలుకి భూమి ఇవ్వడానికి నిరాకరించినందువల్ల కలిగిన కోపంతో అంటున్నదేమో అన్న సందేహం కలిగింది. 'డప్పు' మ్రోత ఆయన ఊహను బలపర్చింది. చోముడు గుడిసెలోంచి తలబయట పెట్టగానే . "జ్వరం వచ్చిన వాడి చెయ్యేనా ఇంతజోరుగా డప్పు వాయిస్తున్నది?" అన్నారు ఒకేఒక్కమాట! పిడుగులా తగిలింద తనికి. విప్లవభావాలతో నిండిన చోముడి అంతర్యం ఆ ఒక్క మాటతో విలవిల్లాడిపోయింది.

"ఏమిటి? నవారీ ఇంటివేపు రాలేదేం? నీ కొడుకులు కాఫీ తోటకు వెళ్ళారటగా! ఇంటి దగ్గర చిల్లరపనులు బోలెడన్ని అలాగే పడిఉన్నాయి. ఎవరు చేస్తారు? ఇక వానాకాలం ఎప్పుడు ముంచు కొస్తుందో తెలియదు....నవారి అప్పటికైనా పన్లోకి వస్తుందా. లేక తప్పు వాయించుకుంటూ బంగళాలో కూర్చుంటుందా?"

తప్పు చప్పుడే సంకప్పయ్య గారివి అంతదూరం తీసుకు వచ్చింది. ఆయనకి ఎదురు తిరిగే శక్తి చోముడికెక్కడిది? చోముడు వినయంగా దండం పెడుతూ. "కోపగించకండయ్యా రెండురోజు లుగా ఇంట్లో పడుకుని తోచటంలేదు. ఇటు పిల్లలు తోటకు వెళ్ళిన దిగులు. ఏమిటోగా ఉంది తప్పుచేతికి తీసుకున్నా."

"లేకపోతే, పొద్దు పొడవగానే బిరుమ పూజారిని సందర్శించ లేదు కదా!"

"ఎలా వెడతానయ్యా? చేతిలో కానీ డబ్బులు లేందే!"

"నీకేం తక్కువ? నాలుగు బుట్టలల్లా వంటే. ఎనిమిది బుడ్డిల ఏర్పాటు కూర్చున్న చోట్లోంచే చేసుకోగలవు."

ఇంతవరకు బుట్టలు. చాపలు అల్లిక గురించి కలలుగన్న చోముడి మనసుకు వాత పెట్టినట్లయింది. ఏదో ఆయన ఇంకేమీ పొడిగించకుండా, "ఊఁ, ఉట్టినే సోమరిగా కూర్చోకు. మడికి కంచె వెయ్యాలి. ఇంట్లో చిల్లర పన్లెన్నో పూర్తి కావాలి. అదీకాక తెచ్చి పడేసిన వెదురు ఎండకు ఎండుతోంది దాని మీద కప్పు వేయాలి ...." ఇలా, వర్షాకాలం మొదలు పెట్టే లోపల జరగాల్సిన పనుల జాబితా చెప్పసాగారు. చోముడు రేపటి నుంచి పన్లోకి వస్తానని చెప్పి. యజమానిని సమాధాన పరచి పంపాడు.

సంకప్పయ్యగారికి కోపం వచ్చినా ఎక్కువసేపు విలువదు. అంతే కాకుండా చోముడి సంగతి ఆయనకి తెలియనిదేముంది. ఆయన తండ్రి కాలం నుండీ కూడా చోముడి మీద కాస్త మమత

ఎక్కువే. అందుకే చోముడు రేపు స్తానన గానే మారు మాట్లాడ కుండా వెళ్ళిపోయారు.

మరుసటి రోజు చోముడు కత్తి నడుముకి కట్టుకుని, తల మీద *'హాళె' పెట్టుకుని ఉదయమే యజమాని ఇంటి ముందు సిద్ధమయ్యాడు. అపాటికి సంకప్పయ్యగారు ముంగిటిలో నుంచుని ఉన్నారు. చోముడిని చూసి నవ్వుతూ, ఒక పొగాక్కాడ అతని వేపు విసిరి, "ఏం పని మొదలెడతావ్? ఇంకెవరూ రాలేదు మరి! వెదురు బొంగులు పడెయ్యడానికి పందిరి వేసే పని చూడు" అన్నారు. చోముడు నవ్వు ముఖంతో పనిలోకి దిగాడు.

వారం రోజులు గడిచాయి. చోముడూ, అతని యజమాని మామూలుగానే ఉన్నారు. వర్షాకాలం వచ్చే లోపల చేసుకోవలసిన పనులు చాలా మటుకు అయిపోయాయి. చోముడి మనసులో యజమానికి మళ్ళీ తన విన్నపం విన్నవించుకుందామనే ఆశ తల ఎత్తింది.

"ఎక్కువ వద్దు. ఓ పది శేర్లు విత్తనాలు నాటేటంత జాగా అడుగుదాం" అనుకుంటున్నాడు. ఏదో నెపంతో కాసేపు కూర్చుని, కాచుకుని, ఏలాగోలా మరోసారి తన కోరిక వెల్లడించాడు. సంకప్పయ్యగారికి అతని మొహం చూస్తే జాలివేసింది. గర్వంతో వి(ర వీగాలని అతనలా అడగటం లేదని తెలుసాయనకు, అంతే కాకుండా పెద్ద కొడుకులిద్దరూ తోటకి వెళ్ళడంతో ఆదాయం సున్నా అయింది. ఇదయినా ఒకపని చేసుకుంటే నాలుగు శేర్ల ధాన్యం వస్తుందన్న ఆశతో అడుగుతున్నాడేమో పాపం! అనుకున్నారు. కాని ఒక్కసారిగా "సరే" అనకుండా రేపో, ఎల్లుండో చెబుతాలే, తొందరేం?" అన్నారు. తొందర కాదా మరి! వర్షాకాలానికింకా

---

* హాళె—పోక చెట్టు ఆకును ఆచ్ఛాదనగా తల మీద ధరించడానికి వీలుగా తయారు చేస్తారు. ఈ ప్రాంతంలో తాటాకు ఆచ్ఛాదన వాడి నట్టుగా.

వారం పది రోజులు మాత్రమే వ్యవధి ఉంది. కాని చోముడు యజమాని మాట నమ్మి, ఆశను మూట కట్టుకుని ఇంటికి వెళ్ళాడు, బెళ్ళితో, తనని అదృష్టం వరించిందని చెప్పుకుంటూ మురిసి పోయాడు, రాత్రంతా ఇద్దరు పిల్లల్ని గంతులేయిస్తూ దప్పు మోగించాడు.

స్వతః సంకప్పయ్యగారికి, తమ పాలేరు చోముడికి పాడు పడిన ఓ చెక్కనేల ఇవ్వడానికేమీ అభ్యంతరం లేదు. ప్రతి సంవత్సరమూ ఇవ్వాల్సిన కౌలు ధాన్యం ఎగ్గొట్టే రైతుల్లాగ చోముడు చెయ్యడనీ తెలుసు. కాని తల్లి సమ్మతి సంపాదించటం దుస్సాధ్యమే. పాత సంప్రదాయాలను వదలలేని వృద్ధురాలామె. మాదిగవాళ్ళు స్వంతంగా వ్యవసాయం చేయడమన్న ఆలోచనే ఆమె సహించదు. చుట్టు పక్కల పై జాతి వారికి....అంతెందుకు? పల్లెలో సామాన్యులకూడా నచ్చని సంగతి అది. "వాళ్ళు వ్యవసాయం మొదలెడితే, ఇక మన పనికి మనమే నాగలి పట్టాల్సి ఉంటుందంతే" అనుకుంటారు వాళ్ళు. అన్నీ తెలిసికూడా, సంకప్పయ్యగారు చోముడి కోసం మెల్లగా తల్లిని కదిలించిచూశారు. బ్రతిమాలుకున్నారు. ఆమె జవాబు ఒక్కటే—"మిగతా ఎవరైనా ఆ పని చేశారా? నువ్వే ఆపని ప్రారంభోత్సవం చేసి, తాంబూలం ఇవ్వొద్దు, అంతే. రేపు నీకు చెడ్డపేరు వస్తుంది." సంకప్పయ్య గారు తల్లి చెప్పినదంతా ఆలోచించి చూశారు, ఆమె మాటా నిజమే ననిపించింది. రెండు రోజులు ఊరుకుని తరువాత ఉన్న మాట వివరంగా చోముడితో చెప్పారు. చోముడి కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి. సంకప్పయ్యగారికీ కష్టంగానే ఉంది. "చోమూ, మనకి చోటు ఉన్నంత వరకే కాళ్ళు జాపాలి. నుదుట వ్రాసి లేనిదానికి ఏడ్చి ఏం ప్రయోజనం?" అన్నారు. ఆయన మాటలు చోముడి మనసుకెలా తగిలాయో దేవుడికే ఎరిక,

అతని మనస్సు ఉద్విగ్నమయింది. పన్లోకి వెడుతూనే ఉన్నాడు, వస్తూనే ఉన్నాడు. పెదవులమీద లేవి నవ్వు తెచ్చు

కుంటూనే ఉన్నాడు. కాని అంతరంగంలో ఎనలేని మత్సరం చోటు చేసుకుంది. మొత్తం పల్లెలోని రైతులమీదే అతనికి అసూయగా ఉంది. ఒకే ఒక్క కారణం కోసం — తనని బ్రతుకంతా కూలీగా బ్రతకమని విధించి, వాళ్ళంతా వ్యవసాయదారులుగా ఉన్నందుకు. వ్యవసాయం చేస్తున్నవారికి దొరికే స్వర్గసౌఖ్యాలేమిటన్న ఆలోచన లేదతనికి. అది స్వర్గం కానీ, నరకం కానీ తనకే ఎందుకు దొరకకూడదన్నదే అతని వాదన.

ఇది జరిగిన రెండురోజుల తరువాత యజమాని పనిమీద పక్కనే ఉన్న పల్లెకు వెళ్ళాడు. ఇతను వెళ్ళిన ఇల్లు కిరస్తానీ వారిది. అతనూ ఓ కౌలుదారు. అతనితో "మీ ఊళ్ళో సాగు చేసుకోవడానికి భూమి దొరికే అవకాశం ఉందా?" అని అడిగి చూశాడు. అతను, తమదే చర్చికి చెందిన భూమి ఉందనీ పాద్రి దొరగారిని అడిగితే తప్పకుండా ఇవ్వగలరనే అతనికి అభయం ఇచ్చాడు. అవాళ్ల పాద్రిగారిని కలుసుకోవడం పడనందున యజమాని పని ముగించుకుని వచ్చేసాడు.

మరుసటిరోజు చుట్టాల్లో ఒకరికి జబ్బుగా ఉందని యజమానితో చెప్పి, ఆయన అనుమతి తీసుకుని మళ్ళీ ఆ పల్లెకు, ఆ రైతు ఇంటికి వెళ్ళాడు. ఆ రైతు ఇతడిని పాద్రిగారి దగ్గరకు తీసుకెళ్ళాడు. అప్పుడు చోముడు తనకి పట్టబోయే అదృష్టాన్ని గురించి కమ్మని కలలు కంటున్నాడు. హిందువుల్లాగ పాద్రిలు తనకి భూమి కౌలుకివ్వడానికి నిరాకరించరు - అన్న నమ్మకం అతనికి మరింత ఉత్సాహాన్నిస్తోంది. వాళ్ళు తమ జాతివారిని ముట్టుకుంటారుకూడా. పాద్రిగారు ఉండే చోటుకి ఇద్దరూ వెళ్ళారు. అక్కడ ఆయనకోసం కాచుకుని కూచున్నారు. ఆయన బైటకి రావడానికి చాలా సమయం పట్టింది. సంగతంతా విని, ఉత్సాహంగా బయటకి వచ్చి, "ఉహాఁ! ఏమిటి, నీపేరు చోముడా? సరె, చోమా! కౌలుకివ్వాల్సిన భూమి చాలానే ఉంది. మంచి భూమి కూడ. మీ పల్లెకు దగ్గర్లోనే ఉంది.

ని అదంతా చర్చికి చెందిన ఆస్థి. మా జాతివారికి తప్ప, మరొకరి స్వాధీనానికి కుదరదే!"

"పోనీ చోమా, నువ్వు వాళ్ల దాకిరి, వీళ్ల చాకిరి చేసుకుంటూ బ్రతకటం కన్నా కిరస్తానీ మతం తీసుకుని స్వతంత్రంగా ఉండకూడదోయ్" అన్నారు.

చోముడు బదులు చెప్పలేదు. వాడి ఒళ్ళు, మనసు భగభగ మండసాగాయి. తిన్నగా వచ్చి గుడిసెలో పడుకున్నాడు. బెళ్ళికి కూడా సాయంత్రం దాకా అసలు సంగతి చెప్పలేదు. సాయంత్రం తప్పు పట్టుకుని, తన హృదయంలోని బాధనంతా కడిగి వేసుకో పోగాడు.

7

ఇహనిప్పుడు వర్షాకాలం ప్రారంభమయింది. కరుణా, కటాక్షం లేకుండా వర్షం ఎడాపెడా కురుస్తోంది. ఆవర్షంలోనే బెళ్ళి ఆమె తమ్ముళ్ళు ఆకుమోపులు కోసం వెళ్ళి రావాలి. కాని వర్షాకాలంలో చాలాదూరం వెళ్ళక్కర్లేదు. చుట్టూరా ఎక్కడచూసినా బోలెడంత ఆకు కోసి తేవచ్చు. అటు పొలాల్లో నీరు నిలుస్తోంది. మడిదున్ని పైరునాటడానికి సిద్ధం కావాలి. ఎక్కడ చూసినా కూలీల అభావం. కారణం, అందరి ఇళ్ళల్లోనూ ఒకేసారి వ్యవసాయపు పనులు జరగాలి. ఇన్నిరోజులుగా ఎండగా ఉండి, ఒక్కసారిగా జడివాన పట్టుకోవడంతో ఎవరింట్లో చూసినా జలుబు, దగ్గు, జ్వరాలతో పడ కేసినవారే. అదృష్టమో, దురదృష్టమో గాని చోముడు, ఇంట్లో జబ్బుమాటే లేదు. ఆస్తమానూ నజ్జురోగాలతో మూలుగుతూ ఉండే వాళ్ళ నీలలు కూడా చురుగ్గా పని చేసుకో గలుగుతున్నారు. తమ

వంతు పని చెయ్యాలన్న ఆత్రుతతోను ఉత్సాహంతోను ఉన్నారు. పెళ్ళికి పనులతో తీరటమే లేదు. ఆకుమోపు తేవటం. వంటవండటం యజమాని ఇంటికి పరుగులు పెట్టడం—ఇలా బోలెడు పనులు. నాట్లు మొదలవనే అయాయి.

చోముడూ పనిలో చొరబడి చకచక చేసుకు పోతున్నాడు. అతని ఎడ్లజతని మొదటి సారిగా నాగలికి కట్టాడు. వర్షం వస్తున్నా లక్ష్యపెట్టకుండా తనయజమాని పొలం దున్నుతున్నాడు. అతనితో పాటు ఇంకా కొంతమంది కూలీలూ ఉన్నారు. వాళ్ళు "ఓ... ఓ... ఓ...." అని రాగాలాపన చేస్తున్నారు. చోముడు నోట్లోంచి ఏ రాగమూ రావటం లేదు. యంత్రంలా నాగలి వెనుక నడుస్తున్నాడు. నాగలి అడ్డంగా వెళ్ళినా తిన్నగా వెళ్ళినా గమనించటం లేదు ఎడ్లని అతడు అదిలించటం లేదు, అవే అతడిని నడిపించి తీసుకు పోతున్నాయి. తన స్వంత సాగుకోసం ఉంచిన ఎడ్లజతని తన జీవితంలో ఒకేఒక్క కోర్కె తీరటానికి అడ్డుగా నిలిచిన యజమానికోసం నాగలికి కట్టాడు, ఇంక పనెలా చెయ్యగలడు?! మనసెలా ఒప్పుతుంది? కాని జీతగాడు అతడు ప్రపంచమే తిరస్కరించిన జీతగాడు. జీతగాడి పని చేస్తున్నాడు, వాన కురుస్తున్నా నాగలి వదలడు. వాననీటితో తన కన్నీటిని చేర్చి పని చేస్తున్నాడు. తన ఎడ్లు యజమాని పొలంలో వేసే ప్రతి అడుగూ తన రొమ్ముల మీదే వేస్తున్నట్లు అనిపిస్తుంది. ఏవిషఘడియలో ఆ దూడల్ని తెచ్చి పెంచుకున్నానో అనుకుంటాడు. తాను తెచ్చుకోకపోతే అవి పులివాత బడేవికదా! అన్న ఆలోచనా వస్తుంది. అతని దురదృష్టాన్ని గురించిన చింత కోపంగా మారి ఎద్దుల వీపుమీదకి ఉరికేది దెబ్బతగలగానే ఎడ్లు పరుగు లంకించుకునేవి అప్పుడు మేలుకుంటాడు 'అయ్యో' ఎడ్లని కొడుతున్నానే! అవేం చేశాయి పాపం! తనలాంటి మూర్ఖులు ఉండరు అనుకుంటాడు.

అతని దున్నేపని సాగుతూనే ఉంది దున్నిన వరపనే దున్నుతున్నాడు. ఒకసారి ఇతనితోబాటు దున్నుతున్నవారంతా

నాగళ్ళు విప్పేసి వెళ్ళిపోయారు. ఇతడినీ పిల్చారు. గట్టిగానే కేకే సారు. ఇతనేం ఆలోచిస్తున్నాడో గాని దున్నుతూనే ఉన్నాడు. అలాగే సాయంత్రమయింది. ఎడ్లు ఎగశ్వాసిరి పీలుస్తూ చొంగలు కారుస్తూ నుంచుండిపోయాయి. ఇతడూ ఆగాడు. ఉట్టినే నుంచు న్నానని అతనికి తెలియదు. ఎంతసేపలా నుంచుండిపోయాడోగాని అతనిచేతిలోని నాగలిని లాక్కుని, ఎడ్లు గుడిసెదగ్గరకి వచ్చిఆగాయి అవి 'అలా' రావడం చూపి బెళ్ళి నివ్వెరపోయింది. ఆత్రంగా నాగలి విప్పి వాటిని కట్టెయ్యడం కోసం ఎడ్లపాకలోకి తీసుకెళ్ళింది వాటి ఒళ్ళంతా దెబ్బలతో వాచిపోయింది. నోట్లోంచి ఇంకా చొంగలు కారుతూనే ఉన్నాయి. జాలిగా ఒళ్ళునిమిరి మేత తెచ్చి వేసింది మరుక్షణమే తండ్రి గుర్తొచ్చాడు అయ్య అని అరుస్తూ బయల్దేరింది మసకచీకటి కమ్ముకుంటోంది. అయ్య బదులు పలకలేదు. అలాగే వడివడిగా నడవసాగింది. త్రోవలో ఎదో అడ్డుకోవడంతో క్రింద పడింది. "అయ్యా" అంటూపైకి లేచి కంగారుగా చూడబోతే సోముడు! పొలం మధ్యనుండి గట్టుమీదికి వచ్చికూర్చున్నాడు అతనికి తెలివివచ్చింది "ఇక్కడేం చేస్తున్నావయ్యా? అంది బెళ్ళి "ఎక్కడ?" అన్నాడతడు.

కొద్దిరోజులుగా అతడి మనసేం బాగాలేదని బెళ్ళికి తెలుసు అందుకే మళ్ళీఏమీ ప్రశ్నించకుండా ఇంటిదాకా చెయ్యిపట్టుకుని తీసుకెళ్ళింది. చిన్నపిల్లాడు తల్లివెంట నడిచినట్టే కూతురుచెయ్యి పట్టుకుని ఆమెను అనుసరించాడు సోముడు. గుడిసెకి చేరారు. లోప లికి తీసుకువెళ్ళింది. కూతురు చెయ్యి వదలగానే ఉన్నచోటులోనే చతికిలబడ్డాడు. బెళ్ళి త్వరత్వరగా కుండలో కాసిని వేన్నీళ్ళు కాచింది అయ్యా నీళ్ళుపోసుకుంటావా? అంది. 'ఎందుకు?' అనే ప్రశ్న బదులుగా వచ్చింది. వర్షం తగ్గిపోయింది కనుక ముంగిటిలో పీటవేసి కూర్చోబెట్టి నాలుగుచెంబులు నీళ్ళుపోసింది. నీలనిపిలిచి అయ్యఒళ్ళు తోమమంది. మొత్తంమీద నీళ్ళు పోసుకోవడం అయింది తరువాత గంజి ఇచ్చింది.

'ఏమిటిది?' అన్నాడు చోముడు.

బలవంతంగా తాగించింది. పడుకోడానికి చింకి చాప వేసింది. వర్షంలో ఇంత చాకిరి చేసి వస్తే, పడుకోడానికి ఓ కంబళి ముక్క కూడా లేదు. తోటకు వెళ్ళిన పిల్లలకు ఇచ్చాడు కదా మరి. తండ్రిని చాపమీద పడుకోబెట్టి, "అయ్యా, నీ ఒంట్లో బాగా లేదా?" అని ప్రేమగా అడిగింది బెళ్ళి. ఉదయం నుండి పనిచేసి అలసిపోయిన పిల్లలిద్దరూ నిద్రపోయారు. బెళ్ళి ఎంత ప్రయత్నించినా తండ్రి చేత ఒక్క మాట మాట్లాడించలేక పోయింది. అప్పుడింక డప్పు తీసుకుని పొయ్యి దగ్గర కాస్త వేడి చేసి అతని ముందుంచింది. ఇంకేమి మాట్లాడకుండా, 'లే లే లే లే చెన్న— లే లె లె ల్లేలా....' అని పాడసాగింది. కాసేపు అతను మౌనంగా ఉన్నాడు. వర్షాకాలం వచ్చినప్పట్నుంచీ డప్పు ముట్టుకోలేదసలు. ఇహనిప్పుడు ఒక్కసారిగా స్ఫూర్తి పొంగు కొచ్చింది. గబుక్కున డప్పు లాక్కుని దరువు వేయసాగాడు. పాట, డమ్మ డమ్మ డక్క డక్క—ధ్వని సమాన స్థాయిలో నడుస్తున్నాయి. ఆవేశం ఎక్కువై తండ్రీ కూతుళ్ళిద్దరూ గంతు లెయ్యసాగారు. కూతురు తండ్రి కోసం నృత్యం చేసింది. అతడు తనకు తెలియకుండానే నృత్యం చేశాడు.

చాలా సేపటిదాకా ఈ 'లీల' సాగింది. ఆఖరికి అంతా పూర్తయ్యి, చోముడు చాపమీద కూర్చున్నాడు. బెళ్ళి అతని దగ్గరగా కూర్చుంది. తండ్రి ఒళ్ళు నిమురుతూ, "అయ్యా ఇవ్వాళ నీ ఒంట్లో బాగాలేదా?" అంది అతి మృదువుగా. 'ఒంట్లో' అనే అంది. 'మనసులో' అని అనలేదు. చోముడు నిదానంగా "ఏం బాగుంటే ఏం లెద్దూ. అదృష్టం బాగా లేనపుడు" అన్నాడు. అలాగే ఒక్కొక్కటిగా అన్నీ బయటకి వచ్చాయి. పాద్రిగారి దగ్గరకు వెళ్ళి వచ్చినప్పట్నుంచీ జరిగిన సంగతులన్నీ వివరంగా బెళ్ళి ముందు చెప్పుకున్నాడు. బెళ్ళి బుద్ధిమంతురాలు. తన

యోగ్యత ఏమిటో తమకి తెలుసు. లోకం అనే, 'నల్లకుక్క, తెల్ల కుక్క అవడం అసాధ్య' మనే సంగతి తెలుసామెకు. అయ్యో! మన యోగ్యతకు మించిన ఆశ పెంచుకుంటే జరుగుతుందా? సాగు చేసుకోవాలంటే, బ్రాహ్మణులుగానో, కాపులుగానో, గౌడలు గానో పుట్టాల్సింది. ఈ దిక్కుమాలిన మాదిగ కులంలో పుట్టి, సాగు చేస్తానంటే కుదురుతుందా? మన బాబుగారైనా ఏం చెయ్యగలరు? ఊళ్ళో ఏవేవో నియమాలంటూ ఉంటాయిగా మరి! దాన్ని పాటించక పోతే నలుగురూ దుయ్యబట్టరూ?

వాళ్ళమాటలా ఉంచు. రేపు నువ్వు సాగు చేస్తావే అనుకో, మన జాతివాళ్ళుమాత్రం ఊరుకుంటారనుకున్నావా? పోతే మన కిప్పుడు ఏం తక్కువైందయ్యా? ఎడ్లజత ఉంది. మన వాళ్ళలో ఇంకెవరికైనా ఎడ్లజత ఉందా అసలు! దున్నటం, కొయ్యటం మన కెలాగూ తప్పదు. సాగుచేస్తే కొత్తగా లాభమేముంటుంది? నాలుగు శేర్లధాన్యం ఎక్కువొస్తుందేమో అంతే! వర్షంలేక పంటపాడయితే ఆనాలుగు పోనూ వచ్చు. ఇప్పుడలాంటి బెడదలేమీ లేవు. ఒంట్లో సత్తువున్నంతకాలం పనిచెయ్యొచ్చు. పన్లోకి వెళ్ళిన రోజున రెండు పావుల బియ్యం తెచ్చుకోవడం ఎన్నడు లేకుండా పోదు. నాగలి కట్టిన నాటినుంచి, రోజుకు శేరుబియ్యం దొరుకుతోందిగా. అదీగాక ఎడ్లని కట్టినందుకేమయినా ఇస్తానన్నారుగా ఇంకా ఏం కావాలి?"

సుదీర్ఘమైన ఉపన్యాసమే ఇచ్చింది బెళ్ళి. చోముడు బదులు పలుకలేదు. అతని మొహం చూద్దామంటే, అంతా చీకటి, రాత్రిళ్ళు దీపం వెలిగించుకునే ఇల్లు కాదది. కనుక తండ్రి మొహం చూసి అతనేమనుకుంటున్నాడో తెలుసుకునే వీలు లేకపోయింది బెళ్ళికి. నిద్ర పోతున్నాడనుకుంది. అతని పరిస్థితికూడా ఒకరకంగా నిద్రావస్థలో ఉన్నట్టే ఉంది. మనసెలాగా జాగ్రదావస్థలో లేదు. బెళ్ళి కూడా తండ్రి పక్కలోనే ఓగుడ్డ పరచుకొని, ఉన్న ఒక్క చీరెనూ ముసుగుపెట్టి, ముడుచుకుని పడుకుంది, బయట మళ్ళీ వర్షం

విజృంభించింది. వర్షంతో బాటుగా గాలి ఉధృతంగా వీచసాగింది. చుట్టుపట్ల చెట్లు గాలితాకిడికి కొట్టుకుంటూ విరిగి పడుతున్నాయి. అదో వింత రాత్రిగా అనిపిస్తోంది. తెల్లవారే లోపల ప్రళయం వస్తుందేమోనన్నంత ఉధృతమైన వాన భయంకరంగా కురుస్తోంది.

నిజమే ! చోముడి మనస్సులోని ప్రళయాన్ని మించిన ప్రచండమైన ఉత్పాతం ఉవ్వెత్తున విరుచుకు పడుతోంది. నిద్రో, కలో మెలకువో తెలియని పరిస్థితి. ఒకరకంగా అతని మనసు పైకిలేచి ఉరుకలు, పరుగులతో ఒడ్డును ఒరుసుకునే అలల్లాగ కొట్టుమిట్టాడు తోంది. పక్కన బండరాళ్ళల్లా నిద్రపోయే పిల్లలు.........

8

కళసంలో మింగేల దొరగారి కాఫీ తోట అంటే బాగా ప్రసిద్ధి చెందినది. పెద్ద తోటకూడా. ఎంతో దూరం దాకా దిబ్బ పక్క నంతా ఆయనదే తోట. అక్కడ పనిచేస్తున్న కూలీల సంఖ్య వందల్లో ఉంటుంది. మన్వేలుడి లాంటి మేస్త్రీలొక పదిమందిదాగా ఉంటారు. అక్క డక్కడ వరుసగా ఇళ్ళున్నాయి. నగరాల్లోని 'చాలు' లాగ కూలీలకోసం 'కొట్టాలను' కట్టించారు.

గురువ చనియలున్న కూలీల గుంపు తోటను చేరుకునేసరికి మన్వేలుడు వాళ్ళని కలుసుకున్నాడు. పాత కూలీలు తమ తమ గూళ్ళు చేరుకున్నారు. చనియ, గురువల్లాగ ఇది వరకు తోట మొహం చూడని కొత్తవాళ్ళు కొంత మంది ఉన్నారు. వారిని మన్వేలుడు దొరగారి దగ్గరకు తీసుకెళ్ళాడు. ఇతను ఫలానా.

అతను ఫలానా అని ఎరుక పరిచాడు. ఆయన అనుమతి మేరకు వారికి జీతం 'ఇంత' అని నిర్ణయించటం జరిగింది. గురువ చనియలకు నెలకు ఏడు రూపాయలిస్తామని, వచ్చే సంవత్సరం ఎనిమిది రూపాయలిస్తామని చెప్పారు. వారానికి ఒక్కరూపాయి వాళ్ళ చేతిలో పెట్టి, మిగతా డబ్బులు అప్పుకి జమ కట్టుకుంటామని చెప్పారు. సరె, దొరగారితో పని పూర్తియింది. కొత్త కూలీలను వాళ్ళకోసం కేటాయించిన ఇళ్ళ దగ్గిరకి తీసుకెళ్ళాడు. చనియ, గురువల కొత్త ఇల్లు చూసి తీరాల్సిందే. పొడుగ్గా, వెడల్పు తక్కువగా కట్టిన 'కొట్టం' తలుపు ఒక్కటి తప్పించి, ఇటు, అటు ఎక్కడా కిటికీలు తలుపుల గొడవ లేదు. ఎదురుగా, వరుసగా తలుపులేగాని కిటికీలేం లేవు. ఒక గదికి, మరోగదికీ తలుపుకూ, తలుపుకు ఉన్నంత మాత్రమే దూరం. ఒక తలుపు అంటే ఒక గది. గదిలోపల అడుగు పెట్టాలంటే చాలా వినయ విధేయత లుండాలి. వినయంగా నడుము, మెడ వంచి లోపలికి ప్రవేశించక పోతే, తల ఎగిరి పోవచ్చును.

చనియ, గురువలకు వరుసలో మధ్యగది చూపించి, మన్వేలుడు వెళ్ళిపోయాడు. వాళ్ళిద్దరూ గదిలోపలికి ప్రవేశించారు. లోపల నేల, కాఫితోట నేల ఉన్నంత చదునుగానే ఉంది. వాళ్ళ చిన్న ఇంట్లో నివసించిన అలవాటు ఉంది గాని, అలాంటి నేలను మాత్రం చూసి ఎరుగరు. ప్రయాణపు అలసటతో, చేతనున్న సామాను కిందకి దించి 'ఉస్సపా!' అంటూ కాళ్ళు బార్లాజాపి చతికిల బడ్డారు. ఆ గదిలో ఒక మూలగా రాళ్ళు అడ్డదిడ్డంగా పడి వున్నాయి, అదే పొయ్యి. దాహం వేస్తున్నందువల్ల ఓకుండ చేతబట్టుకుని బయటకి వచ్చారు. చుట్టూరా చూసినా ఎక్కడా నీళ్ళు కనిపించలేదు. పక్క గదిలోని వారిని పిలిచి అడిగారు.

వాళ్ళు అక్కడ కొత్తవారే ఇహనేం చెయ్యాలా అని ఆలోచిస్తుండగా, మరోకూలి అటువేపు వచ్చాడు. అతడిని అడిగారు.

" అటు చూడకూడదూ " అనేసి వెళ్ళిపోయాడతడు. ఎటుచూసినా నీళ్ళుగాని, మయ్యిగాని, కనిపించలేదు. ఏమయితే అయిందని అతను చూపించిన దిక్కుగా క్రిందకి దిగారు. అక్కడో చిన్న సెలయేరు ప్రవహిస్తోంది, అందులో కుండ ముంచి. నీళ్ళు తెచ్చు కున్నారు.

ఇలాగే రోజువారీ కావలసిన అవసరాల అనుకూలతల పరిచయం అయింది. మరుసటి రోజునుండి తోటపని ప్రారంభ మయింది. కాఫీచెట్ల మొదళ్ళు తవ్వి సమానం చెయ్యడం, ఎరువు వెయ్యడం.... .... ఇలాటివే వందపనులు కష్టించి పనిచెయ్యడానికి వచ్చినవారికి ఆపని ఈపని అని లెక్కేమిటి? ఏదయినా చెయ్యాల్సిందే.

తోట ఈ కొసనుండి ఆకొస దాకా దక్షిణ కన్నడ జిల్లా కూలీలే. వాళ్ళందరూ కూడా గురువ చనియల జాతివారే. వాళ్ళపై వాళ్ళు, మేస్త్రీలు మాత్రం పెద్దకులాలకి చెందినవారు; కొండక్రింది వారు. అందరూ ఒకే ఊరికి చెందిన వారైన సరే తమలో తాము కలిసిమెలిసి ఉండే స్వభావం అక్కడ ఎక్కువగా కనబడదు. అక్క డంతా జడప్రపంచంలా కనిపిస్తుంది. ఏ కూలీలోనూ మచ్చుకూడా ఉత్సాహమన్న మాటే లేదు. ఖాళీగా ఉన్నపుడు గదిలో కూర్చునే పక్కగదిలో వాళ్ళని పలుకరిస్తూ ఉంటారు. ఇలాంటి క్రొత్త ప్రపంచంలో గురువ, చనియుల ఉత్సాహం ఎన్నిరోజులుండగలదు? అదే చాలదన్నట్లు, ఇద్దరికీ కాండ-జ్వరం పట్టుకుంది. ఒకరోజు ఒకడు పడుకుంటే మరుసటిరోజు రెండోవాడు. మొదట్లో జ్వరము వస్తుంటే పన్లోకి వెళ్ళే వారుకాదు. కాని అలా చేస్తే జరుగుబాటు కష్టమని తెలిసి వచ్చాక, జ్వరంతోనే పనికి వెళ్ళడం అలవాటు చేసుకున్నారు.

కొన్నాళ్ళకి గురువ, చనియలకు కొంతమందితో పరిచయం ఏర్పడింది. వాళ్ళ ఎడంవేపు గదిలో, త్రోవలో మనుమరాలిని పోగొట్టుకున్న 'పొమ్మడి' కుటుంబం ఉంది. కుడివేపున కన్నడ

జిల్లా 'కొక్కుడు' నుండి వచ్చిన మరో మాదిగ కుటుంబం ఉంది. కుటుంబమంటే ఎక్కువమంది ఏం లేరు. తల్లి, తండ్రి కూతురు - ముగ్గురు ఉన్న చిన్న కుటుంబం అది. అలా ఆ పరిచయాలతో కాస్త కాలక్షేపం చెయ్యటానికి అనువుగా ఉంది. కాని వాళ్ళ ఊళ్ళోలాగా కేకలతో, నాట్యంతో కాలక్షేపం చేయడానికిక్కడ డప్పు వాయించే రసికులెవరూ లేరు.

వాళ్ళు అక్కడికొచ్చి నాలుగారు నెలలవుతున్నాయి. ఆ మాత్రానికే వాళ్ళిద్దరికీ ఇంటి బెంగ పట్టుకుంది. అలాగని వెంటనే బయల్దేరి వెళ్ళే అవకాశం లేదు. వాళ్ళు తోటలో 'ఖాయం' కూలీలుగా చేరారు. కొంత మందిలా ఎక్కువ పని ఉన్నప్పుడు.... అంటే, పంట కాలంలో మాత్రం అక్కడకి వచ్చి వెళ్ళిపోయే కూలీలు కారాయె, ఇంటికి వెళ్ళి పోవాలనుకున్నంత మాత్రాన ఎలా వెళ్ళ గలరు? తండ్రి ఋణం కొంతైనా తీర్చగలిగితే, చెప్పకుండా పారిపోయినా, పెద్ద తప్పు క్రింద రాదు. కాని తండ్రి ఋణం ఇక ఎప్పటికి తీరుతుందో భగవంతుడికే తెలియాలి. వారానికి దొరికే ఓ రూపాయి డబ్బులతో వాళ్ళ అవసరాలు సమస్తమూ తీరాలి. అందులోనూ వారానికి ఒక్కరోజైనా మనస్సుకి తృప్తి కలిగేలా తాగాలి. జీతం రోజు వచ్చిందంటే—కార్యాకశపు పొమ్మ్రదున్నాడు. మరి కొందరు కూలీలున్నారు. అందరూ తోటకు దగ్గరగా ఉన్న కల్లుపాకకి దారితీసేవారు. ఈత కల్లు అప్పుకు పోసే కొట్టువాడూ ఉన్నాడు. కనుకనే త్రాగడానికి ఉత్సాహంగా ఉండేది. జీతం రోజునే రెండు మూడు అణాలు ఖర్చయ్యేవి. అప్పు కూడా దొరుకుతుందన్నాక వారంలో రెండు మూడు రోజులైనా హాజరు వేయించుకోక తప్పేది కాదు. దీనితో వారానికి దొరికే రూపాయి డబ్బుల్లో 8-10 అణాలు తాగుడుకే అయిపోయేది. ఇహ మిగిలిందాంతో తిండి, బట్ట అన్నీ గడవాలి. భోజనానికి సరిపోక పోవడంతో అప్పు చేయాల్సి వచ్చేది. మొత్తం మీద నెల జీతంలో ఏ పైసా

మిగలకుండా ఖర్చయ్యేది. చోముడి ఉపదేశం ఉపదేశంగానే ఉండి పోయింది. ఉదయం నుండి రాత్రి దాకా చాకిరీ చేసి రోజుల్ని గడిపారే గాని, చోముడి ఋణం అలాగే ఉండిపోయింది. కాదు, కాదు మరో ఐదారు నెలల వడ్డీతో మరింత ఎక్కువైంది కూడా.

తాగడం మానేద్దామంటే, పాడు అలవాటు, అది వాళ్ళని వదలటం లేదు. అంతే కాకుండా, ఆ నీరసమైన బతుకులో కాస్తంత హాయిని కలిగించే సంజీవిని మరొకటి ఏముంది గనుక! ఇటు చనియుడి మనసు తండ్రి వాగ్దానం తన పెళ్ళి గురించి ఆలోచిస్తూంది. ఒక పిల్లను కట్టుకుని, కాపురం చేసుకుంటూ సుఖంగా బ్రతకాలన్న కోరిక రోజు రోజుకి పెరిగి పెద్దదవుతోంది. పెళ్ళి చేసుకున్నాక ఇక తోటకు తిరిగి రాకూడదని కూడా నిర్ణయిం చేసుకున్నాడు. చనియుడి సంగతి అలా ఉండగా గురువడి సంగతి మరోలా ఉంది. తాగే అలవాటులో గురువడు అన్న కన్న ఎక్కువ కాకపోయినా, తక్కువేం కాదు. అన్నదమ్ములిద్దరూ తాగి వచ్చి దెబ్బలాడుకోవడం కూడా కద్దు. దీని వల్ల రానురాను అన్నదమ్ముల మధ్య ఓ రకమైన శత్రుభావం మొలకెత్తుతోంది. అది బలపడడానికి ఓ కారణం—చోముడు చనియుడికిచ్చిన మాట. పెళ్ళి చేస్తానని అనటం. అన్నకు పెళ్ళి చేస్తాడు. తన సంగతేం అనలేదు అయ్య. తానేం చిన్నవాడు కాదుగా. అతనిలా తనకూ పెళ్ళి కానక్కర్లేదా? ఎందుకిలా జరగాలి? మొదటినుంచీ తనకు ఆదరణ తక్కువే అన్న అసూయ గురువడికి.

ఈ అసూయ ప్రతీకారంగా రూపం దాల్చుతోంది వాళ్లకి మరో ప్రక్కన ఉన్న తల్లి, తండ్రి, కూతురు ఉన్న కుటుంబంతో గురువడు బాగా స్నేహం కలిపాడు. తల్లి, తండ్రి ముసలివాళ్ళు. వాళ్ల కూతురు, పెళ్ళికాని 'మారి'. గురువ, మారిల మధ్య స్నేహం ప్రణయంగా మారింది. మారికి పద్దెనిమిది ఏళ్ళుండవచ్చు. గురువడు ఆమెకన్నా మూడేళ్లు పెద్దవాడు. ఇద్దరి మధ్య సాన్నిహిత్యం బలపడ

సాగింది. ఈ సంబంధం జరిగితే తమ బ్రతుకు భారంలో కొంత యినా అల్లుడు పంచుకుంటాడన్న ఆశ, ముసలి దంపతులకు. కాని, ఏదీ గట్టిగా అనుకునేటంత దూరం రాలేదు గనుక మాట్లాడక ఊరుకున్నారు. చనియుడికి తమ్ముడు ప్రవర్తన సంశయం కలిగించింది. ఓరోజు గురువని పిలిచి, 'నువ్వు వాళ్ల గదిలోకి వెళ్లకు' అని చెప్పాడు. గురువడు బదులు చెప్పలేదు. వెళ్లటం మాననూ లేదు. చనియుడికి కోపం వచ్చింది. "ఏం? మారిని కట్టు కుంటావా?" అన్నాడు. గురువ దురుసుగా, "అవును, ఏం చేస్తావేం?" అన్నాడు. అంత విషూరంగా వాళ్లిద్దరూ ఎప్పుడూ మాట్లాడుకోలేదు. చనియుడు నొచ్చుకున్నాడు. కోపం తెచ్చుకోటానికి మారుగా, నయంగా 'వాళ్లు ఏ జాతి వారనుకున్నావు? మన వాళ్లే అయినా, చర్చికి చెందినవారు. ఉట్టినే దాని పిచ్చిలో పడకు. అయ్యకు చెప్పి వేరే సంబంధం చేయిస్తాను' అని బోధ పరిచాడు.

గురువడికూడా 'మారి' కిరస్తానీ అని తెలీదు. అదే ఆమె పేరలా, ఉండటానిక్కారణం. 'మేరీ' అన్న నామం 'మారి' అన్న తద్భవంలోకి దిగింది. ఆ ముగ్గురూ కొక్కడానికి చెందిన క్రిస్టియనులు. ఏసుక్రీస్తు ఎవరో వారికి తెలియకపోయినా, వాళ్ల మెడలో చిన్న క్రాసొకటి వేళ్లాడుతోంది. గురువడికి తన భవిష్యత్తుని గురించిన చింత కలిగింది. ఆ మారిని పెళ్లి చేసుకుంటే తనూ కిరస్తానీ అవుతాడు. అయ్య దానికి ఒప్పుకోడు. ఈ ఒక్క కారణం చేత వాళ్ల ప్రణయం వీగిపోతుందా!

చనియు, గురువలు తోటకు వెళ్లి 8-10 నెలలు అవుతోంది. చోముడు తన కొడుకుల గురించి రాత్రి, పగలు చింతిస్తున్నాడు. ఇటు చనియుడు ఎప్పుడు ఇంటికి వెడతానా అని ఆత్రపడుతున్నాడు. ఆ సమయంలో కూలీలకు ఓ నెలరోజులు శెలవు దొరికింది. ఊరికి వెళ్లాలనుకున్నవారు తమ వస్తువుల్ని మూట కట్టుకుని ప్రయాణానికి కొంతమంది ఆ రాత్రే ప్రయాణమయ్యారు. కొంతమందికి ఊరికి

వెళ్ళేటప్పుడు బస్సులో వెళ్ళాలనికోరిక. చనియ, గురువలు ఇంత వరకు బస్సు ముట్టుకుని ఎరుగరు. చచ్చేలోపల ఆ విచిత్ర వాహనములో ప్రయాణం చేయాలను కున్నారు. వాళ్ళ గదిపక్కన మూడు, నాలుగు కుటుంబాల వాళ్ళు బస్సు ప్రయాణీకులే. మనవరాలిని పోగొట్టుకున్న 'పొమ్మడు' మాత్రం బయల్దేరలేదు. అతని ఇంటి దాని మనసుకు ఇంతవరకు సమాధానం కలుగలేదు. 'ఇక ఊరెందుకు? గుడిసెందుకు?' అని కన్నీరు పెట్టుకుంటూనే ఉంది.

వాళ్ళందరూ కళసం చేరారు. వీళ్ళలాగే బస్సుమీది మోజుతో వచ్చిన నూరారుమందీ అక్కడ చేరారు. బస్సు ఏజంటుకి ఇదో పండుగలా ఉంది. ఒకొక్క వాహనానికి 30-40 మందిని నింపుతున్నాడు. బస్సులోనే కాకుండా, పైన మడ్‌గార్డ్ మీదకూడా మనుషులే! తోటకూలీల కొండ దిగుడుకు ప్రయాణం ప్రారంభం అయింది. మొదటి గుంపుని బార్మడి కొండ అంచున క్రుమ్మరించి. మళ్ళీ కూలీలని నింపుకు రావడానికి బయల్దేరింది. వచ్చిన కూలీలందరూ అక్కడే మధ్యదారిలో పడివున్నారు. క్రిందనుండి బస్సు ఎప్పుడు వస్తుందో, తాము ఎప్పటికి ఊరు చేరుకుంటామో తెలియని పరిస్థితి. అంతలో ఓ బస్సు వచ్చింది. దానిలోనుండి మనుషులు క్రిందకి దిగుతుండగానే, క్రిందనున్నవారు బస్సు ఎక్కిపోయారు. బస్సు ఏజంటు వాళ్ల టిక్కెట్లని చూస్తే, అవి ఇంకో కంపెనీవట. సరె, అందర్నీ దింపేశారు. ఇలా కాచుకుని, విసుగెత్తి, ఆఖరికి ప్రయాణం చేసి బెళ్ళంగండికి చేరుకొన్నారు. అందులో కొంత మంది బస్సులో ముందుకు ప్రయాణం చేశారు. మిగతావాళ్ళు రోడ్డు పక్కనపడి నిద్ర పోయారు. ఒళ్ళెరుగని నిద్ర అది.

తెల్లవారింది. చనియుడు లేచి తమ్ముడ్ని పిలిచాడు. ఇంకా రెండు రోజుల ప్రయాణం మిగిలి ఉంది. వాళ్ల భోగనపల్లెకు. ఆత్రంగా బయల్దేరడానికి సిద్ధమయ్యాడు. కాని గురువడు ఎక్కడా కనిపించలేదు. నదివేపు వెళ్ళాడేమోనని కాసేపు ఎదురు చూశాడు.

రాలేదు. నదీ తీరానికి వెళ్ళి చూశాడు చనియ, అక్కడా లేడు. అన్నిచోట్ల వెతికి చూశాడు. వీళ్లతోపాటు వచ్చిన 'మారియమ్మ' కుటుంబం కూడా కనిపించలేదు. తమ్ముడు తనని వదిలేసి ఆ మారియమ్మ మీది మోహంతో వాళ్లతో పారిపోయాడని అప్పటికి తెలిసింది. ఇంటికి వెళ్ళాలన్న ఉత్సాహం సర్రున దిగిపోయింది. గాలిలో పక్షిలా ఎగురుతున్న అతని హృదయం సీసంలా బరు వెక్కింది. కళ్లనీరు పెట్టుకుంటూ, ఇహ నెవరితోనూ ఏమీ చెప్ప కుండా ఇంటికి బయల్దేరాడు. త్రోవలో ఎక్కడా ఆగకుండా, ఆకలి దప్పుల్ని లెక్కించకుండా అర్ధరాత్రి వేళకు ఇల్లు చేరాడు. గుడిసె ముందు నుంచుని "బెళ్ళి, బెళ్ళి" అని తలుపుతట్టాడు.

9

రేపే భోగనపల్లె పక్కనున్న పల్లెలో జాతర. పోయిన సంవత్సరం చోముడు తన పిల్లలను తీసుకుని వెళ్ళి వచ్చాడు. ఈ సంవత్సరం జాతర టైముకి పెద్దకొడుకు లిద్దరూ ఇంటికి వచ్చినట్లయితే, సంతోషంగా గడపాలన్న ఆశ మనసులో మిణుకు మంటోంది. బెళ్ళి కూడా అన్నల్ని చూడాలని ఆత్రంగా ఉంది. అందులోనూ గురువంటే కొంచెం మమత ఎక్కువ. అన్నలొస్తే రేపు జాతరలో ఎంతో సంతోషంగా గడపవచ్చని ఆలోచిస్తోంది. జాతర ఈనాము అడగడానికి అవ్వాళ సాయంత్రం తండ్రి-కూతుళ్ళిద్దరూ యజమాని ఇంటికి వెళ్ళారు. సంకప్పయ్యగారు ప్రసన్నంగా ఉన్నారేమో, ఇద్దరికీ అర్ధణా చొప్పున ఇచ్చారు. "ఇదిగో, ఇది నీ చిన్న కొడుకులకి. వాళ్ళ చేతికే ఇవ్వు. అంతా నువ్వే తాగి కూర్చోకు." అనీ అన్నారు. చోముడు నవ్వుతూ ఇంటికి వచ్చాడు.

సాయంత్రం గంజి తాగి కూర్చుని, డప్పు మ్రోగిస్తూ గడిపాడు. బెళ్ళి కూడా సంతోషంగా ఉంది. పండుగ ఖర్చుకోసం రెండు బుట్టలు కూడా అల్లి ఉంచింది వాళ్ళ సంతోషానికి. చనియ-గురువలు లేని దొక్కటే లోపం. పడుకునే ముందు చోముడు "ఈసారి పిల్లలు తిరిగి ఇంటికి వస్తే, ఇహ మళ్ళీ వారిని తోటకు పంపేది లేదు. ఇద్దరూ కలిసి అప్పు తీర్చేసి ఉంటారు. తీర్చక పోతే ఎడ్లను అమ్మి అయినా సరే తీర్చేస్తాను" అనుకున్నాడు. ఏ కారణం చేతనయితేనేం గాక పెద్దకొడుకులిద్దర్నీ వదిలి పెట్టి ఉండడం అతని బ్రతుకులోని చీకటిని మరింత ఎక్కువ చేసింది.

అదే రాత్రి చనియడు ఇల్లు చేరాడు. మరుసటి రోజు పండుగని తెలిసిన వాడి లాగానే వచ్చాడు. వచ్చేటప్పటికి రాత్రి చాలా పొద్దుపోయింది. ఆయాసంతో మాట సరిగ్గా రావటంలేదు. అలాగే రెండు మూడు మార్లు చెల్లెలిని పేరు పెట్టి పిలిచాడు. ఆమెకి మెలకువ రాలేదు. ఆఖరికి 'అయ్యా, అయ్యా' అని పిలిచాడు. చోముడికి నిద్ర పట్టిందో లేదో గాని, ఈ పిలుపు అతని చెవులకి సోకింది. "ఎవరు?" అన్నాడు. "నేను చనియుణ్ణి" అన్న బదులు రాగానే, గభాలున లేచి, తలుపు తీశాడు. "బెళ్ళి, బెళ్ళి, అన్నలొచ్చారు చూడు" అని కూతుర్ని లేపాడు. ఈ సంవత్సర కాలంలో ఇవ్వాళ కలిగినంత ఆనందం అతనికి ఎప్పుడూ కలుగలేదు.

బెళ్ళి లేచి, పొయ్యిలో నిప్పు ఉందేమోనని ఊది చూసింది. లేదు. ఉండటానికి ఆ సాయంత్రం ఆమె వంట చేసుంటే కదా! బయటకి వచ్చి వేడి నీళ్ళు కాచుకునే పొయ్యిలో నిప్పు ఉందేమో నని చూసింది. అక్కడ కూడా లేదు. వెలిగించటానికి అగ్గిపుల్ల కూడాలేదు. అయ్యో! చీకట్లో ఉండాలే! అని బాధపడింది. చోముడు "చనియా. గురువా, అంతా బాగున్నారు కదా పిల్లలూ. అంటూ పిల్లల్ని దగ్గరకి తీసుకోవడానికి చెయ్యి ముందుకు జాపాడు.

చనియుడి చెయ్యిదొరికింది. "ఎవరూ. చనియుడా?" అన్నాడు. అవునని బదులు వచ్చింది. అడిగినదానికన్నా ఎప్పుడూ ఎక్కువ బదులు చెప్పి ఎరుగని కొడుకులు! ఇప్పుడసలు మాట్లాడే పరిస్థితి లోనే లేడతను.

"చనియా, రేపు పంజంలో జాతర. తెలుసా?"

"ఊహూఁ"

"రేపే జాతర, అయ్యగారు మాకంతా అర్ధణా చొప్పున ఇచ్చారు. నువ్వు సాయంకాలమే వచ్చుంటే నీకూ అర్ధణా దొరికేది. బెళ్ళి....."

"అఁ...."

"మీ అన్నకు చెప్పు. ఆ పిల్ల ఎవరో...."

బెళ్ళి నవ్వేసింది, చనియుడికి కొంత అర్ధ మయింది.

చోముడు మెల్లిగా 'చనియా! నువ్వొచ్చావుగా పెద్దవాళ్ళు పరేనంటే ఈ వర్షాకాలం లోపలే పెళ్ళి జరిపిస్తాను. పిల్ల బాగుంది. నువ్వు చూసేఉంటావు. పంజంలో ఎగువ కొప్పంలో ఉండే 'మొంద'వి కూతురు. 'గిడ్డి' రేపు జాతరకి ఎలాగా వస్తుంది. చూద్దువుగాని అన్నాడు,

చనియుడు సంతోషిస్తున్నాడో దుఃఖిస్తు న్నాదో ఏదీ తెలియటం లేదు,

"గురువా దైవం అనుకూలిస్తే వచ్చే సంవత్సరం లోపల నీ పెళ్ళి కూడా చెయ్యాలనుకుంటున్నాను, ఈ సారే వెదికాను గాని సరైనా పిల్ల దొరకలేదు. అంతేకాకుండా మనకులం కట్టుబాట్లకు సరిపోయే పిల్లకావాలికదా! ఏదో ఓ పిల్ల అనుకోలేదు. అలాచూస్తే గుత్తిగారులో దిగువ కొప్పలో ఆ పిల్లలేదూ...."

గురువడి పేరెత్తగానే చనియుడికి భయంవేసింది, బెళ్ళికి అన్న ఏమంటాడో వినాలన్న ఆత్రం. గురువని కంఠం వినిపించక పోయేసరికి బెళ్ళి. "అన్నా నీకు కోపంగా ఉందా ఏమిటి?" అంది.

చనియుడు వణికే గొంతుతో "గురువ రాలేదు" అన్నాడు. చోముడికి గాబరాతో దిక్కుతోచలేదు. "అయితే వాడేడి? ఇంట్లో ముసలి తండ్రిని చూడాలని లేదా వాడికి? ఉట్టినే నేనుమాత్రమేనా పిల్లలెప్పుడొస్తారా అని ఎదురు చూసేది? వీళ్ళకి మూతిమీద మీసాలు వచ్చేసరికి ఎవరి లక్ష్యమూ ఉండదు," అన్నాడు.

"అన్న అలాంటి వాడు కాడు. తోట దొరలు వదిలి పెట్ట లేదేమో" అంది బెళ్ళి.

ఇక మౌనంగా ఉండడం మంచిది కాదనిపించింది చనియకి. కాని, మాట్లాడటానికి ధైర్యం రావటం లేదు. ఎలాగో గొంతు పెగల్చుకుని తనకు తెలిసిందంతా పూస గుచ్చినట్టు చెప్పేసి, నిట్టూరుస్తూ కూర్చున్నాడు. బెళ్ళికి కోపం వచ్చింది. "గురువన్న ఎన్నటికీ అలా చెయ్యడు. వీడే వాడి దగ్గర ఏదో దెబ్బలాట పెట్టుకుని వుంటాడు. ఇంటోను అంతేగా గురువన్నతో ఎప్పుడూ దెబ్బలాట వేసుకునే వాడు" అంది, చోముడికూడా అదే నిజమేమోననిపించింది వెంటనే. "రేపునేనే వెళ్ళి పిల్లాడ్ని తీసుకొస్తాను. నువ్వేమయినా వాడితో దెబ్బలాడి లేని మాటలు చెప్పావని తెలిస్తే నీబుర్ర పగల గొడతాను" అన్నాడు. అప్పుడు గనుక వెలుతురుండి ఉంటే చోముడెంత ఉగ్రరూపం దాల్చాడో తెలిసేది. చనియుడికి తండ్రి కంఠం వినగానే అతని కెంత కోపం వచ్చిందో అర్థమయింది. కాని, అతనేం చెయ్యగలడు? మళ్ళీ మళ్ళీ అదే కథ చెప్పాడు. "వాడు కొక్కడం మారియమ్మ వెంట పడిపోయాడు" అని అన్నాడు. చెప్పి చెప్పి చనియుడికి ఏడుపే వచ్చింది.

అప్పటికాని చోముడు కోపం తగ్గలేదు. కాస్త తమాయించుకొని, వాళ్ళ వివరాలన్నీ అడిగి తెలుసుకున్నాడు. తన కొడుకు అలాటి పని చెయ్యగలడని చోముడు కల్లో కూడా ఊహించ లేదు. మాటల్లో ఆ మారియమ్మ. కిరస్తానీ మేరియమ్మ అని తెలియగానే అతడి గుండె పగిలినంత పనయింది. పూర్వం నుండీ వచ్చిన

రీతి-రివాజులను వదిలి పెట్టి ఒక్క పిల్ల కోసం అతను జాతిని వదులుకునే వాడయితే జన్మలో ఇహ వాడి మొహం చూడనని శపథం చేశాడు. బెళ్ళి దుఃఖావేశాలతో ఊగిపోయింది. తన ముద్దుల అన్న జాతిని వదలి, వేరే జాతి పిల్లని పెళ్ళాడి. ఇహ తమ కుటుంబంతో రాకపోకలు కూడా పెట్టుకోలేడని తెలిసి విల విల్లాడిపోయింది. "సంగతీలా ఉందని నువ్వు ముందే మాకు ఎందుకు తెలియజెయ్యలేదు?" బెళ్ళి అన్నను తిట్టి పోసింది. చనియుడికి కూడా తాను ముందుగా తెలుపకపోవడం తప్పేనేమో ననిపించింది.

బయట ఇప్పుడు వెన్నెల కాస్తోంది. ఆ చీకట్లో ఒకరి మొహం ఒకరికి కనిపించకపోయినా, వెలుతుర్లోకి వచ్చి కూర్చోవా లనిపించటల్లేదెవరికీ. ఆ వెన్నెల కూడా అమావాస్య చీకటిలా ఉంది వారి మనసులకి. ఏం చెయ్యాలో ఎవరికీ తోచటం లేదు. బహుశా: అతడు బెళ్తంగడిలోనే దారి తప్పిపోయాడేమోనని బెళ్ళి లేని ఓదార్పు తెచ్చుకోడానికి ప్రయత్నిస్తోంది. కాని చనియుడు 'నేను ఊరంతా గాలించాను' అంటాడు. ఇక ఇప్పుడు చెయ్యాల్సిం దేమిటి? తమ ఋణం తెంచుకుని వెళ్ళిపోయిన గురువడిని అలాగే వదిలెయ్యడమా? లేక, ఎలాగైనా ప్రయత్నించి వెనక్కి తీసుకు రావడమా?

ఎలాగేనా వెనక్కి తీసుకురావడమే మంచిదని బెళ్ళి సూచిం చింది. చోముడి గుండెలో మంట ఇంకా చల్లారలేదు. వాడే అలాగ మనల్ని కాదనుకుని వెళ్ళినపుడు. నేనెందుకు బతిమాలాలి? 'గుళిగ' 'పంజుర్లి' ఏదో ఒకటి వాడిని తినేసిందనుకుంటాను. దేవుడు నలుగురు కొడుకుల్ని ఇచ్చాడు. అందులో ఒకడు చనిపోయుంటే ఏం చేసి ఉండేవాడిని? అన్నాడు. కాని ఈ వైరాగ్యం ఎంతసేపు నిలవగలదు? కన్నతీపి కదూ? కోపం వచ్చినా ఆక్షణమే. మరు క్షణం అదే కరగి కరుణగా మారుతుంది. "లేదు. వెళ్ళి వెతికి

వాడిని పట్టుకొస్తాను. ఆ 'మారి' కన్నా అందమైన పిల్లను తెచ్చి వాడికి పెళ్ళిచేస్తాను.'' అన్నాడు. అనడమేకాదు వెంటనే బయల్దేరాడు.

జాతర రోజు— తెల్లవారుతోంది. జాతర అవనీ రేపు వెళ్ళొచ్చు అంటూ పట్టుపట్టినా తండ్రి వినలేదు. చనియదు తానూ వస్తానన్నాడు. చోముదు రానివ్వలేదు. చంకలో ఓకఱ్ఱ ఇరికించుకుని కొక్కడం వేపు నడక సాగించాడు.

10

జాతర రోజు అది. ఊరంతా నవ్వుతూ త్రుళ్ళుతూ కష్టాలన్నీ మరచిపోయి పండుగ చేసుకునేరోజు. చోముడి సంసారంలో మాత్రం అది చీకటిరోజుగా పరిణమించింది. చోముదు కొక్కడం వేపు వెళ్ళగానే బాగా అలసిపోయిన చనియుడు వచ్చిపడుకున్నాడు. అంతలో కోడికూసింది, బెళ్ళికి నిద్ర పట్టలేదు. బయట అడవిలో ఏదో చప్పుడవడంతో చోముడి నల్లకుక్క భౌ భౌ మంది. దాంతో బెళ్ళి తెల్లవారేదాకా అలాగే కూర్చుచి కాలక్షేపం చేసింది? తండ్రి పిల్లలూ చేరి ముందురోజే కావలసినంత ఆకుమోపులు తెచ్చి పడెయ్యటంతో ఇవ్వాళ ఆపని లేదు. గంజి కాయటం కోసం నిప్పుతేవడానికి యజమాని ఇంటికి బయల్దేరింది బెళ్ళి. అక్కడ అందరూ జాతరకు వెళ్ళే సందడిలో ఉన్నారు. తన దుఃఖం చెప్పుకోవడానికి అవకాశం లేక. నిప్పుతీసుకుని వచ్చి గంజి కాచడానికి పొయ్యి ముందు కూర్చుంది. తెల్లవారగానే నీల, కాళలు లేచి ఉత్సాహంతో గంతు లేశారు. ''తొందరగా గంజి కాస్తావా? మనం తాగేసి వెడదామా?

రాత్రిక్కూడా అక్కడే ఉంటామా? అని బెళ్ళిని ప్రశ్నలతో విసిగించారు. బెళ్ళి పరధ్యానంగా ఉంది. వాళ్ళకు జవాబు ఇవ్వకుండా మౌనంగా ఉండిపోయింది. పిల్లలు గబగబవెళ్ళి కాలువలో స్నానంచేసి వచ్చారు. "కిస్మర" పూలు. ఇంకా కొన్ని అడవి పూలు కోసి తెచ్చారు. సంతోషంగా పరుగెత్తు కుంటూ వచ్చి, "అక్కా, అక్కా, నీకోసం పూలు తెచ్చాం. చూశావా ఎంత బాగున్నాయో. అయ్య ఎక్కడికి వెళ్ళాడు? జాతర మొదలు పెట్టేలోపలే మనం వెళ్ళొద్దా?" అన్నారు.

దీనికి బెళ్ళి బదులు చెప్పలేదు.

తమ్ముళ్ళిద్దరికీ గంజి ఇచ్చింది. అన్న దగ్గరకెళ్ళి, "అన్నా, లే." అంది, అప్పుడు తమ్ముళ్ళిదరి దృష్టి చవియుడి మీద పడింది. దాంతో మొదటే ఉత్సాహంగా ఉన్న వాళ్ళిద్దరూ మరింత ఆనందంగా "ఓ.........అన్న వచ్చాడని గంతులేశారు." గురువన్న ఏడీ?" అన్నారు. "రాలేదు, రెండు రోజుల్లో వస్తారు." అంది బెళ్ళి. ఆ దుఃఖాన్ని తమ్ముళ్ళకి పంచిపెట్టడం ఇష్టంలేదు బెళ్ళికి.

పిల్లలిద్దరూ భోజనానికి కూర్చున్నారు. అదెంత? నిమిషం లోని పని. వాళ్ళు లేచేలోపల చవియుడు మొహం కడుక్కొని వచ్చాడు. "అన్నం, నీళ్ళు లేక అలసిపోయావు. భోంచెయ్యి. అన్నీ సర్దుకుంటాయి." అంది బెళ్ళి. చవియుడు భోజనానికి కూర్చున్నాడు. వాళ్ళ భోజనాలూ అయ్యాయి. తమ్ముళ్ళు, "అయ్య ఏడీ? ఇంకా ఎప్పుడట జాతరకి బయల్దేరడం?" అంటూ గొడవ చేస్తున్నారు. ఇంటి ఎదుటే జాతర జరిగే పంజ ఊరికి వెళ్ళే దారి ఉంది. ఆ దారిన చాలా మంది వెడుతున్నారు. వాళ్ళనిచూసి, "చూడక్కా, అందరూ వెళ్ళిపోతున్నారు. మనం మాత్రం జాతర అయ్యాకనా వెళ్ళడం?" అంటూ తొందర పెట్ట సాగారు పిల్ల కాకులు. వాళ్ళ ఆత్రానికి బెళ్ళికి విసుగొచ్చింది. మళ్ళీ జాలేసింది.

కొ_స్త కొబ్బరి నూనె తెచ్చి, తలమీద తట్టి, ఆడపిల్లలకు లాగ దువ్వి, జడవేసి, పూలు పెట్టింది. "నీలా, నువ్వు, కాళ ముందుగా వెళ్ళండి, అయ్య ఇంటి కొచ్చేసరికి పొద్దు పోతుంది, మేము తరువాత వస్తాం." అంది. పిల్లలు ఉత్సాహంగా బయల్దే రారు. "అక్కా. అయ్యగారు పండక్కి డబ్బు లిచ్చారన్నావుగా?" అని గుర్తుచేశారు. బెళ్ళి అర్ధణా వాళ్ళచేతికిచ్చి. "ఇద్దరికీ ఇది, వెళ్ళ గానే ఖర్చు పెట్టకండి. మేమువచ్చాక ఏది కావాలంటే అదికొనిస్తాం." అంది, పిల్లలు సంతోషంగా పరిగెడుతూ, మళ్ళీ ఏదో గుర్తుకొచ్చి, వెనక్కివస్తూ, "ఓ, బాడూ!" అనిపిల్చారు. బాడు—కుక్క పరిగెత్తు కుంటూవచ్చి వాళ్ళదగ్గర నుంచుంది. "అక్కా, అక్కా బాడూకి గంజి వేశావా?" అన్నారు, బెళ్ళి కోపంతో "జాతరకెందుకు బాడూ?" అంది, కానివాళ్ళు వినలేదు. బాడుకి కూడా కొ_స్త కూడు పడేసింది. పిల్లలు జాతరకి బయల్దేరారు.

నిన్నరాత్రివరకు బెళ్ళికి జాతరకి వెళ్ళాలనే ఉంది. కాని గురువన్న కథవిన్నాక ఆమె ఉత్సాహమంతా నీరుగారి పోయింది. అదొక్కటే గాక తండ్రి లేకుండా తాను వెళ్ళటం ఇష్టలేదు తమ్ముళ్ళని తీసుకు రావటానికి మధ్యాహ్నం లోపలవెళ్ళటానికి అన్నఉన్నాడుగా, అనుకుంది, చనియుడు భోంచేసి కడుపులో బాధగా ఉంది అంటూ చాపమీద పడుకున్నాడు. బెళ్ళి అన్న ఒళ్ళు ముట్టి చూపింది. జ్వరంతో ఒళ్ళు పేలిపోతోంది. "అది కొండజ్వరం అయి ఉండొచ్చు. విన్నంతా నడిచావు. ఒళ్ళు పులిసి పోయి ఉంటుంది, అంది కాని కొండజ్వరంలాగ కొన్నిగంటల్లో తగ్గిపోలేదు, ఒకేసమంగా ఉంది, బెళ్ళికి ఏం చెయ్యాలో తోచలేదు. చనియుడు కడుపులో మంట. మంట అని అరుస్తున్నాడు, దాహానికి అడుగు తున్నాడు. బెళ్ళికి దిక్కుతోచలేదు, ఎక్కడైన వెళ్ళి ప్రశ్న అడిగి వద్దామని బయల్దేరింది, కాని ఊళ్ళో ఎవరైనా ఉండే రోజాఅది? అందరూ జాతర యాత్రికులే. మందేమయినా తెచ్చి ఇద్దమన్నా

ఇదే సమస్య. ఈ సమయంలో పిల్లల్ని ఎందుకు పంపానా అని బాధపడింది. మళ్ళీ వాళ్ళనెవరు వెనక్కి తీసుకొస్తారు?

బెళ్ళి అన్న దగ్గరగా కూర్చుంది. ఆమె ఎన్ని ఆశలు పెట్టుకుంది. అన్న జతలో జాతరకు వెళ్ళి, కాబోయే వదినను చూపించి అన్నను ఏడిపించాలని మనసులోనే కలలు కంది. ఇప్పుడు చూస్తుంటే చింపి చాపమీద జ్వరంతో, బాధతో గిలగిల్లాడుతూ పడి ఉన్నాడు అన్న. 'మంట, మంట' అన్న ఒక్కమాటే వినవస్తోంది. అతని నోటివెంట, ఎండ ఎక్కువవుతుండగా, "నేనిక బతకను. చచ్చిపోతాను 'అయ్యా అమ్మా' అంటూ విలవిల్లాడ సాగాడు. బెళ్ళికి అరువుతెచ్చుకున్న కాస్త ధైర్యమూ తుడిచి పెట్టుకుపోయింది. గ్రామశక్తికి దండం పెట్టుకుని రెండు కొబ్బరి కాయలు దిగదుడిచింది. అన్న అరుపులు, బొబ్బలు ఎక్కువ కావడంతో రెండు కోళ్ళు మొక్కుకుంది.

సాయంత్రమయింది. చనియుడి పరిస్థితిలో మార్పేమీ లేదు. జ్వరం తగ్గే సూచనలే లేవు. ఇటు జాతరకు వెళ్ళిన కుర్రాళ్ళు. అన్న, అక్క వస్తారని చాలాసేపు ఎదురు చూశారు. ఆఖరికి తమకెలా తోస్తే అలా సంబరంలో తిరిగి, సాయంత్రం, సూర్యుడు అస్తమించబోతుండగా, ఇక వీళ్ళు రారేమోనన్న అనుమానంతో సగంలోనే సంబరం చాలించుకుని తిరుగుమొహం పట్టారు. ఇంటికి రాగానే తమతో అబద్ధాలు చెప్పిన అక్కమీద తమ కోపమంతా తీర్చుకోవాలనుకున్నారు. కాని ఇంటో పరిస్థితి చూసేసరికి వాళ్ళకి భయం వేసింది. అందులోనూ, అయ్యలేడని మరింత బెంగపెట్టుకున్నారు.

ఒకరోజు రోజంతా ఇలాగే గడిచింది. జ్వరంతో చనియుడి మొహమంతా నల్లగా కమిలిపోయింది. మరుసటి రోజు తెల్లవారగానే బెళ్ళి, ఆకు కోసుకు రావడానికి తమ్ముళ్ళని పంపి, అన్న పడుకుని ఉండగా, తన దగ్గరున్న అణా డబ్బులను చేత బట్టుకుని ఊళ్ళో మరో కొసలో ఉన్న 'ఆజిల చిన్నడి' దగ్గరకి వెళ్ళింది.

అజిలి చిన్నడంటే వాడూ ఒక మాదిగవాడే. కాని మాదిగ వాళ్ళలో బ్రాహ్మణ మాదిగ వాడున్నట్లు. మిగతా మాదిగ వాళ్ళకి మందు. మాకు, మంత్రాలు, పూజలు—ఇవన్నీ చేసే పురోహితుడు. వెళ్ళగానే చిన్నడిని కేకేసి పిల్చింది. చిన్నడింకా జాతర నుంచి రాలేదప్పటికి. ఇప్పుడే వస్తాడని అతని పెళ్ళాం చెప్పడంతో కాచుక్కూర్చుంది. తెల్లవారి జాము పొద్దెక్కాక చిన్నడి సవారి వచ్చింది. రావటం, కల్లు పొట్టనిండా పట్టించే వచ్చాడు. అతని ఎదుట అణా డబ్బు లుంచి అన్న సంగతి చెప్పింది బెళ్ళి. సారా మత్తులోంచి బయటపడి, ఆమెను వినడానికి ఓ గంట పట్టింది. ఆ తరువాత ఏవో గవ్వలు, పూలు తెచ్చి క్రింద పరచి, కూర్చునీ, నుంచునీ ఏవో మంత్రాలు చదివి, ఆఖరికి గంభీరంగా, "పంజుర్లికి పూజ కావాలి. కోడి కావాలి." అని ఆ శక్తికి వకాలత్తు పుచ్చుకున్నట్టే మాట్లాడాడు. బెళ్ళి చేతులు జోడించి, "పంజుర్లి! నువ్వే మాకుటుంబాన్ని కాపాడాలి" అని వేడుకుని ఇంటికి తిరిగి వచ్చింది.

మరో రోజు గడిచింది. జ్వరంతో బాటు, రొమ్ములో నొప్పి, కఫం కూడా తోడయ్యాయి. మళ్ళీ చిన్నడి ఇంటికి పరుగు తీసింది బెళ్ళి. చిన్నడు, "దానికి మందేం అక్కర్లేదు. కఫం వెళ్ళిపోతే చనియడు ఝామ్మని లేచి కూర్చుంటాడు" అన్నాడు. బెళ్ళికి వైద్యం సంగతేం తెలుసు? అన్నని అడిగినది, తన దగ్గరున్నది ఇచ్చి, వాడి సేవ చేస్తూ కూర్చుంది. ఈలోపల సంకప్పయ్యగారి ఇంటి దగ్గర్నుండి "చోమా! చోమా!" అన్న పిలుపు వచ్చింది. ఒక్కసారి అటు వెళ్లి, తమ ఇంటి పరిస్థితిని, తండ్రి కొక్కడం వెళ్లడాన్ని గురించి చెప్పి వచ్చింది. ఆయనా సంగతి తెలిసి విచారించారు. అంతకన్న ఏం చెయ్యగలరు!

జ్వరం వచ్చిన నాల్గవ రోజున చనియుడి గొంతు కఫంతో బిగుసుకుంది. ఊపిరాడ్డం కష్టంగా ఉంది. నోట మాట రావటం

లేదు. బెళ్లి, చిన్నడిని ఇంటికి తీసుకురావడానికి తమ్ముళ్లని పంపింది.

చిన్నడు ఉదయమే సారా అంగడికి వెళ్ళిపోయాడు. కాళ, పీలలు అక్కడక్కూడా వెళ్ళి అతడిని రమ్మని గోలపెట్టారు. 'ఇవ్వాళ ఏమీ చెయ్యొద్దు వారం బాగోలేదు రేపు ఉదయం వస్తాను ఒక్క బళి * తీద్దాం అన్నాడు. దానికిగాను ఒక అరటిగెల ఒక గుమ్మడికాయ సిద్ధంగా ఉంచమని చెప్పాడు వాళ్ళిద్దరూ నిరాశతో ఇంటికి తిరిగి వచ్చేసరికి బెళ్ళి అన్న శవాన్ని కౌగలించుకుని వెక్కి వెక్కి ఏడుస్తోంది. పీల, కాళలు అక్కతోబాటు ఏడవసాగారు. కొడుకు కళ్ళుమూసిన మరో గడియకు దురదృష్టవంతుడు-చోముడు ఇంటికి తిరిగి వచ్చాడు అతడు కొక్కడం చేరుకునేసరికి మేరి గురుకుల పెళ్ళితంతు పూర్తయిపోయింది. అన్నీ సిద్ధంచేసుకునే గురువడు పారిపోయాడని తెలుసుకున్నాడు చోముడు. దీనితో బరువెక్కిన చోముడిగుండె ఇంటిలోని ఈ భయంకర దృశ్యాన్ని చూడగానే బ్రద్దలయింది బెళ్ళి ఏడుస్తూసంగతంతా వివరించింది పంజుర్లి శక్తికి తమమీద ఆగ్రహం కలిగిందని చోముడు గ్రహించాడు. వాడికి మతి భ్రమించినట్లయింది కళ తప్పిన కొడుకుమొహం చూస్తూ చేతులు కట్టుకుని కూర్చున్నాడు. అతడి చూపులు ఎదురుగా గోడమీద వ్రేలాడుతున్న తన డప్పుమీదికి మళ్ళాయి. ఒక్కగంతులో దాన్ని అందుకున్నాడు. మ్రోగించసాగాడు.

శవంముందు కూడా సంగీతమా! బెళ్ళి కోపంతో ఊగిపోయింది. ఆవేశంతో తండ్రిమీద విరుచుకుపడింది. 'నీడప్పు పాడుగానూ నీకో వేళా పాళా లేదూ? అంటూ గర్జించింది డప్పు బయటకి విసిరిపారేసింది అప్పుడు తన తండ్రి మానుషావస్థలో లేదని పాపం బెళ్ళికేం తెలుసు? సరె అంతా అయింది ఇహనేమిటి చెయ్యడం? అంది. చోముడు వికటంగా నవ్వుతూ 'పూర్తవడమేమిటి

---

* బళి - దిగతుడుపు

ఇప్పుడే ఇంకా ప్రారంభం. పూర్తవడానికింకా నేనులేనా? నువ్వులేవా? అన్నాడు అటు సీల, కాళ ఏడుస్తూనే ఉన్నారు. బాడు నేలమీద పడుకుని ఉంది దాని కంటిలోనూ నీళ్ళచుక్కలున్నాయి పాకలో కట్టేసిన ఎడ్లని పలుకరించి రోజుకుపై నేలయింది ఇక ఆ సాయంత్రం ఎవరూ ఎవరినీ ఓదార్చేస్థితిలో లేరు.

తరువాత చోముడు చుట్టుప్రక్కల ఉన్న తన వాళ్ళిళ్ళకు వెళ్ళి వాళ్ళను తీసుకొచ్చాడు చనియుడిని మట్టిచేసేసే విధి సాయంత్రం లోపల పూర్తయింది. వచ్చినవాళ్ళు అతని దౌర్భాగ్యాన్ని గురించి విచారిస్తూ తమ తమ ఇళ్ళకు మళ్ళారు. చోముడు ఇంటి ముందు చెట్టుదిమ్మమీద తలపట్టుకు కూర్చున్నాడు. అతనిమొహంలో జీవకళేలేదు కళ్లుదేన్ని చూస్తున్నాయో వాటికే తెలియదు. కూర్చున్నవాడు లేచి,గబగబ అడుగులు వేసుకుంటూ వెళ్ళిపోయాడు. చీకటి పడింది. బెళ్ళి, ఆమె తమ్ముళ్ళు ఏడ్చిఏడ్చి అలసిపోయి, పడినిద్రపోయారు. పడుకున్న బెళ్ళికి సగం నిద్రలో మెలకువ వచ్చింది. ఎడ్ల సంగతి గుర్తొచ్చి, లేచివెళ్ళి, వాటిముందుగడ్డిపడేసి, వచ్చిపడుకుంది. నాలుగురోజులుగా నిద్రలేకపోవడంతో పడుకోగానే నిద్రపట్టేసింది.

అర్థరాత్రి చెవి దగ్గరలోనే డప్పు చప్పుడు వినిపించడంతో మళ్ళీ మేలుకుంది బెళ్ళి, ఇహ చూసేదేముంది? చోముడి డప్పు మళ్ళీ మ్రోగుతోంది. కొడుకు ఆఖరి సారిగా శ్వాస వదిలిన నేల మీదనే కూర్చుని డప్పు వాయిస్తున్నాడు. అబ్బ! ఎంతటి క్రూరమైన 'డమ్మడమ్మ డక్కడక్క' నాదం దానిది! నోట్లోంచి పాట కూడా వస్తోంది. కంఠాన్ని బట్టి అతను బాగా తాగి వచ్చాడనుకుంది బెళ్ళి.

ఆతని డప్పు చప్పుడికి తమ ఇంటో పడుకున్న సంకప్పయ్య గారికి కూడా మెలకువ వచ్చింది. చనియుడి చావు సంగతి అంతకు

ముందే విన్నారాయన. ఇప్పుడీ దప్పు చప్పుడు. ఆయన ఆశ్చర్యా
నికి అంతులేదు. "అబ్బ! రాక్షసుడే వీడు! ఆ దప్పుకి వేళాపాళా
లేదు. కొడుకు చచ్చినరోజుకూడా కల్లు పట్టించాలా! బహుశా:
ఏకలదాకా కల్లు పట్టించేసుంటాడు." అన్నారు. నిజమే, అవ్వాళ
చోముడు బాగానే తాగివచ్చాడు. అతని బాధకు ఉపశమనం
కలిగించేది మరొకటి ఏముంది గనుక.

11

నియుడు చనిపోయి వారం రోజులయింది. చోముడి మనస్థితి
ఎలా ఉందో చెప్పటం కష్టమే. ఒకరకంగా అతడి మనసు
షాణ మనుకోవచ్చు. రోజూ ఏదో ఒక ఆపద తప్పదన్నప్పుడు
దాని గురించీ ఎక్కువ పట్టించుకోవడం జరగదు. రోజూ నల్ల
ందు తినే వాళ్లకి కాస్త నల్లమందుతో మత్తురాదు. దుఃఖం కూడా
ంతే. ఏదో రకమైన బాధల్లో మునిగి తేలుతున్నవారికి, ఆఖరికి
ంట్లో చావు సంభవించినా విశేషమనిపించుకోదు. ఇదీ చోముడి
నస్థితి.

బెళ్లి పరిస్థితి దీనికి పూర్తిగా వ్యతిరేకంగా ఉంది. సంసారం
ని వేర్పాటుని, ఒడిదుడుకుల్ని, అంత సులువుగా తీసుకోవడానికి
మెకున్న అనుభవం ఎంతగనుక! ఒక అన్న ఎడబాటు, ఇంకో
న్న మరణం. గోరు చుట్టుమీద రోకటి పోటులా, మానని
యమై ఆమెను క్రుంగ దీస్తోంది. కాని నోరు విప్పి ఎవరితోనూ
ప్పుకోదు. ఎవరితో చెప్పుకోవాలి? తమ్ముళ్లింకా చిన్నవాళ్ళు.

అన్నపోయిన తరువాత రెండ్రోజులు ఏడ్చిగోల పెట్టారు. మూడవ రోజునుంచీ మామూలుగా ఆటల్లో పడిపోయారు.

తండ్రితో మాట్లాడితే, ఇహనేముంది? నీదంతా భ్రమ, ఇలాంటి వాటికేడుస్తారా? వాళ్ళిద్దరూ పోతే ఏమిటట?! నీల, కాళ లేరూ? నువ్వు లేవూ? లేదంటే ఎప్పుడో ఒకరోజు అందరూ పోవలసిన వారే కదా! నేనూ పోతాను. ఆఖరిదాకా ఎవరుంటారులే'' అంటాడు. చెప్పడానికిది సులభమైన వేదాంతమే. మననం చేసుకోడానికి. జీర్ణించుకోడానికి మహా కఠినం. చోముడికేమో అది సుళువుగానే కనిపిస్తోంది. ఎప్పుడైనా ఒక్కోసారి మనసు మరీ విహ్వలమైనపుడు, ప్రపంచాన్నే మరపించే దప్పు. పుష్కలంగా సారా ఉంటే, వెయ్యి చావులనైనా ఆవగింజంత తేలిగ్గా తీసుకోగలడు చోముడు.

ఇప్పుడిహ రెండవ వర్షాకాలం రానే వచ్చింది. సంకప్పయ్యగారు చోముడికి కబురు పెట్టారు. చోముడు తిన్నగా వెళ్ళి, ''ఏంటయ్యా?'' అన్నాడు. ఆయన ''రేపు పొలం పనికి వచ్చెయ్'' అన్నారు. చోముడు చిరునవ్వు నవ్వాడు. సరె, ఇంటికి వచ్చి దప్పు మ్రోగించడం మొదలుపెట్టాడు. చీకటి పడింది. అందరూ తలా కాస్త గంజి నీళ్ళు తాగారు. గంజిని మించిన మృష్టాన్నాన్ని వాళ్ళ నోచుకోలేదు. గట్టిగా లేదనటానికీ లేదు. ఉంది, యజమాని ఇంట్లో ఏదయినా సమారాధనల్లాంటివి ఉంటే, బయట పారవేసే ఎంగిలి మెతుకులున్నాయి. కాని అది అపురూపం. అరుదుగా, అపురూపంగా తినే మాగేసిన మామిడి పండు లాంటిది. కావాలనుకున్నపుడు దొరికేది కాదు....సరె, చోముడి మనసుకి ఒక్కటే కూర్చుని దప్పువాయించుకోడం నచ్చడం లేదివ్వాళ. బెళ్ళిని పిలి ''తే లే'' మొదలెట్టమన్నాడు. ఆమెకు పాటా వద్దు, ఆటా వద్దు

అనిపిస్తోంది. కాని, తన వ్యథ కన్న. ముసలి తండ్రిని ఓదార్చటం తన కర్తవ్యంగా భావించింది.

బయట వెన్నెల కురుస్తోంది. ఖర్చులేనిదీపం బీదల పాలిట పెట్టని దీపం చోముడు కూతుర్ని "రా. చీకట్లో ఇక్కడెందుకు? బయటకి వెడదాం." అన్నాడు. బెళ్ళి బయటకి వచ్చింది. వెన్నెల వెలుగులో ఆమెపాట ప్రారంభం అయింది. ఇంటి ముందున్న మామిడి చెట్టు ఆకులు సందుల్లోంచి చంద్రుడు ఆ తండ్రీకూతుళ్ళ ఒయ్యారాన్ని (1) తొంగి తొంగి చూస్తున్నాడు. చోముడికింకా ఉత్సాహం ఉరకలు వెయ్యటంలా. తన వాయిద్యం తనకే తృప్తిగా లేదు. రెండు మూడు మార్లు "ఏమిటో ఇవాళ సరిగ రావడంలేదు. అన్నాడు అసంతృప్తిగా. అంతే చాలునని బెళ్ళి "అయితే వెడలి నిద్రపోకూడదూ! అంది. "ఊహూఁ వద్దు. తమ్ముళ్ళను లేపేయ్" అన్నాడు.

బెళ్ళి లోపలికి వెళ్ళివచ్చింది. నీల కాళ అప్పుడే సగం నిద్రలో న్నారు. "పడుకున్నారయ్యా" అంది. "పడుకుంటేనేం? లేవ డదూ అన్నాడు" చోముడు. తండ్రి ప్రవర్తన కొంత వింతగా చింది బెళ్ళికి. ఇవ్వాళేదో క్రొత్తబాధ కలిగిందని అనుమానం చ్చింది. అతడి దగ్గరగా వెళ్ళి నుంచుంది నోట్లోంచి సారా వాసన డా రావడంలేదు. కూతురు అలా నుంచోడం చూసి. "చెప్పింది నబడ్డంలా?" అన్నాడు బెళ్ళి లోపలికి వెళ్ళి తమ్ముళ్ళను లేపింది- ళ్ళకి నిద్రపట్టేసింది. బలవంతంగా లేపి కళ్ళకి కాస్త నీరు జల్లి "రండి అయ్యకు కోపం వస్తుంది." అంది. అయ్యపేరు చెప్పగానే ల్లలు సగం భయంతో కళ్లు తెరిచారు. అందరూ బయటకి చ్చారు. చోముడు డప్పు సర్దుకుని "పాడు బెళ్ళి" అన్నాడు. ళ్ళి పాడసాగింది. పిల్లల్ని ఆడమన్నాడు, వాళ్లు జోగుతూనే డుగులు వెయ్యసాగారు చోముడి డప్పు తీవ్రగతి మ్రోగసాగింది దానికి సరిగ్గా అడుగులు పడటం లేదు. కోపంతో పళ్లుకొరుకుతూ

"మీ కాళ్లకేమయినా రోగమొచ్చిందా? అని అరిచాడు. పిల్లలు
బెదురుతూ బెదురుతూ అడుగులేస్తున్నారు. చోముడికి బొత్తిగ
నచ్చలేదు. లేచి పిల్లల్ని పట్టుకుని నాల్గు బాదాడు. బెళ్ళి అడ్డుపడక
పోతే వాళ్ల పనేమయ్యేదోగాని ఆమె అడ్డుపడింది "వెళ్ళి పడుకోండ్రా" అంది. వాళ్ళిద్దరూ ఒక్క ఉదుటున పారిపోయేరు. చోముడు
రౌద్రావతారం దాల్చాడు.

"వెళ్ళారో, వాళ్ల ప్రాణం తీస్తా నివాళ, ఆడనీ,
వాళ్లకి ఆట్టం ఎలా రాదో చూస్తా నివాళ," అన్నాడు. కుర్రా
ళ్ళిద్దరూ మళ్ళీ వచ్చి వణుకుతూ నుంచున్నారు. పరిస్థితి కఠినం
గానే ఉందని బెళ్ళికి భయమేసింది. "నిద్రమత్తులో ఏం ఆడతారు
వాళ్ళు! ఉట్టినే వాళ్ల ప్రాణం తీస్తావేం? దేవుడు మిగిల్చిన
ఇద్దరు పిల్లల్ని కాస్త ప్రేమగా చూచుకోకూడదూ!" అంది

"దేవుడు! పిల్లలు! ఎవరి పిల్లలు? దేవుడి పిల్లలా? నా
పిల్లలయితే ఆడనీ! దేవుడి పిల్లలయితే తొందరగా చావనీ."
అన్నాడు చోముడు. దానితో కూడా అతడి ఆవేశం తగ్గలేదు.
వెళ్లి ఆ పసివాళ్ల జుట్టు పట్టుకుని లాగాడు. వాళ్లు కింద పడ్డారు.
"మీరు ఆడకపోతే, మీ ఒంటి మీద ఆడతాను నేను" అంటూ
గంతు లెయ్యసాగాడు. బెళ్ళికి వళ్లు మండి పోయింది. తండ్రిని
పక్కకులాగి పట్టుకుని, "మీరు లోపలికి పొండర్రా. ఇక్కడుంటే
మీ ప్రాణాలు దక్కేలా లేవు." అంది. "అయ్యా! నీకు ఆడాలని
ఉంటే, నా వీపుమీద ఆడు. కాని తాగివచ్చి ఆ పసిపిల్లల మీద
నీ ప్రతాపం చూపించకు." అని గద్దించింది. ఆమె మాట తీవ్రత,
కళ్ళల్లోని ఎరుపు, గద్దింపు చోముడి హృదయానికి భీతిగొలిపింది.

అతని ఉగ్రరూపం శాంతించింది. బెళ్ళి అతడు తాగి రావటం
నిజమే ననుకుంది. రేపు బిరుమడి కొట్టుకు వెళ్ళి, "మా అయ్యకు
మతి పొయ్యేటంత కల్లు అమ్మావంటే, నీ పాక కాల్చిపారేస్తాన"ని

చెప్పి రావాలని నిశ్చయించుకుంది. తండ్రి మీద జుగుప్సతో గుడిసెలోకి వెళ్ళి తలుపు మూసుకుని పడుకుంది.

చోముడు మామిడి చెట్టుకింద కూర్చున్నాడు. దప్పు ఓ పక్కన పడి ఉంది. లోపలి కోపం పోయి. దాని స్థానంలో ఆలోచన చోటు చేసుకుంది. ఇప్పుడతన్ని వేధిస్తున్న సమస్య ఒక్కటే. "ఇంకా నా ఎడ్లని తీసుకెళ్ళి. యజమాని పొలం దున్నాలా?" అన్నదే. తాను వ్యవసాయ దారుణ్ణవాలన్న ఆశ మాత్రం ఇంకా అతడి మనసులోంచి పోలేదు. అన్నిటిని మరువ గలుగుతున్న చోముడు ఇదొక్క విషయంలో మాత్రం సరిపెట్టు కోలేక పోతున్నాడు.

"నాకు లేకపోయినపుడు మరొకరి కెందుకివ్వాలి?" అని తన ఎడ్ల పరంగా ఆలోచిస్తున్నాడు. తనలో తను గొణుక్కుంటూ ఎడ్ల పాక వేపు వెళ్ళాడు. అక్కడ ఎడ్లతో చాలాసేపటివరకు సంభాషించాడు. అదెప్పటికి పూర్తయిందో ఏమిటోగాని, ఉదయం బెళ్లి లేచేసరికి చోముడు మామిడి చెట్టుకింద పడుకుని గురకపెట్టి నిద్ర పోతున్నాడు. బెళ్లి అతడిని లేపలేదు. ఎడ్లని మేతకి వదలడాని కోసం పాకవేపు వెళ్ళింది వాటి మెడనుండి తాళ్లను తప్పించి చూస్తే ఇహనేముంది! రెండు ఎడ్లకూ మోకాళ్ల దగ్గర దెబ్బలు తగిలి, కుంటుతూ ఉన్నాయి. ఒకదాని కాలి దగ్గర రక్తం కూడా వస్తోంది. ఆమెకేమీ అర్థం కాలేదు. బయటకి వచ్చిచూస్తే చోముడి పక్కలో ఓ దుడ్డుకర్ర పడివుంది.

బెళ్ళికి క్షణంలో జరిగిందేమిటో అర్థమై పోయింది. యజమాని దున్నడానికి రమ్మనడం, అతని అంతరంగంలోని కోరికకు అడ్డురావడంతో అసూయ పుట్టుకొచ్చి చేసిన పని ఇది! ఆత్రంగా వెళ్ళి, చోముడిని నిద్రలేపి "అయ్యో. ఏం చేశావు ఎడ్లని?" అంది.

చోముడు కళ్ళు నులుపుకుంటూ లేచి, "ఏం చేశానేమిటి? నాకు లేనిది ఇంకొకరికి దొరక్కుండా చేశానంతే." అన్నాడు. వెళ్ళికి భీతి కలిగింది. తామిక సంకప్పయ్యగారి కోపానికి గురికాక తప్పదని తెలిసి వణికిపోయింది. అనుకున్నట్టుగానే చోముడికోసం వెతుక్కుంటూ సంకప్పయ్యగారు పంపిన మనిషి వచ్చాడు "నిన్న మేతకి వెళ్ళిన ఎడ్లు ఎవరి మడిలోకి వెళ్ళాయో, ఏమో, కాళ్ళు విరగ్గొట్టించుకుని వచ్చాయి" అన్నాడు. తను ఇంట్లో ఉండిపోవడానికి భయపడి, వెళ్ళి, సంకప్పయ్యగారి ముందూ అదే అబద్ధాన్ని చెప్పాడు. సంకప్పయ్యగారు దాన్ని పూర్తిగా నమ్మలేదు "మరి ఇవ్వాళేం చేస్తావు?" అన్నారు. "వేరే ఏదయినా పని ఉంటే చేయొచ్చు" అన్నాడు చోముడు. వేరే పని చూపించగానే సంతోషంగా ఆ పనికి వెళ్ళిపోయాడు. తరువాత ఎడ్లు కుంటుతూ ఉండటాన్ని చూశారాయన. చోముడిమాట నిజమనే నమ్మారు. వాడికోసం జాలిపడ్డారు కూడా. కాని ఈమధ్య చోముడు ఏ పనీ సమంగా చేయటం లేదని అసమాధానం కలిగింది.

ఓరోజు చోముడితో తోటకు వెళ్ళి, కొబ్బరికాయలు దింపుకు రమ్మన్నారు. మధ్యాహ్నం దాకా పొద్దుపుచ్చి, ఓ పదికాయలు పట్టుకొచ్చాడు. ఆయనకు పట్టరాని కోపం వచ్చింది. "ఏమిటి? నువ్వూ ఉదయం కూడా సారాకొట్టుకి వెడుతున్నావా?" అని గద్దించారు. ఇంతవరకు బదులు చెప్పి ఎరుగని చోముడు, 'అవును మీరు చేతి నిండా ఇస్తున్న కూలికి ఉదయమేమిటి? సాయంత్రమేమిటి? ఎప్పుడైనా వెళ్ళొచ్చు సారాకొట్టుకి' అన్నాడు. సంకప్పయ్యగారికి, చోముడు ఆదినుండి తమ ఇంటి నౌకరు. నమ్మకస్థుడు అన్న అభిమానమంతా చోముడన్న ఒక్క మాటతో తుడిచిపెట్టుకుపోయింది. "నువ్విహ మా ఇంటి ఛాయలకి రాకు. అని ఆజ్ఞాపించారు. చోముడికి నవ్వు వచ్చింది. ఆయన అతడు నవ్వుకోడాన్ని చూడనూ చూశారు. అగ్నిలో ఆజ్యం పోసినట్లయింది. చోముడు ఇంటికి వెళ్ళిపోయాడు.

చోముడు చేసిన ఘనకార్యం ఊళ్ళో అందరికీ తెలిసింది. అలాగే బెళ్ళి చెవినకూడా పడింది. బెళ్ళి గాబరాపడిపోయింది. తండ్రి మూర్ఖత్వాన్ని మనసారా తిట్టిపోసింది. అయినా అతదేమీ పట్టించుకోలేదు. యజమానితో విరోధం పెట్టుకుంటే ఇహనిక ఊళ్ళో బ్రతకడం కల్ల అనుకుంది. భయంతో సంకప్పయ్యగారింటికి వెళ్ళి ముంగిట్లో రోధించసాగింది. తమ్ముళ్ళను యజమాని ఎదుట సాష్టాంగ పడేసింది' "అయ్యా. మాతప్పొప్పులు ఏమన్నా మీరు కరుణించాలి. అయ్యకు ముదివయసు. ఏదన్నా తప్పుగా మాట్లాడి ఉంటే మన్నించాలి. కొడుకులిద్దరూ అలా అయిపోయాక అతడి బుద్ధి స్థిమితంగా ఉండటంలేదు. నిజంగా పిచ్చే పట్టింది అయ్యకు " అంది మళ్ళీ మళ్ళీ వేడుకుంది. బెళ్ళి అంతగా చెప్పాక ఆయన మనసు మెత్తబడింది. పెద్దకొడుకు చావుతో అతడి బుద్ధి భ్రమించింది. అని నమ్మారాయన. " సరే. వాడ్ని వస్తూ పోతూ ఉండనీ. పనీ— పాటా ఏమీ చెయ్య లేడింక. అతని బుర్ర సరిగ్గా ఉండటంలేదు. నువ్వు రోజూవచ్చి అతని భత్యం తీసికెళ్ళు " అన్నారు.

బెళ్ళి యజమాని దేవుడి ప్రత్యక్షరూపమనే నమ్మింది. ఇంటికి పరుగుపరుగున వెళ్ళింది. త్రోవలో తమ్ముళ్ళతో, "ఏదో పుణ్యం చేసుకున్నాం గనుకనే ఇలాంటి మంచివాళ్ళ నీడలో పడి ఉన్నాం అని మాటిమాటికీ చెప్పింది. ఇంటికి వెళ్ళి జరిగిన సంగతంతా తండ్రి చెప్పింది. అతడంతా విన్నాడు ఉదాసీనంగా. అతడి వాలకం చూస్తే బెళ్ళికి మరింత భయం వేసింది. అతడు పన్లోకి వెళ్ళటంకన్న. వెళ్ళకుండా ఉంటమే మంచిదనిపించింది. వీలైతే సంకప్పయ్య గారింట్లో తండ్రి స్థానంలో తనుండి పని నిర్వహించాలనుకుంది. నేలు, ఇంట్లో ఉండడం. తను కాళ యజమానిగారింటి పనిలో ఉండిపోవడం అని నిర్ధారణమయింది. చోముదెవరి జోలికీ వెళ్ళకుండా, తనంతట తాను డప్పు మ్రోగించుకుంటూ ఉంటే అదే ఓ ఉపకారంగా భావించింది.

12

బెళ్ళి మనసులో ఇలా క్రొత్త నిర్ణయాలు చేసుకుని పడుకుంది.

కాని, అవంతా నీటిలో చేసిన హోమంలా అవుతుందని కలగన లేదు. తెల్లవారు తుండగానే ఇంటిముందు మన్వేలుడి పిలుపు విన బడింది. చోముడికి మెలకువ వచ్చింది. మన్వేలుడు కనిపించాడు. తోట గుర్తొచ్చింది. తరువాత మరణించిన చనియుడు గుర్తొచ్చాడు. ఆ తరువాత బ్రతికుండే తమకు లేకుండా పోయిన గురువడు గుర్తొచ్చాడు. తన సంసారం ఇలా నాశనమయిపోడానికి ఇతడే కారణమనిపించి అతనితో మాట్లాడకుండానే లోపలికి వెళ్ళిపోయాడు. మన్వేలుడు చోముడు బయట కొస్తాడని ఎదురు చూస్తున్నాడు. ఎంత సేపటికీ రాకపోయేసరికి. 'చోమా!' అని అరిచాడు. అతడి అరుపు బెళ్ళికి వినిపించింది. ఎవరా అనుకుంటూండగా "బయటకి రాడేం?" అనడిగాడు.

"అయ్యకు బుద్ధి స్థిమితంగా లేదు."

"ఎప్పటినుండి?"

"అవన్నీ మీతో చెప్పుకుని ప్రయోజనమేమిటి? దేవుడితో చెప్పుకోవాలంతే."

"సరె దేవుడి దగ్గరే చెప్పుకుందువుగాని. ఇప్పుడు నేనెందు కొచ్చానో తెలుసా?"

"లేదు."

"మీ అయ్య అప్పు ఒక్కపైసాకూడా తీరలేదు. కొడుకు లిద్దరూ తోటకు వచ్చి త్రాగటంతోటే సరిపెట్టారు. ఇరవై రూపాయల బాకీ ఇరవైఅయిదు రూపాయలయ్యాయి. ఏం చేస్తావు మరి?"

"ఏం చేస్తాం? దబ్బు ఇవ్వగలిగే స్థోమత మాకు లేదు. అన్నల పరిస్థితి అలా అయింది. అయ్యచూస్తే ఇలా ఉన్నాడు. మీకు దేవుడు ఎలా బుద్ధి పుట్టిస్తే అలా చెయ్యండి."

"అంటే? ఏమయింది మీ అన్నలకి? ఒకడు కొక్కడంలో కనిపించాడు. అక్కడే ఈ సంవత్సరం సాగు చేసుకుంటాడట. పెళ్ళి అయింది. మీరు వెళ్ళలేమూ?"

"జాతి భ్రష్టుల ఇంటికి మేమెందుకు వెడతాం?"

మన్వేలుడికి గుచ్చుకున్నట్టయింది. తన మతానికి చెందిన వారిని 'జాతిభ్రష్టు' లన్నందుకు.

"అది సరే. ఈసారి మీలో ఎవరు వస్తారు తోట పనికి? ఇద్దరో, ముగ్గురో రాకపోతే. మీ అప్పు తీరేలా లేదు. మీ కోసమే చెబుతున్నాను. డబ్బు బాకీ అలాగే ఉంచితే ఇక కోర్టు-కచేరీ అని చాలా గొడవ వుంటుంది మరి...."

"అవనీండి. ఎవరేం చెయ్యగలరు?"

"అంటే మీకు అప్పు తీర్చాలని లేదా? ఊరికే నీతో మాట్లాడి లాభమేమిటి గాని. చోముడిని బయటకి రమ్మను."

"అయ్య పడుకున్నాడు."

"నన్ను చూడగానే జ్వరమొచ్చిందా? సరె, మీ అన్న చనియుడిని పంపు."

బెళ్ళి కాసేపు మాట్లాడలేదు. తరువాత తల వంచుకుని. "చనియుడిని పంపటం అయింది" అంది. మన్వేలుడికి అర్థం కాలేదు. "ఏమిటలా చూస్తున్నావు? నువ్వూరికే బొమ్మలా నుంచుంటే పని జరగదు. నాకేదయినా బదులు చెప్పాలి మరి!"

"ఎందుకు మా కడుపు మండిస్తారయ్యా?"

"ఏమిటి? 'అన్నను పంపు' అంటే నీ కడుపు మండిస్తున్నానా?"

"అన్న కావాలా మీకు? అయితే అదుగో, ఆ చెట్టు కింద పడుకున్నాడు. తవ్వి తీసుకెళ్ళండి" అని లోపలి కెళ్ళిపోయింది.

ఇప్పటికి మన్వేలఉడి మట్టి బుర్రకి సంగతి సందర్భాలు అర్థమయ్యాయి. ఈ సమయంలో తాను వాళ్ళని పలుకరించటం భావ్యం కాదనిపించింది. కాని చెప్పకుండా వెళ్ళిపోవడం నచ్చక, అక్కడి నుండే గట్టిగా, "నేను శుక్రవారం వస్తాను. ఎవరైనా ఇద్దరు నాతో రావడానికి సిద్ధంగా ఉండండి. నువ్వే ఎందుకు రాకూడదు? ఇక్కడుండి ఏం చేస్తావు?" అని కేకేసి చెప్పి వెళ్ళి పోయాడు.

"నువ్వే ఎందుకు రాకూడదు?" అన్న మాట బెళ్ళి మనసులో నాటుకుంది. తోట ఋణం ఉంచుకుని మనం సుఖపడటం కల్ల. ఆ ఋణం తీర్చక తప్పదు. ఇక వేరే దారి లేకపోతే నేనే వెళ్ళి ఋణం తీర్చి వస్తామ అనుకుంది బెళ్ళి. ఆ తరువాత తండ్రితో మాట్లాడింది.

"అయ్యా, మన్వేల మేస్త్రీగారు చెప్పిన దంతా విన్నావా? రేపు శుక్రవారం వస్తారట. ఇద్దరైనా వెళ్ళాలట...."

"రానీయ్.... ...."

"రానీయ్ అంటే? ఆయనకేం బదులు చెప్పాలి? అప్పు పైసాకూడా తీరలేదు మరి...."

"అవు నవును. పెద్దవాడు సంపాదించిన దంతా త్రాగేశాడు. గురువడు సంపాదించినదంతా ఆ పిల్లకిచ్చుంటాడు. వాడోసారి కనిపిస్తే చేతులు, కాళ్ళు విరిచెయ్యాలనుంది."

"అదంతా పాత సంగతి. ఈ సారి వాడూ తోటకి వెళ్ళడట. మడిసాగ చేసుకుంటాడట."

"వ్యవసాయమా? ఎవరు?? మన గురువడా??? జాతి పోయినా స్వర్గం దొరికిందే!"

"ఆ మాట వదిలెయ్. ఇక వాడి వల్లకూడా నీ అప్పుతీరదు. ఎలా తీరుద్దాం మరి? చెబితే నీకు కోపంవస్తుంది. మూర్ఖపు పట్టు

పడతావుగాని. ఒకటి. మనలోనే ఎవరైనా తోటకు వెళ్ళాలి. లేదంటే అప్పు తీర్చెయ్యాలి. తోట అప్పు ఉంచుకుంటే దేవుడు మనకి మంచి చేయడు."

"దానికేం చావమంటావు నన్ను?"

"చావూ వద్దు. పాడూ వద్దు. మనకెలాగూ మడిదున్నుకునే యోగం లేదు. ఉట్టినే ఎడ్లను ఉంచుకుని ఏం చేస్తాం?"

"ఏం చేస్తామా? గవర్నమెంటు జాగా. పట్టా పుచ్చుకుని. అందులో సాగు చేసుకుంటాం. దిబ్బ అయినా సరే. నాదంటూ ఎంతో కొంత నేల దున్నాలి నేను."

'దున్నమంటే. ఉట్టినే సరదాకా ఏమిటి? అయితే ఇంటి ముందున్న నేలని దున్నచ్చుగా. ఒక నాలుగు శేర్లు వడ్లు దొరుకుతాయి. బిచ్చమెత్తడం తప్పుతుంది. అని ఆలోచించక దిబ్బ తవ్వుతాను అడివినరుకుతాను అంటే లాభమేమిటి? ఈ ఆలోచన వదిలేయ్ మన పూర్వీకులంతా సంకప్పయ్యగారి ఉప్పు తిని బ్రతికిన వారే. మనం ఆ ఉప్పు ఋణం తీర్చలేం. మొన్న నువ్వంతగా మాట్లాడి వచ్చాక కూడా.' వాడు పని చెయ్యనీ. చెయ్యక పోనీ, రోజూ వచ్చి వాడి 'పడి' తీసికెళ్ళు' అన్నారు అయ్యగారు. అలా ఎవరు చూస్తారు? బంగారం లాంటి యజమానిని వదిలితే దేవుడు మనకి మంచి చెయ్యడు."

"ఏం చెబుతావో చెప్పు. నాకేం తోచటం లేదు."

"ఇంకేం చెబుతాను నేను? ఆ రెండు ఎడ్లనీ కాళ్ళనొప్పి వయం కాగానే సంకప్పయ్యగారికి అమ్మేద్దాం. ఈ స్థితిలో నువ్వు వాటిని ప్రాణాలతో ఉంచటమూ అనుమానమే. ఏదో ఒకరాత్రి 'నాకులేని ఎడ్లు ఇంకొకరి కెందుకు?' అని నరికేసినా నరికేస్తావు. ఎడ్లుపోయినా, పదిహేను రోజులకు సరిపడ మాంసం దొరికిందని సంతోషిస్తావు."

13

ఎన్నో రోజులుగా బెళ్ళి ముందాలోచనతో పూర్తి భత్యాన్ని ఇంటికి తేకుండా సగం మాత్రమే తెస్తోంది. ఇంకా ముందు వర్షాకాలం ఉంది. కోతలరోజులు వచ్చేవరకు రోజులు గడవడం కష్టంగనుక అలాంటి రోజుల కోసం బియ్యాన్ని యజమాని ఇంట్లోనే ఉంచేసింది. ఇప్పుడు అపురూపంగా వచ్చారీ చుట్టాలు. వ్యవసాయపు పనులేమీ లేవిప్పుడు. ఇలా చుట్టాలిళ్ళకు తిరుగుతూ ఉంటారు. ఇంకా రెండునెలల దాకా నోరువిప్పి. "ఇక ఇంట్లో గింజలేమీ లేవనే దాకా వెళ్ళకపోడం ఆ చుట్టాల స్వభావం సరె. అవ్వాళ్టికి సరిపోయే బియ్యాన్ని యజమాని ఇంటి నుండి తెచ్చుకుంది. ఇంట్లో చుట్టాలు కాచుక్కూర్చున్నారు, అయ్య ఇంకా రాలేదు. బెళ్ళి రాగానే వాళ్ళకి మర్యాదలు చేసింది, లోపలికి వెళ్ళి చూస్తే పొయ్యిమీద ఏమీలేదు. అప్పుడామెకు గుర్తొచ్చింది. ఇంటిలో బియ్యమేమీ లేదని తొందర తొందరగా గంజి కాచింది. ఇంటికి వచ్చిన వారికి ఉత్త 'గంజి' వడ్డించటమా! నంజుకోడానికి ఉప్పురాయి కూడా లేదు ఇండిలో మరోసారి సంకప్పయ్యగారింటికివెళ్ళి వెనకాల తలుపు దగ్గర కాచుకుని. అమ్మగారితో తనకథంతా చెప్పి. కాస్త ఉప్పు, కాసిని మిరపకాయలు తెచ్చుకుంది.

మధ్యాహ్నపు వేళకు చోముడు వచ్చాడు. చుట్టాలని చూడగానే, మొదట అతడి మోహం చిన్నబోయినా, వెంటనే తేరుకుని వాళ్ళతో కలసిపోయాడు. అందరివీ భోజనాలయ్యాయి. నలుగురు చేరిన చోట కబుర్లకేం తక్కువ? సాయంత్రం దాకా కబుర్లు

అయ్యాయి. ఇక వచ్చినచుట్టాలను ఒక్కసారన్నా బిరుమడి కొట్టుకి తీసికెళ్ళకపోతే ఎలా? అతని చేతిలో పైసాలేదు. కాని ధైర్యానికేం తక్కువ? అందర్నీ తీసికెళ్ళాడు. నీల. కాళలనీ తీసికెళ్ళాడు. చస్తే వాళ్ళు తాగి చావనీ అనుకున్నాడు. అందరూ తాగాక. బిరుమడు చోముడితో 'మొత్తం ఎనిమిదణాలు అయింది. ఎవరిస్తారు? అన్నాడు. తాగిన మైకంలో ఉన్నవారికి ఎనిమిదణాలో లెక్కా? చోముడు. " నేనే ఇస్తాను. ఇవాళ కాకపోతే రేపు. అత్తరు చాపగాని బుట్ట గాని తెచ్చి పడేస్తే సరి కదా! " అన్నాడు. బిరుమ పూజారి మొహం నల్లబడింది. ఎనిమిదణాల అప్పుని చోముడు ఒక్కసారిగా తీర్చగలడా అని! అందులో కొంత సమాధానమేమిటంటే నీళ్ళవంతు డబ్బు రాకపోయినా. సారావంతు అయినా రాకపోతుందా అని.

రాత్రి భోజనాలయ్యాయి. చీకటి ముసురుకుంది. దీపం వెలిగించే పనే లేదుకద. అందరూ ఇంటి ఆవరణలో కూర్చున్నారు. చోముడు దప్పు తీశాడు. మ్రోగించసాగాడు. చుట్టాలు. పిల్లలూ అందరూ ఆడసాగారు. అప్పుడప్పుడు ఆవేశం ఎక్కువై హే హెయ్ అని అరవసాగారు. ఆటలోని ఆనందాన్ని మనసారా చవి చూస్తున్న చోముడికి ఇంక నెలరోజులైనా చుట్టాల్ని ఊరికి పంపకూడదని పించింది. ఇటు బెళ్ళి మనసు మాత్రం రేపటి బియ్యం గురించి ఆలోచిస్తోంది.

రాత్రి ఆకి. అలసి పడుకున్నారు. తెల్లవారింది. బెళ్ళి ఉదయమే తమ్ముళ్ళతో కలసి ఆకు తేవటానికి వెళ్ళింది. ఒకయామం లోపల పని పూర్తి చేసుకుని, సంకప్పయ్య గారింట్లో ఆకు మోపులు పడేసి. ఒక శేరు బియ్యం తెచ్చింది. ఆమె చేసిన పనికి రావలసిన దానికన్న రెండు పావులు బియ్యం ఎక్కువే తెచ్చింది. ఇలా ఎనిమిది రోజులు గడిస్తే. ఇహ వానా కాలమంతా ఉపవాసంతో గడపాల్సిందే అనిపిస్తోందామెకు. కాని ఏం చెయ్యగలదు? అలిథుల్ని

ఆదరించక తప్పదు కదా! ఇంటికి వచ్చి రోజూలాగా గంజి చేసింది. మిరపకాయలు లేవు. మళ్ళీ అడిగి తెచ్చే ధైర్యం లేదు. పోనీ ఉప్పు ఉంది కదా. అదీ లేకపోయినా ఆక్షేపించే చుట్టాలు కారు. ఉన్నది తిని సంతృప్తి పడగలరు. కాని సాయంత్రం మటుకు కల్లు ఉండి తీరాల్సిందే. బెళ్ళి అందరికి భోజనాలు పెట్టింది. తరువాత తమ్ముళ్ళని తీసుకుని అడవి కెళ్ళింది. ఇటు చోముడు నిశ్చింతగా బంధువులతో కబుర్లలో పడ్డాడు. మధ్యాహ్నం వేళకు బెళ్ళి పెద్ద 'బీళలు' మోపు ఒకటి తెచ్చి పడేసింది. చోముడు సంతోషించాడు అదే లేకపోతే బిరుమడికి ఇవ్వటానికేముంది మరి!

వచ్చిన చుట్టాలు కాళ, నీల—అందరూ 'బీళలు' చీల్చి బుట్టలల్లసాగారు. కబుర్లు చెప్పుకుంటూనే, సాయంత్రం లోపల ఆరేడు బుట్టలు సిద్ధమయ్యాయి. చోముడు వాటన్నిటినీ మోసుకుని, అందర్నీ తీసుకుని సారా కొట్టుకు బయల్దేరాడు. బెళ్ళి చప్పున వెళ్ళి అతని దగ్గర్నుండి రెండు బుట్టలు లాక్కుంది. చోముడు ఇవ్వటానికి ఒప్పుకోలేదు. బెళ్ళి "సంకప్పయ్యగారు అడిగారు" అని అబద్ధమాడింది. మిగతా వాటిని తీసుకుని చోముడు సారా అంగడికి బయల్దేరాడు. బిరుమడి దగ్గర నిన్నటి బాకీ అంతా చెల్లుబడి అయి, ఇవాల్టిది బాకీ పడింది. అటు బెళ్ళి యజమానిగారింట్లో బుట్టలిచ్చి నాలుగు సేర్ల వడ్లు తెచ్చింది.

చుట్టాలు వచ్చి నాలుగు రోజులయింది. వాళ్లకు వెళ్ళే ఆలోచనలేదు. వాళ్ల వెళ్ళాలని చోముడికే లేదు, ఇటు బెళ్ళి పూట పూట అమర్చలేక సతమతమవుతోంది. ఇటు తను యజమాని గారింట్లో దాచుకున్న బియ్యం అయిపోయింది. వర్షాకాలంలో బియ్యం లేని రోజుల్లో తినటానికని అడవి దుంపలను నాటింది. చోముడు వాటిని కూడా తెచ్చి బంధువులకి విందు చేశాడు. ఇప్పుడుందేలు వేటకు వెళదామని తయారయ్యారు. దుడ్డుకర్ర. వల

అన్నీ సిద్ధం చేసుకుని చుట్టాలతో కలసి బయల్దేరాడు కూడా. అతడలా వేటకు వెళ్ళి నాలుగైదేళ్ళు అయింది. తన 'ఇంటిది' పోయినప్పట్నుంచి వేట సంగతే తల పెట్టలేదు ఇప్పుడేదో ఎక్కడలేని ఉత్సాహంతో ఉన్నాడు. తానెందుకు అడ్డు చెప్పడం? కానీయ్ అనుకుంది బెళ్ళి. కాని వేటాడి తెచ్చిన కుందేళ్ళని ఏం చెయ్యాలి? వాటికి సరిపడా ఉప్పు, కారం కావద్దూ! ఇంకా రెండు బుట్టలల్లి పెడతానని చెప్పి, సంకప్పయ్యగారి భార్య వద్ద ఉప్పు, మిరియాలు తెచ్చింది.

ఉదయం వేటకు వెళ్ళిన వారు, చీకటి పడుతుండగా ఇల్లు చేరుకున్నారు. ఆరేడు కుందేళ్ళను పట్టుకున్నారు. వాళ్ళ ఆనందమే ఆనందం. చోముడూ వంట పనిలో ప్రవేశించాడు. అందరూ వంటకు సాయంగా తలో చెయ్యి వేశారు. కాని మధ్యలో ఒక ఇబ్బంది వచ్చింది. ఇలాంటి విందు భోజనమయ్యాక, దానికి తగ్గట్టు సారా లేకపోతే ఎలా? వీళ్ళ భోజనాలయ్యాక వెళ్ళటమంటే మధ్య రాత్రి అవటం తధ్యం కనుక ఇంటికే తెప్పించాలనుకున్నారు. మరి అలా తెప్పించాలంటే బిరుమడికి తబ్బిలివ్వద్దూ? ఇవ్వాళ వేట సంబరంలో బుట్టలల్లలేదు. ఉత్త చేతుల్తో వెడితే సారా అప్పు పెట్టడు. చోముడు ఆలోచిస్తున్నాడు. బెళ్ళి "రెండు కుందేళ్ళు అతని మొహాన కొట్టి రద్దూ" అంది. అదీ ఇష్టం లేని పనే. కాని చేసేదేముంది? ఆ బిరుమదేవుడికి ఆహుతి ఇవ్వకపోతే తృప్తి కలుగదని రెండు కుందేళ్ళను, ఒక పెద్ద కుండను తీసుకుని బయల్దేరాడు.

కుందేళ్ళని చూడగానే బిరుమడి మొహం విప్పారింది. "ఎక్కడికి ఇవి?" అన్నాడు. "ఇక్కడికే." అంటూ చోముడు కుండ చూపించాడు. బిరుమడు కుందేళ్ళని లోపల జాగ్రత్త చేసి

వచ్చి చిన్నబుచ్చుకుని "చోమూ, ఇవ్వాళ సారా ఎక్కువ మిగల్లేదు" అన్నారు. చోముడి ఉత్సాహం దిగజారిపోయింది. "ఎలాగైనా ఎనిమిది ముంతలైనా ఇవ్వకపోతే నా మర్యాద నిలవదు" అని మొరపెట్టుకున్నాడు. ఎలాగో నీరు-సారా కలిపి నాలుగు సీసాల కన్న ఎక్కువ దొరకలేదు.

సారా ఇంటికి వచ్చినా వంట ఇంకా కాలేదు. చుట్టాలకి 'ముందు సారా ఖర్చుపెడదామా, తరువాత భోం చేద్దాం' అన్న ఆలోచన వచ్చింది. కాని చోముడు రుచులెరిగినవాడు. భోజనాలయ్యాకనే సారా అని నచ్చ చెప్పాడు. మొత్తం మీద ఆలస్యంగా భోజనాలయ్యాయి. చోముడు తాను తెచ్చిన సారాకి మరి కాస్త నీరు కలిపాడు. ఇంటి ముంగిట్లో పుల్లలు రాశిగా పేర్చి మంట వేశారు. దాని వెలుగులో సారా సమారాధన మొదలయింది, సారా మరీ పల్చనవటంతో తాగేటపుడు ఎవరికీ అంత ఉత్సాహంగా లేదు. కుండ మాత్రం ఖాళీ అయింది. సరె, ఇప్పుడిహ చోముడి చేతికి డప్పు వచ్చింది. పాట, ఆట జోరుగా సాగింది. సంగీత, నాట్యాలతో ఆ ప్రదేశమంతా మార్మోగింది.

మరునటి రోజు కూడా వేటకు వెళ్ళాలన్న తలంపు చోముడికి. కాని బెళ్ళి అతడిని ఆపింది. "ఉట్టినే వేట తెస్తే సరిపోయిందా? దానికి సరిపడా ఉప్పు, మిరియాలు ఉండొద్దూ" అంటూను. 'వేటకు వెళ్ళే బదులు నాలుగు బుట్టలల్లకూడదమా?' అంది, కూతురి మాట సబబుగానే తోచింది చోముడికి, ఆ పనే చెయ్యసాగాడు. చుట్టాలూ సాయం వచ్చారు. ఆ లోపల ఆఊరి వ్యవసాయ దారుడొకతను చోముడిని వెతుక్కుంటూ వచ్చాడు. ఇదివరకెప్పుడూ తనపనికి చోముడిని పిలిచినవాడు కాదతను. ఇప్పుడెందు కొచ్చాడో మరి అనుకున్నాడు చోముడు. పిలవగానే లేచి వెళ్ళాడు.

"చోమా, మా ఇంటి గేదె చచ్చిపోయింది. వచ్చి తీసికెళ తావా?" అన్నాడు.

లోలోన చోముడు సంతోషించాడు. పైకి మాత్రం అదేం చూపించకుండా ఇంటినిండా "చుట్టాలు. ఎలా రావడం?" అన్నాడు.

మంచిదే కదా, విందు చేసుకోవచ్చు."

"నిజమే, కాని ఉట్టి మాంసంతో పని జరగదే. మిగతా వస్తువులకేం చెయ్యను? చేతులో పైసా లేదు."

అతడు మాత్రం ఏం చెయ్యగలడు? పశువుల పాకలో చచ్చిన గేదెనుంచుకోలేడు కదా! ఒక్కడే లాగి బయట పార వెయ్యనూ లేడు. విధిలేక గొణుక్కుంటూ, "సరె, నాలుగణాలు ఇస్తానురా." అన్నాడు.

ఎగిరి గంతేశాడు చోముడు. చుట్టాలనీ తీసుకుని వాళ్ళింటికి వెళ్ళాడు. వెంటనే గేదెను మోసుకొచ్చి చర్మం వలిచి, మాంసం రాశి చేశారు, ఎనిమిది మంది కాదు ఇంకా ఏభై మంది వచ్చినా చాలు ఆ మాంసం.

మళ్ళీ విందు ఏర్పాట్లు జరిగాయి. అతడిచ్చిన నాలుగణాలతో రెండు మైళ్ళ దూరంలో ఉన్న మాపిళ్ళె కొట్టుకి వెళ్ళి ఉప్పు, మిరియాలు తెచ్చారు. ఇక ఈవిందు భోజనానికి సారా సమారాధన లేకపోతే ఎలా? కొట్లోని మాపిళ్ళెతో రేపటెల్లుండిలో చర్మం, కొమ్ములు తెచ్చిస్తానని చెప్పి నగదు ఎనిమిదణాలు తెచ్చాడు. చర్మం తీసికెడితే రూపాయ దొరికేది. అరువు బేరం గనుక ఎనిమిదణాల నష్టం, అయినా చోముడికి అదేం పట్టదు. అన్నీ శ్రమపడకుండా వచ్చినవే కదా!

మళ్ళీ భారీగా విందుభోజనం, సారా సమారాధన, ఆటా, పాటా జరిగాయి. చుట్టాలు వచ్చాక ఎనిమిది రోజులూ, ఎనిమిది నిముషాల్లాగ గడిచిపోయాయి, ఇంకొక ఎనిమిది రోజులపాటు

వాళ్ళు ఉండేవారేమోగానీ, వాళ్ళలో ఒకరింట్లో ఎవరికో జబ్బుగా ఉందని తెలియడంతో, ఇష్టం లేకపోయినా వాళ్ళు వెళ్ళాల్సి వచ్చింది. ఈ ఎనిమిది రోజుల్లో, సంకప్పయ్యగారింటికి పనికి సరిగ్గా వెళ్ళడానికే అవకాశం లేకపోయింది బెళ్ళికి. ఇక రేపటి నుండైనా సరిగ్గా వెడదామనుకుంది.

ఆమె అనుకున్న ఆ 'రేపు' అనే దుర్దినం మన్వేలుడు వస్తానన్న శుక్రవారం, ఒక్కటే అయింది. తెల్లవారేసరికి యమదూత లాగ అతను వచ్చాడు. మరుగుపడిన సమస్య మళ్ళీ తలెత్తింది. 'ఇవాళెవరైనా నాతో రావలసిందే' నని అతను పట్టుబట్టాడు. అప్పుడిహ ఆలోచనకు అవకాశమే లేదు. ఇక చేసేదిలేక చోముడు, 'నేనే వస్తా' నన్నాడు.

"నువ్వు వచ్చి ఏం చెయ్యగలవు? నువ్వు తాగటం మానవు. నీ అప్పు ఎలా తీరుతుంది మరి?"

చోముడు ఉలిక్కిపడ్డాడు. నిజమే, తాగుడు తను మాననంత కాలం అప్పుతీర్చడం కల్ల. మరెలా? నీల, కాళలను పంపుదామా అంటే మనసొప్పదు.

వీళ్ళు ఊరుకోవడం చూసి మన్వేలుడు, "బెళ్ళీ, నువ్వే ఎందుకు రాకూడదు? కావాలంటే ఓ తమ్ముణ్ణి తోడు తెచ్చుకో. ఒకసారి అప్పు తీరిపోయిందంటే మళ్ళీ రానక్కరలేదు." అన్నాడు.

"ఏమిటి! బెళ్ళి తోటకు వెళ్లటమా?" అని దిగాలు పడి పోయాడు చోముడు.

"ఏం? ఎందుకు రాకూడదు? పిల్లా, పాప గొడవలేం లేవు కదా! ఒక్కసారి నువ్వు చేసిన అప్పు తీరితే మీ ఇష్టం వచ్చినట్టు బ్రతకండి."

ఎంత ఆలోచించినా వేరేదారి కనిపించలేదు. బెళ్లి ధైర్యం తెచ్చుకుని "నీకు ఎడ్లని అమ్మటం ఇష్టం లేకపోతే నన్ను వెళ్ళనివ్వు'' అంది. సందిగ్ధంలో పడ్డాడు చోముడు. ఎడ్లని అమ్మితే మళ్ళీకొనటం ఈజన్మలో జరగని పని. తను స్వంతంగా సేద్యం చెయ్యాలన్న ఆశకు ఇహదారే ఉండదు. సరె. బెళ్ళి వెళ్లటానికి అనుమతించాడు. బెళ్లి ఒక్కతెనే పంప లేక, అందరూ వెడితే సరి, అన్నాడు. 'యజమాని నేలను వదిలి అందరూ వెళ్లటమే!' అని బెదిరించింది బెళ్ళి.

సరే- బెళ్ళి, నీల వెళ్లటమూ, చోముడు కాళ ఇంటిలో ఉండటమూ ఆని నిశ్చయమయింది. నిశ్చయమయ్యాక ఇహనే ముంది వెళ్ళే ప్రయత్నంలో పడ్డారు. వెనుకటి సంగతులన్నీ. చోముడి కళ్లముందు నిలిచాయి. బావురుమని ఏడ్చాడు. బెళ్ళికూడా ఏడ్చింది.

సరే. వెళ్ళేక్షణం వచ్చింది. చోముడు. కూతుర్ని దగ్గరకు తీసుకుని 'వచ్చే పండుగలోపల రావాలి' అన్నాడు. బెళ్ళి సరేనంది. ఇద్దరూ మన్వేలుడి వెంట వెళ్ళారు. చోముడు పంజందాకా కూతురి వెంట వెళ్ళాడు. అక్కడ కాసేపు ఏడ్చి, వెనుదిరిగాడు.

14

బెళ్ళి తోటయాత్ర. ఆమె అన్నల ప్రధమయాత్రలా కష్టతరంగా లేదు. పంజనుండి ముందుకు. మన్వేలుడు తనకున్న పనులవల్ల ఆమెను. ఆమె తమ్ముణ్ణీ బస్సులో తీసికెళ్ళాడు. బెత్తంగడికి వెళ్ళే సరికి అక్కడ కూలీల గుంపు ఒకటి సిద్ధంగా ఉంది. వాళ్ళందరూ కూడా కళసం తోటకు వెడుతున్న వారే. అందులోనూ అందరూ పాత వారేం కాదు. కొంత మంది బెళ్ళిలాగ మరీ కొత్తవారూ ఉన్నారు ఆ కూలీల గుంపులో ఆడవారు, పిల్లలు అందరూ కలిసి మొత్తం వందమంది దాకా ఉన్నారు. వాళ్ళందరికీ మొదటిలా ప్రయాణపు ఖర్చులిచ్చేసి. తాను బస్సులో వెళ్లటానికి సిద్ధమయ్యాడు. బెళ్ళి, నీలూలను వాళ్లతో కలసిరమ్మని చెప్పివారిఖర్చుకి ఒకరూపాయి ఇవ్వబోయాడు. అంతలో ఏమనిపించిందో ఏమో గాని. "నీ తమ్ముడు నడవగలడా ?" అని అడిగాడు.

"ఎంత దూరం ?"

"ఎంతో లేదు. రెండు రోజుల ప్రయాణం...."

"రెండు రోజుల ప్రయాణమా !....ఊఁ నడుస్తాడు" అంది. కాని, మనస్ఫూర్తిగా అన్నట్టులేదు. మన్వేలుడూ ఎక్కువ ఇబ్బంది పెట్టలేదు. వాళ్ళిద్దర్నీ తనతోనే తీసి కెళ్ళాలని నిశ్చయించుకున్నాడు. నీలుడు ఆనందం పట్టశక్యం కాకుండా ఉంది. పంజ నుండి బెత్తంగడి వరకు బస్సులో రావటమే అతడిని ఉల్లాస పరిచింది. ఇంతకు మునుపు బస్సుని కళ్లతో చూసి ఎరుగడువాడు. ఇలాటి వింత

వాహనమెక్కి ప్రయాణం చేస్తున్న తనంతటి భాగ్యశాలి మరొకడు లేడని వాడి ఉద్దేశం.

సరే, తరువాతి ప్రయాణం కొనసాగింది. బెళ్తంగడి నుండి ముందుకు ప్రయాణం చెయ్యటమంటే, అనుపమ, అపురూప సృష్టి సౌందర్యాన్ని చూడటమన్నమాటే। చార్మడి కొండ భవ్య రూపం। పచ్చటి కనుమలు।। భీతి గొలిపే కొరకలు, విస్మయం కలిగించే గిరి శృంగాలు। తరువాత, అన్నింటిని మరపించి ఒక్కసారిగా నిగూఢ ప్రపంచంలోకి తోసివేసే మంచు ముసుగులోని. చీకటి వెలుగులు. వెనుక ముందు లేని ప్రపంచం। ఎదుట వెయ్యారు అడుగుల లోతున్న కనుమలున్నా, నాలుగు బారల దూరంలో ఏముందో తెలియని పరిస్థితి.

మబ్బు ముసురుకున్నందు వల్ల దగ్గరే ఉన్న చెట్టు చేమలు కూడా భూతప్రేతాల్లా కనిపిస్తాయి, ఇటు మరో ప్రక్కన హిమ కణాలు పచ్చటి గడ్డిని తాకి, నీళ్ల చుక్కలుగా మారి. రాళ్ల సందుల్లో "చిరి....చిరి, సుళు....సుళు" అంటూ ప్రవహించే సొగసు ఎంత మనోహరం। కాని అన్నింటిని చూడడానికి 'కళ్లుండాలి.'

నీలుడికి కొండ ప్రాంతంలోకి రాగానే ఒళ్ళు గగుర్పొడిచింది. బస్సు తిరగబడిపోయి, తామందరూ ధ్వంసమయిపోతామని భయంగా అనిపించసాగింది. బెళ్ళికి అలాటి భయమూ లేదు. సంతోషమూలేదు, విస్మయమూ లేదు, విస్మృతీ లేదు. తాను వెనక్కి వచ్చేదాకా తండ్రి, పసివాడు కాళతో ఎలా కాలం గడుపుతాడోనన్న బెంగ. ఇప్పుడిక వర్షాకాలం. ఇంట్లో వర్షాకాలం కోసమని దాచిన గింజలు, నూకలు ఏమీలేవు. అన్నీ చుట్టాలకోసమని ఖర్చయిపోయాయి. ఆశగా నాటిన దుంపలుకూడా వాళ్లకే పెట్టేయాల్సి వచ్చింది. ఇక చాకిరీ చేస్తే మాత్రం ఏం కడుపునిండుతుంది? అయ్యకి మన

స్థిమితం లేని పరిస్థితిలో పనేం చేస్తాడు? పైగా చేతికి దొరికినంతా చిత్తుగా తాగేసి, కాశని పస్తులు పడుకోబెడతాడేమో. దాన్ని కూడా సహించవచ్చు.

పస్తులున్న రోజులు తెలియనివాడుకాడు కాశ. కాని, ఆ రోజు చేసినట్టు, నాడప్పు మోతకు సరిగ్గా ఆడమని చంపుకుతింటే? ఈ రకమైన ఆలోచనలతో ఆమె హృదయం నిండిపోయింది. కేవలం యంత్రంలా కూర్చుని రెండుమూడుమార్లు బస్సు ఎక్కడం, దిగడం చేసింది. ప్రతిక్షణమూ కళ్ల ముందు స్వర్గంలాంటి నూతన ప్రపంచం కనిపిస్తున్నా ఆమె గుడ్డిదానిలా కూర్చుంది.

సాయంత్రానికల్లా వాళ్ల ప్రయాణం పూర్తయింది సన్నగా తుంపర పడుతూనే ఉంది నీల, బెళ్ళిలు మన్వేలుడి వెంట తమ సామాన్లు మోసుకుంటూ వెళ్ళి తోట చేరారు. ఇంకా రాత్రవక పోయినా మబ్బువల్ల అంతా చీకటిగా కనుపిస్తోంది. మన్వేలుడు కూలీల కొట్టాము ఒకటి చూపించి, ఇక్కడే మీ నివాసమని చెప్పి, పిళ్ళు, పుల్లలు దొరికే చోటు చూపించి వెళ్ళిపోయాడు. ఆ వరుస గదుల్లోకి ఇంకా ఎవరూ రాలేదు మిగతా కూలీలు రావడానికింకా రెండురోజులు పడుతుంది. అంతవరకు పనేమీ లేదు. మన్వేలుడు ఆమెను దొరగారి దగ్గరకు తీసికెళ్లనూలేదు. ఆమెని పలుకరించనూ లేదు.

మూడు రోజుల తరువాత బెళ్తంగడినుంచి బయలుదేరిన కూలీలగుంపు కాలినడకన యాత్ర పూర్తి చేసుకుని వచ్చి, తోట చేరారు. అప్పుడు మన్వేలుడు వచ్చి అందరితోబాటు బెళ్ళి, నీలను కూడా దొరగారి దగ్గరకు తీసికెళ్ళాడు. అక్కడ అందరికీ కూలి నిర్ణయించారు.

ఈ సంవత్సరం మగ కూలీలకు నెలకి ఏడు రూపాయల జీతమని నిర్ణయించారు. చాలామందికి అసమాధానం కలిగింది. 'ఏం

చేస్తాం? ఈ సంవత్సరం కాఫీ గింజలకు సరియైన ధర పలుక లేదన్నారు, అందరి పేర్లూ వ్రాసుకున్నారు బెళ్ళి వంతు వచ్చింది. బెళ్ళి రంగు కాస్త నదురుగా కనిపిస్తోంది అక్కడ. మిగతా వారికన్నా తెల్లగా కనిపించటంతోనూ. కొత్త మొహంగా అనిపించటంతోనూ మింగేల దొరగారు " ఈమె ఎవరు ?" అని అడిగారు మన్వేలుడు చోముడి సంగతుల్నీ, అతని కొడుకులు క్రిందట సంవత్సరం వచ్చి వెళ్ళిన విషయాలన్నీ గుర్తుచేశాడు,

దొరగారు 'చిట్టా' తీసి, "మీ అయ్యనుండి ఇంకా పదిహేను రూపాయలు రావాలి మాకు, నువ్వైనా కష్టపడి తీరుస్తావు కదా ! " అన్నారు. బెళ్ళికి కొంత సంతోషమూ, మరికొంత సంశయమూ కలిగింది. మన్వేలుడు వాళ్ళ ఋణం ఇరవై ఆయిదు రూపాయలని బెదిరించాడు, అది ఇప్పుడు పదిహేను రూపాయలనగానే సంతోషం కలిగింది. తప్పుడులెక్కలు చెప్పిన మన్వేలుడి చేతికింద పని చెయ్యడం ఎలాగన్న భీతి కలిగింది. కాని మన్వేలుడు సందేహ నివృత్తి చేయటానికన్నట్టు, "అలా భయపెట్టక పోతే మీరు అప్పు తీర్చరు కదా ! " అన్నాడు.

మరుసటి రోజునుండి ఎవరి పనులలో వారు దిగారు. ఇక నాల్గారు నెలల్లో తామిద్దరూ కష్టించి పనిచేసి, అప్పు తీర్చేసి. తండ్రి దగ్గరకు వెళ్ళిపోవాలన్న తపన బెళ్ళిది, కాని వచ్చిన రెండు వారాల్లోనే ఆమె పని కుంటుపడింది, నీలు చలిజ్వరంతో పడకేశాడు. వాడి ఆదాయం ఆగిపోయింది. అతణ్ణి చూసుకోవటం కోసం బెళ్ళి పని ఆగిపోయింది. ఇలా అయితే తాను కూడా అప్పు తీర్చలేనని బెంగ పెట్టుకుంది బెళ్ళి, మొదటినెలలో కేవలం అయిదురూపాయలే చేతికొచ్చాయి, అందులో ఎంత వాడుకోవడం ? ఎంత అప్పు తీర్చడం ?

నెల జీతం చేతికిస్తూ మన్వేలుడు, "ఇదేమిటి? నీకు రానల పింది అయిదు రూపాయలే కనబడుతున్నాయి. నాగాలు ఎక్కువయినట్లున్నాయి" అన్నాడు

బెళ్ళి దీనంగా తమ్ముడి జబ్బు సంగతి వివరించింది. మన్వేలుడు జాలి చూపుతున్నట్లుగా, "అయితే నీకు మరోపని చెబుతాను. ఇకమీదట మా ఇంటిలో పని చేసుకో, అటు – ఇటు అయినా సర్దుకోవచ్చు." అన్నాడు.

మరుసటి రోజునుండి మన్వేలుడి ఇంటిలో పనికి వెళ్ళ గలిగింది బెళ్ళి. మన్వేలుడి ఇంటిలో విసరడం, అంట్లు తోమడం తుడవడం, ఇలాంటి పనులు ఎక్కువగానే ఉన్నా తమ్ముడిని చూసు కోడానికి కావలసినంత వ్యవధి దొరికేది, అంతేకాకుండా, వాళ్ళింట్లో దొరికే అన్నంతో ఖర్చుతగ్గేది. పనిచెయ్యడం మొదలు పెట్టిన వారంలోనే ఆమె కట్టుకున్న చితికి గుడ్డను చూసి, ఓ చీరె ఇప్పించాడు మన్వేలుడు. నీలకోసం ఓ కంబళి ఇప్పించాడు. ఎందుకో మన్వేలుడు బెళ్ళి విషయంలో ఆసక్తి చూపించసాగాడు. రోజులు గడుస్తున్నకొలది మన్వేలుడు ఆమెను పలుకరించటం, నవ్వడం. కొంటెగా చూడ్డం చెయ్యసాగాడు. ఆమెకూ వాటి అర్థం తెలుస్తోంది, బ్రతుకులో మొదటి సారిగా యవ్వనపు పొంగు ఆమె అనుభవానికి వస్తోంది. కనుకనే మన్వేలుడి ఆహ్వానాన్ని కాదనలేదు. తరువాత 'సరే' నందేమో మరి! అతని దయవల్ల తండ్రి అప్పు తీరేటట్టయితే 'ఏం జరిగితే ఏంలేద్దూ!' అన్న ఉదాసీన భావంతో ఉండి పోయింది.

'సరే' శరీర దౌర్బల్యం ఆమెను కామదాసిగా చేసింది. అప్పుడప్పుడు మన్వేలుడిచ్చే అణా. రెండణాలను దాచుకుంటూ తండ్రి ఋణాన్ని తీర్చగలనని ధైర్యం తెచ్చుకుంది.

15

నీల బెళ్ళి తోటకు వచ్చి ఆరునెలలయింది. నీలుడి వల్ల ఒక్క పైసాకూడా ఆదా అవలేదు. బదులుగా బెళ్ళి మిగిల్చిన నాలుగారు రూపాయలూ అతని మందూ మాకులకోసం ఖర్చయిపోయాయి. ఇప్పుడు దేవుడిదయవల్ల నీలుడి జబ్బు నయమయింది. కాని. పని చేసే శక్తి రాలేదింకా. ఓ రోజు నీల తమగదిముందు కూర్చున్నాడు. అతని వయసే ఉన్న మరో కుర్రాడు అక్కడికి వచ్చాడు ఇద్దరూ ఆటలో పడ్డారు. చాలాసేపు ఆడుకుంటూ హాయిగానే గడిపారు. తరువాత వాళ్ళలో వాళ్ళకి ఎందుకో దెబ్బలాట వచ్చింది. నవ్వుతున్న కుర్రాళ్లు కోపంగా ఒకర్నొకరు తిట్టుకున్నారు.

ఇద్దరూ తమ నీచ ప్రపంచపు శబ్దకోశాన్ని వినిమయం చేసుకున్నారు. అంతటితో తృప్తి పడక, రెండో కుర్రాడు "మేస్త్రీగారి బామ్మరిది!" అని తిట్టాడు. నీలకి దాని అర్థమేమిటో బోధపడలేదు. దెబ్బలాడి అలసిపోయి లోపలకి వెళ్ళి కూర్చున్నాడు. బెళ్ళి పని ముగించుకుని వచ్చేసరికి తమ్ముడు ముఖం చిన్నబుచ్చుకుని కూర్చోవడం చూసింది. "ఏమిటి నీలూ? మళ్ళీ జ్వరం వస్తోందా?" అని అడిగింది. నీల దెబ్బలాట సంగతంతా చెప్పి, "వాడు నన్ను మేస్త్రీగారి బామ్మరిది అని తిట్టాడు" అని చెప్పాడు. బెళ్ళి ప్రాన్పడి పోయింది. తన బ్రతుకులోని కళంకము ఇంత దూరం వ్యాపించి ఉంటుందని ఊహించలేదామె. "ఇంకేది దారి" అన్న భయము బాధ కలిగాయపుడు.

అదే రోజు మధ్యాహ్నం, బెళ్ళి మవ్వేలుడి ఇంటికి తోట తోంచి వెళ్ళే సన్నటి దారి గుండా వస్తుంటే, మింగేల దొరగారు

తమ రెండు కుక్కల్ని వదిలి పెట్టి, వాటి వెనకాల ఆ దారిలోనే వస్తున్నారు. బెళ్ళిని చూసి కుక్కలు భౌభౌ మని ఆమె మీదికి ఉరికాయి. బెళ్ళి గాభరాగా అయ్యో అని అరచింది. దొరగారు గబుక్కున ముందుకు వచ్చి, కుక్కల్ని ఛైను పట్టుకుని లాగి ఆపు చేశారు. కుక్కలు మొరుగుతూనే ఉన్నాయి. దొరగారు నవ్వుతూ "భయపడ్డావా ?" అని అడిగారు. బెళ్ళి సిగ్గుతో నవ్వి తల వంచుకుంది. ఆమె నవ్వు దొరగారిని ఆకట్టుకుంది. ఆయన అక్కడే నుంచున్నారు.

"చోముడి కూతురివి కదూ ?" అని అడిగారు. బెళ్ళి తల వంచుకునే 'అవునంది' "మీ అయ్య అప్పు తీర్చటం ఎంతవరకు వచ్చింది ? నీ లెక్క ఓసారి చూడాలి సాయంత్రం బంగాళాకి రా." అన్నారు.

బెళ్ళి ముందుకు నడిచింది. ఆమె మనసు భీతితో వణికిపోయింది. దొరగారి మాటల్లోని అర్థాన్ని ఆమె సులువుగానే గ్రహించింది. ఇహ ఈ తోటలో తను ఏమయిపోతానోనన్న బెంగ, దుఃఖాలతో తల్లడిల్లిపోయింది. సాయంత్రం పనంతా పూర్తయ్యాక తన గదిలోకి వెళ్ళింది. తలుపు వేసి, దిక్కు తెలియనట్లు ఆలోచిస్తూ కూర్చుంది. ఆమె దగ్గరగా నీల పడుకున్నాడు. నీల మధ్యాహ్నం చెప్పిన మాట గుర్తొచ్చింది, ఇక నాలుగు రోజుల తరువాత, "దొరగారి బొమ్మరిది" అంటారు వాడిని అనుకుంది. అప్పుడే ఎవరో తలుపు దబదబ బాదారు. బెళ్ళి పలకనూలేదు తలుపు తియ్యనూ లేదు. బయటనుంచి మన్వేలుడు "బెళ్ళి. తలుపు తియ్" అన్నాడు. ఆతని కంఠం విని, కొంత ధైర్యం తెచ్చుకుని తలుపు తీసింది. బయటకి రమ్మన్నాడు వచ్చింది. మన్వేలుడు బయల్దేరాడు. తమంతట తామే బెళ్ళి కాళ్లు అతడి కాళ్లని అనుస

రించాయి. కాని, వెళ్ళింది మన్వేలుడి ఇంటిక్కాదు, దొరగారి బంగళాకి,

మరుసటి రోజు ఆమె మొహం భూతదర్శనంతో బెదిరిన దానిలా కనిపిస్తోంది. ఆమెకు మాటి మాటికి తండ్రి గుర్తొస్తున్నాడు. తన ఈ సంగతులన్నీ అతని చెవిన పడితే తాను చేస్తున్న పనంతా వ్యర్థమయి పోతుంది—అనే భయం. తండ్రి ఋణం తీరుస్తున్నానని మనసుకు ఎంత నచ్చ చెప్పుకున్నా మనసుకు శాంతి దొరకటంలేదు. ఆ చోటునుంచి పారిపోతే తప్ప తనకు 'మోక్షం' లేదని తెలిసి పోయింది, ఈ ఆలోచన రాగానే తన దగ్గరున్న డబ్బుతో మన్వేలుడి దగ్గర కెళ్ళింది. వెనుకటి రోజు దొరగారు 'ఇచ్చుకున్న' అయిదు రూపాయలూ కలిపితే పదిహేను రూపాయలున్నాయి, డబ్బంతా అతడి ముందుంచి, నేనింక ఊరికి వెడతానంది, మన్వేలుడికి భీతి కలిగింది. చాలా ఆలోచించాడు, నచ్చ జెప్పాడు. బెళ్ళి మనసులో చోటు చేసుకున్న భయం కొంత కూడా తగ్గలేదు. ఇటు మన్వేలుడు మరో విధంగా కూడా ఆలోచించాడు. ఇంకో వారం రోజుల లోపల అతని భార్య రానున్నది. కనుక వెడతానంటున్న బెళ్ళిని పంపించడమే మంచిదనుకున్నాడు. దారి ఖర్చుకి కొంత డబ్బిచ్చి పంపేశాడు.

అదే రోజు రాత్రి బెళ్ళి తమ్ముడితో సహా మాయమయింది. మరుసటి రోజు మన్వేలుడు ఇతర కూలీలతో 'బెళ్ళి ఏమయిందో' తెలియనట్లే నాటకమాడాడు. విషయం దొరగారి వరకు వెళ్ళింది. దొరగారు మన్వేలుడిని కేకలు వేశారు. బెళ్ళి ఎక్కడున్నా వెతికి తెమ్మన్నారు, మన్వేలుడు సరేనని చుట్టుపక్కల ఉన్న తోటల్లోకి మనుషుల్ని పంపాడు, అందరూ బెళ్ళికోసం గాలించారు. వెనక్కి వచ్చిన వారిలో ఒకడు 'దారిలో ఓకుంటలో చీర తేల్తోందని చెప్పాడు' దొరగారి మనసులో ఆమె ఆత్మహత్య చేసుకొని ఉండొ

ద్చునన్న భయం పుట్టింది. ఇక బెళ్లిని వెతికే మాట తలపెట్టడం తనకు క్షేమంకాదని ఊరుకున్నారు.

జాతరకింకా నెలరోజులుండగానే బెళ్ళి తమ్ముడితో కలసి ఇల్లు చేరుకుంది. గడపదాటినపుడు ఆమె గుండెదడ ఆమెకే వినిపించేలా ఉంది. తండ్రిని చూశాక సంతోషంకన్నా భీతి ఎక్కువగా కలిగింది. తలెత్తి చూసే సాహసం కలుగలేదామెకు. చోముడు కూతుర్ని దగ్గరగా కూర్చోబెట్టుకుని, ఎన్నెన్నో కబుర్లు చెప్పాడు. ఎంత మాట్లాడినా తనివి తీరలేదతడికి. తన కూతురు, మగపిల్లలు తీర్చలేని ఋణాన్ని తీర్చి వచ్చిందంటే అతనికి కలిగిన ఆనందం ఇంతా అంతాకాదు. కాని ఋణం ఎలా తీర్చిందో బెళ్ళిది కదా అనుభవం।

చోముడి గుడిసెలో ఇప్పుడు ఆనందకరమైన రోజులు గడుస్తున్నాయి. బెళ్ళి ఇచ్చిన పైసలతో రోజూ త్రాగుతున్నాడు. త్రాగాక రోజూ నాట్యమూ ఉంటోంది. డప్పుకి పాత చర్మానికి బదులు క్రొత్త చర్మం వచ్చింది.

ఇవ్వాళే జాతరరోజు. నిరుడు ఈరోజు ఎలా గడిచిందో తల్చుకుంటే గుండె చెరువౌతోంది బెళ్ళికి. అన్న జబ్బుతో పడ వెయ్యడం. అయ్య గురువడికోసం పరుగుతీయటం కళ్లముందు మెదుల్తోంది. ఈసారి ఎన్నడూలేనంత ఆనందంగా జాతర సంబరాల్లో పాల్గొనాలని నిర్ణయం అయింది. చోముడి మనసులో ఇంకొక అపూర్వమైన ఆలోచన పుట్టుకొచ్చింది. బెళ్ళికి వరుణ్ణి వెతికి ఇంటికి అల్లుణ్ణి తెచ్చుకోవాలన్న ఆలోచన అది. బెళ్లితో ఇంకా అననేలేదు ఆమాట. అతడికి ఆ సంతోషంతోబాటు బెంగ కూడా కలుగుతోంది. "ఇంటికి అల్లుడు వస్తే, బెళ్ళికి, ముసలివాడైన తనమీద మొదటిలా మమత ఉంటుందా?" అని. అలా

అనుకున్నప్పుడు దుఃఖం ముంచుకుని వస్తుంది. మళ్ళి. 'ఇక బెళ్ళి నన్నెలా చూసినా ఫరవాలేదు నా ఋణం తీర్చివచ్చింది. నేను తీర్చలేని ఋణం అది తీర్చింది. అయ్యో! నా బెళ్ళి మగపిల్ల వాడై పుట్టకూడదూ! అప్పుడు నేనెంత గర్వించేవాడినో!' అనుకున్నాడు. ఆమె మగపిల్లవాడైతే మరో గురువడు తయారయి ఉండేవాడని తెలియదు చోముడికి పాపం!

ఉదయమే ఊళ్ళో అందరూ గుంపులు గుంపులుగా జాతరకు బయల్దేరారు. ఆరోజు ఎంతెంతో దూరం నుండి తమ వాళ్ళంతా వస్తారు. వాళ్ళలో ఒక్కడైనా బెళ్ళికి తగినవాడు దొరక్కపోడన్న ఆలోచనతో చోముడూ బయల్దేరాడు. చేతిలో ఉన్న ఒక్కరూపాయినీ బెళ్ళి ఆప్యాయంగా తండ్రి చేతిలో ఉంచింది. దీన్తో తను కూతురికి మరీ ఋణ పడిపోతున్నానని బెంగపడిపోయాడు చోముడు. ఇటు బెళ్ళి తమ్ముళ్ళకి తలదువ్వి, తానూ ముస్తాబై మన్వేలుడిచ్చిన కొత్త చీరె కట్టుకుని జాతరకు బయల్దేరింది.

ఈసారి జాతరే జాతర! అలాంటి జాతర ఇంతవరకు చూడలేదంటాడు చోముడు. నిజమో, అబద్ధమో మనకు తెలియదు గాని, అతడి కళ్ళకు చుట్టూ ఉన్న చెట్లూ, చేమలూ కూడా సంతోషంతో నాట్యం చేస్తున్నట్టుగా కనిపిస్తున్నాయి. జాతరలో వందలమంది మాదిగలు కూడారు. పరిచయం ఉన్నవారితో, లేని వారితో — అందరితోనూ తెగ వాగుతున్నాడు చోముడు. అందులో యువకులమీద ఓ కన్నేసి ఉంచి మరీ మాట్లాడుతున్నాడు. ఇటు బెళ్ళి స్త్రీ ప్రపంచంలో ఉంది. అందరి కళ్ళూ బెళ్ళి చీరమీదనే. కాని ఆ చీరె మాట తల్చుకుంటేనే బెళ్ళికి వణుకు పుట్టు కొస్తోంది. దురదృష్టమా అన్నట్లు జాతరలో ఎక్కడో ఓమూలనుంచి మన్వేలుడి చూపు ఆమె కళ్ళబడింది. గాబరా పుట్టుకొచ్చింది. సాయంకాలం

అవుతుండగా తనకు ఒంటిలో బాగోలేదనే నెపంతో గుడిసెకు తిరిగి వచ్చేసింది. చోముడుకూడా ఆమాట చెప్పలేదు.

మన్వేలుడు చోముడి ఎదుట వెళ్ళినుంచున్నా అతను కళ్ళెత్తి చూడలేదు. అతనిలో అపుడు ఓ రకమైన గర్వం. ధీమా ఏర్పడింది. మన్వేలుడు తనంతట తాను పలుకరించాడు. "బెళ్ళి రాలేదా ? నీలుదేడి ? " అంటూను. "వచ్చారు, ఎక్కడో ఉంటారు." అని ఉదాసీనంగా బదులు చెప్పాడు చోముడు.

జాతరలో ఆవేళ రాత్రి సంబరం ఇహ చెప్పనక్కర్లేదు. ఉన్న ఒక్కరూపాయితో, బిరుమడి నీళ్ళసారా స్నేహితులకంతా పోయించాడు. అందరూ కలసి పుల్లలు తెచ్చి మంట చేశారు. దాని వెలుగులో చోముడు డప్పు వాయించడం మొదలు పెట్టాడు. అతనితో బాటు మరి కొంతమంది డప్పు చేతికి తీసుకున్నారు, ఆడవారు వలయంగా ఏర్పడి, పాడుతూ నృత్యం చేస్తున్నారు,

వలయంలోపల యువకులు నృత్యం చేయ సాగారు. ఒకతను పిల్లన గ్రోవి ఊదుతూ నృత్యం చేస్తున్నాడు. అతనిమీద చోముడి దృష్టిపడింది. కాస్సేపటికి అతడికన్న బాగా నాట్యంచేసే యువకుడు వచ్చాడు. చోముడి స్నేహితులు డప్పు వాయించడంలో వెనుకబడ్డారు కాని చోముడి చేతికి అలసట. ఓడి పోవటం అంటూలేదు. అతని డప్పు మ్రోతకు అనుగుణంగా అడుగులు వేస్తూ ఆఖరివరకు నిలబడ్డ యువకుడు ఒక్కడే. అతడిని 'సుళ్య' అనే పల్లె, అక్కడినుంచి పంజంలోని చుట్టాలింటికి వచ్చాడట. జాతరకూ వచ్చాడు, అతనే తన కాబోయే అల్లుడని చోముడు మనసులో నిశ్చయించుకున్నాడు.

రాత్రంతా పరమానందంగా గడిచింది. ఆకాశంలో వేగుచుక్క పొడవడం చూసి చోముడికి కోపం వచ్చింది. ఇక తెల్లవారి పోతుంది. అది కాస్త ఆగిరాకూడదూ! అని.

కాబోయే అల్లుడ్ని ఎన్నిక చేశాక, అతని స్నేహితులతో ప్రస్తావించాడు. కాని ఆ కుర్రాడికి అప్పటికి పెళ్ళి అయిపోయిందని తెలిసింది ఎంతటి నిరాశ! అతని పెళ్ళాం చనిపోయినా. అతడికి పశ్చాత్తాపానికి మారు కొంత సంతోషమే గలిగుండేది.

16

జాతర అయిపోయిందంటే ఇక పదిహేను, ఇరవై రోజుల్లో వర్షాకాలం వచ్చిపడుతుందని నమ్మకమే. ఆకాశంలో వర్షాకాలపు మబ్బులు అప్పుడే గుమిగూడుతున్నాయి, దట్టమైన మబ్బులు తుఫాను ఉరుములు మెరుపులు, నాటి ప్రారంభంతోటే చోముడి ప్రపంచం లోనూ ఉరుములూ మెరుపులూ రానున్నాయి. కూతురు ఇంటి కొచ్చి నెలదాటింది, అంతా సవ్యంగా సాగిపోతోంది. రోజులు ఎలా గడుస్తున్నాయో తెలియటం లేదు, జాతర వెళ్ళి, వారముయిం దప్పుడే. పల్లెలో వర్షాకాలపు ఏర్పాట్లు జరుగు తున్నాయి, చోము డిప్పుడు అరవయ్యేళ్ళ ముదుసలి, ఈ ఒక్క సంవత్సరములోనూ అతని మొహంలో ముడతలెక్కువయ్యాయి. పళ్ళు సడలుతున్నాయి.

"ఇంకెంత కాలం బ్రతుకుతాను నేను? ఈ వర్షాకాలం గడిచిపోతే, మరో వర్షాకాలానికి నాగలి ఋణం ఉంటుందా నాకు!

ఇప్పుడు రానిది మరెప్పుడు రాగలదు?" అన్న భీతి ఆవరించింది. దాన్తో ఈ సంవత్సరమన్నా తాను స్వంత సాగు చెయ్యాలన్న పట్టుదల వచ్చింది. ఈసారి మళ్ళీ యజమానితో విన్నవించుకోడం. ఆయన కాదంటే, వారినేల ఋణం తీరిందనుకుని గవర్నమెంటు జాగాలోకి ప్రవేశించటం. ఊరవతల పెద్ద మైదానముంది. నీరు లేకపోయినా వర్షాకాలంలో ఒక పంట నిశ్చింతగా తియ్యొచ్చు. నాలుగ్గింజలు దొరక్కపోవు. దొరికినా మానినా తననుకాదన్న ఈ ప్రపంచం ఎదుట మీసాలు మెలెయ్యవచ్చు కదా అన్న ఉద్దేశం అతనిది.

కూతురితో మాట మాత్రం చెప్పకుండా, గుడిసెనుండి బయల్దేరాడు. రోజూ వెళ్ళేటప్పుడు కత్తి నడుములో దోపుకుని వెళ్ళేవాడు. ఇవాళ అది మరచి ఆత్రంగా బయల్దేరటాన్ని చూసి బెళ్ళి నవ్వుతూ, "అయ్యా! ఎక్కడికి బయల్దేరావ్?" అంది. చోముడికి కోపం వచ్చింది. బయటకి వెళ్ళేటప్పుడు "ఎక్కడికి?" అన్న అపలక్షణపు మాట వినపడ్డందుకు. కాని బెళ్ళి మొహం చూసి ఓర్పు తెచ్చుకున్నాడు. "ఎక్కడికీ లేదు" అని వెనక్కి వచ్చేశాడు. బయల్దేరిన ముహూర్తమే బాగోలేదనిపించింది. ఈసారి బెళ్ళి అడిగినా తనపని సానుకూలమవదనిపించింది. రెండుమార్లు తన వేడికోలు నిరర్థకమయినపుడు మూడవసారి మరోలా అవుతుందా? ధైర్యంపోయి బెంగపట్టుకుంది. అతని మొహం చిన్నపోవటాన్ని చూసి, బెళ్ళి దగ్గరగా వచ్చి, "అయ్యా, తప్పుగా అడిగానా? నువ్వు పన్లోకి వెడుతూ కత్తి మర్చిపోయి వెడుతున్నావని అలా అడిగాను. ఇకనెప్పుడూ బయటకి వెళ్ళేటప్పుడు 'ఎక్కడికి' అని అడగను. సరేనా?" అంది.

చోముడు విట్టూర్చాడు. "దైవం నాఎదుట అలా రాసినపుడు ఎవరేం చెయ్యగలరు?" అన్నాడు.

"దేని గురించయ్యా?"

"ఇంక దేని గురించి? నేను స్వంతంగా సాగుచెయ్యాలన్న కోరిక గురించి."

"ఓహో! అదా? అయ్యా, ఎందుకు లేనిపోని ఆశలు పెంచు కుని బాధపడతావ్? మనం మాదిగ కులంలో పుట్టాం. మన అంత స్థుకి మించిన ఆశ తగదు. దేనికయినా అదృష్టం ఉండాలి. దేవుడు మన నుదుట అదృష్టాన్ని రాసిపెట్టాలి. గురువదొక్కడి నుదుటే రాశాడనుకుంటా. జాతి వదులుకున్నా వ్యవసాయదారు డయ్యాడు, మన కులంలో పుట్టినా, వ్యవసాయపు ఋణం దక్కించుకున్నాడు."

గురువడి పేరు విని రోమాంచనం కలిగింది చోముడికి. అతను తనకు వ్యతిరేకంగా నడిచాడని చింత. తమ ఇంటిమొహం చూడ లేదన్న రోషం ఒక వేపు, తన కళ్లముందే వ్యవసాయదారుడు అయ్యాడే అన్న అసూయ మరో వేపు. అన్నీ కలగాపులగమై అతణ్ణి బాధ పెట్టసాగాయి.

దీనితో అతడి మనస్సులోని ఆక్రోశం విజృంభించ సాగింది. "ఇవ్వాళ ఏదో ఒకటి తేల్చేస్తాను." అన్న ఆవేశంతో బయల్దేరాడు. తిన్నగా వెళ్ళి యజమాని ఇంటి ప్రాంగణంలో తాను రోజూ కూర్చునే చోట్లోనే కూర్చున్నాడు. ఇటీవల అతడి రాకపోకలతీరు నియమం తప్పటం వల్ల. ఉదయమే వచ్చి కూర్చున్న చోముడిని చూసి, సంకప్పయ్యగారికి ఆశ్చర్యం కలిగింది. "ఏమిటోయ్ చోమూ, చాలా అపురూపంగా వచ్చావు?" అన్నారు నవ్వుతూ. తాను వచ్చిన వేళ ఎటువంటిదో అడగవచ్చో, అడక్కూడదో అన్న

సంధిగ్ధంలో పడ్డాడు చోముడు. అతడు మాట్లాడక పోవడంతో "ఏమయినా అడగడానికి వచ్చావా? లేదా పని చెయ్య టానికి వచ్చావా?" అన్నారు.

ఆ మాటకూ బదులు చెప్పకుండా చోముడు మౌనం వహించాడు.

"అరె, మాట్లాడవేం? ఇక నీ చేత ఏంపని సాగుతుంది? రోజుల్లెక్క పెడుతూ కూర్చోవలసిన వాడివి. వచ్చి పోతూఉండు. సాయంత్రం మటుకు రామాక, నేనుట్టినే చెప్పటమేగాని. నీకు సాయంత్ర మేమిటి, ఉదయమేమిటి? అన్నట్లు చోమూ, నీ కూతురు అప్పు తీర్చి వచ్చిందా? మరింత ఎక్కువ చేసి వచ్చిందా?"

"దేవుడి దయవల్ల అంతా తీర్చేసింది."

"పోనీలే, ఒక విషయంలో నిశ్చింత నీకు."

"నిజమే, ఒక విషయంలో నిశ్చింతే. ఇంకో విషయం మిమ్మల్ని అడగాలనొచ్చాను. ఇంతకు ముందు అన్నట్టే అంటే. ఈ బీదవాడి నోట్లో మట్టే. ఏమంటారు? మీ పాలికాపుని. ఆశ తీరకుండానే చావమంటారా?

"అసలు సంగతేమిటో చెప్పక ఈ డొంక తిరుగుడు ఎందుకు? వానాకాలం వచ్చింది. కౌలుకి భూమి అడగడానికొచ్చావా?

"ఆఁ, అదే...."

"సంకప్పయ్యగారి మొహంలో అప్రసన్నత కాన వచ్చింది. "చోమూ. నీకివ్వకూడదని లేదు నాకు. ఊళ్ళో వాళ్ళెవరూ చెయ్యని పనికి నేను తయారుగా లేను. ఇక అలా జరగాలంటే మా అమ్మ చావాలి. ఆమె ఉన్నంత వరకు ఆ మాటెత్తకు."

తను వ్యవసాయ దారుడవ్వాలన్న కోరికతో, యజమాని తల్లి చావుని కోరుకుంటాడా చోముడు? నిరాశతో వెనక్కి తిరిగాడు. ఆ వేళంతా పచ్చి మంచి నీరు ముట్టుకోలేదు. బెళ్ళి ఇంక ఆ వ్యర్థమైన కోరికను గురించి మనసులో బాధపడవద్దని పరిపరివిధాల నచ్చజెప్పింది. ఆ మాత్రం చేత మనసు సమాధాన పడుతుందా? మళ్ళీ మనసులో రేగిన తుఫానును అరికట్టలేక సతమతమవసాగాడు.

మరుసటి రోజు మరో దుర్ఘటన జరిగింది. చోముడు పిల్లలిద్దర్నీ కొంత దూరంలో ఉన్న ఏటి దగ్గరకి స్నానం చేయించడానికి తీసుకెళ్ళాడు. రోజూ తమ్ముళ్ళిద్దరికీ స్నానం చేయించే పని బెళ్ళిది. అలా ఇంకోరు స్నానం చేయించే వయసు దాటింది వాళ్ళకి. కాని తల్లి లేని పిల్లలని బెళ్ళి కొంచెం గారంగా చూసేది. ఇవ్వాళ కాస్త పని ఎక్కువగా ఉందని తండ్రిని పంపింది. చోముడి వెంట పిల్లలిద్దరూ గంతులేసుకుంటూ వెళ్ళారు. ఏరు వచ్చింది. చోముడు కుర్రాళ్ళిద్దర్నీ అక్కడ నుంచో పెట్టి, వాళ్ళ తలకి రాపిన జిడ్డుని రుద్దడానికి ఏదో ఆకు-అలము తేవటానికి వెళ్ళాడు. పెద్ద ఏరు అది. ఏటి పై భాగంలో ఎంతో మంది ఉత్తమ జాతి వారు బట్టలుతుక్కుంటున్నారు. కొంత మంది పిల్లలు నీళ్ళలో ఆడుకుంటున్నారు. కాళ, నీలూలకీ నీళ్ళలో దిగాలనిపించింది. తండ్రి కోసం ఎదురు చూడకుండా నీళ్ళలో దిగి నీటిని చిమ్ముతూ ఆడసాగారు. పిల్లలకి ఆడటమంటే సారా తాగినట్లే. ఉత్సాహం ఎక్కువ కాగా ఇంకా ముందుకు వెళ్ళారు. ఈత వచ్చిన పిల్లలు గనుక ఒకర్నొకరు తరుముతూ, తప్పించుకుంటూ, నీళ్ళలో మునుగుతూ, తేలుతూ ఆడసాగారు. ఇవన్నీ వాళ్ళకి మామూలే. కాని, ఇవ్వాళ దురదృష్టం కొద్దీ నీల పీళ్ళలో మునిగిపోయాడు. కాళ భయంతో వడ్డుకి వచ్చి గట్టిగా అరవ సాగాడు.

దూరంగా వస్తున్న చోముడికక్కూడా ఆ అరుపులు వినబడ్డాయి. కంగారుగా పరుగెత్తి రాబోయి కింద బడ్డాడు. పడిలేచి వచ్చేసరికి

కాస్త సమయం పట్టింది. ఇటు ఏటి పైభాగంలో ఉన్నవారు పరుగెత్తి వచ్చారు. అందులో ఓ బ్రాహ్మణ యువకుడు నీలుడిని రక్షించడానికి ముందుకు వచ్చాడు. కాని వాళ్ల పెద్దవాళ్లు అతడిని ఆపేశారు—'అతడు మాదిగల పిల్లవాడ'ంటూను. యువకుడు తట పటాయించాడు. క్రింద పడి లేచిన చోముడికి అసలు సంగతేమిటో తెలియలేదు. నీల అందరి కళ్లముందూ నీళ్లలో మునిగి పోయాడు. ఆఖరి సారిగా పైకి తేలి మళ్ళీ మునిగి పోయాడు. చోముడు పరుగెత్తుకుంటూ వచ్చేసరికి అంతా అయి పోయింది. అందరి కళ్ల ఎదుట ముక్కుపచ్చలారని కుర్రాడు ఒక్కసారిగా అదృశ్యమయిపోయాడు. చోముడు 'హో' అని అరవసాగాడు అతడికి ఈతరాదు. అప్పుడిక బ్రాహ్మణ యువకుడు నీళ్లలోకి ఉరికాడు. కొంత మంది అతడిని ఆపడానికి ప్రయత్నించి విఫలులైనట్లున్నారు. నీలుడి శవం పైకి వచ్చింది, ప్రాణం లేని కట్టెలా, ఆ యువకుడు అపరాధిలా తలవంచుకుని వెళ్ళిపోయాడు. చోముడి నోట మాట రాలేదు.

చోముడికి మాదిగజాతి బ్రతుకు ఎంత నికృష్టమైనదీ పూర్తిగా అనుభవంలోకి వచ్చింది. శవాన్ని మోసుకుని ఇంటికి వచ్చాడు. ఒక రోజల్లా పోలీసులు వచ్చే వరకు శవాన్ని ఇంట్లోనే ఉంచవలసి వచ్చింది. కొంత మంది శవాన్ని చూట్టానికి వచ్చారు. ఈ సంగతి తెలిసి సంకప్పయ్యగారూ వచ్చారు, కాని చోముడు శవాన్ని పెట్టుకుని తలుపులు మూసుకుని ఎవరి కంటా పడకుండా లోపల కూర్చున్నాడు. బయట నుంచి ఎవరు పిలిచినా మాట పలుకు లేదు. బెళ్ళి మాత్రం బోరుమని ఏడవ సాగింది. "నువ్వు ఏడిస్తే ఈ పిల్లాణ్ణి తిన్నట్టే" అని ఒట్టు పెట్టుకున్నాడు చోముడు.

రాత్రివేళ పోలీసులు ఎప్పటికో వచ్చి తనిఖీ చేసి వెళ్లారట. శవం ఎవరి కంటా పడకుండా మట్టిలో కలిసిపోయింది. మరునాడు ఉదయమే చోముడి డప్పు మ్రోగసాగింది!!!

17

వయసు మీద పడుతున్నందువల్ల చోముడికి సంసారం భారమవు తుందనో ఏమో. ఓటమి, చావులు కలిపి ఆతడి బరువుని తగ్గిస్తు న్నాయి. మనసులోని బరువుమాత్రం పెరుగుతోంది. ''నిరుడు చనియుడు; ఈఏడు నీల; ముందుముందు ఎవరో ఎవరికి తెలుసు? దేవుడు నన్ను తీసుకుపోతే ఎవరికీ ఏ బాధా ఉండదు.'' అని తనలో తనలో తాను అనుకుంటాడు. అతనిపుడు ఏపన్లోకీ వెళ్లటంలేదు. ఇంట్లోనే కూర్చుని గడియల్ని లెక్కపెడుతున్నాడు. మనసుపోయి నపుడు డప్పు మ్రోగిస్తాడు. పగలు, రాత్రి అంతా ఒకటిగానే అనిపిస్తున్నాయి. బెళ్ళి నిరుత్సాహ పడిపోయింది. పన్లోకి వెడితే వెడుతుంది, లేకపోతే లేదు. భోజనం సంగతీ అంతే. పన్లోకి వెళ్ళి. తెచ్చిన బియ్యం మిగిలివుంటే, గంజి కాస్తుంది. లేకపోతే అదీలేదు. ఇక మిగిలిందల్లా ఒక్క కాళ. ఆకలేస్తే యజమాని ఇంటి పెరట్లో అటు-ఇటు కాసేపు పచార్లు చేస్తాడు. అమ్మగారు జాలితో ఏమయినా పెడితే తింటాడు. ఇంకా స్త మిగిలితే తెచ్చి అక్క కిస్తాడు. ఇలా జరిగాయి కొద్దరోజులు.

బెళ్ళి మనసు రానురాను తేలిక పడసాగింది. "ఏడుపుకో అంతు ఉందా? బ్రతుకులో ఇంకా ఎంత ఏడుపు రాసిపెట్టి ఉందో'' అంటుంది.

ఒకటి, రెండు రోజుల్లో కుంభవృష్టి కురియసాగింది. వంకప్పయ్యగారు చోముడి గుడిసెదాకా వచ్చి, బయట నుండి ''చోమూ, ఉన్నావా లోపల?'' అన్నారు. ఆయన కంఠం విని చోముడు బయటకి వచ్చాడు.

"ఎలా ఉన్నావు?"

"ఇలా ఉన్నానయ్యా"

"ఒంట్లో కులాసా ఉన్నట్లయితే రేపు దున్నడానికి వచ్చెయ్. ఏం?" అన్నారు.

చోముడు ఎక్కువగా మాటాడలేదు.

"అలాగే" అన్నాడు.

నీలుడి మరణంతో అడ్డత్రోవ పట్టిన అతడి మనసు మళ్ళీ పూర్వపు ఆలోచన సరణిని అనుసరించింది. తాను వ్యవసాయ దారుణ్ణవాలన్న కోరిక ఈ సంవత్సరం తీర్చుకొని తీరాలని నిశ్చ యించుకున్నాడు. తను మరో సంవత్సరపు వర్షాకాలాన్ని చూడ బోడని అతనిచెవిలో ఎవరో చెప్తున్నట్టనిపిస్తోంది. ఇహ త్వరగా పనులు పూర్తి చేసుకోక తప్పదు. ఇవాళ జరగనిది ఇంకెప్పుడూ జరగదు—అని మాటిమాటికి ఆలోచించ సాగాడు. ఇప్పుడున్న త్రోవలో అంతా ముళ్ళపొదలే. సంకప్పయ్యగారి ఇంటి ముందు ప్రాణత్యాగం చేసినా తనకోరిక తీరటం అసంభవం!

తాను మాదిగ వాడిగా ఉన్నంతకాలం స్వంత సాగు గురించిన ఆశ లేనే లేదు. ఆ సమయంలో గురువడు గుర్తుకొస్తాడు, అతనిమీద మళ్ళీ కోపం ప్రజ్వరిల్లటానికి మారుగా అసూయ పడడానికి మారుగా "నేనూ అతడిలా అయితేనో!" అన్న చిన్న ఆలోచన వచ్చిందీసారి. కులపు దేవుడిని నమ్ముకున్నా తన ఆశ తీరనపుడు పాద్రిదేవుడిని నమ్మితే వచ్చే నష్టమేమిటి? ఈ ఆలోచన మనసులో మొలకెత్తగానే క్షణంలో చిగిర్చి వేళ్ళు నాటుకుని కొమ్మలు విస్తరించి పెద్దవృక్షమై కూర్చుంది.

నీలుడి మరణాన్ని గురించిన జ్ఞాపకాలింకా పచ్చిగానే ఉన్నాయి. అప్పుడా బ్రాహ్మణ యువకుడిని అతడి పెద్దలు అడ్డుకున్న దృశ్యం మరెన్నోఅర్థాలు చెబుతూ అతడి కళ్ళముందు భీకరంగా నాట్యం చేస్తోంది. 'నేను మాదిగ వాడు కాకుండా మరే కులపు వాడినైనా నానీలుడు బ్రతికి బయటపడే వాడే గదా! మాదిగకులం ఆదేవుడికి అక్కర్లేనపుడు నాలాటి వాళ్లందర్నీ ఆ కులంలో ఎందుకు పుట్టించాలి? ఇలా ఎందుకు ప్రాణాలు తియ్యాలి?' అనుకున్నాడు.

"ఇక ఈ ఊరి దేవుడి గొడవే తనకొద్దు. తనకిక దేవుడు దేవుడు క్రీస్తు—గురువణ్ణి వ్యవసాయ దారుణ్ణి చేసిన దేవుడు" అనే నిశ్చయాని కొచ్చాడు. కూతురితో కూడా ప్రస్తావించాడు. విషమావస్థలో కూడా వ్యవసాయదారుణ్ణవాలన్న అతడి మొండిపట్టు దలను చూసి ఆమెకు ఆశ్చర్యం వేసింది. ఇటు ఆమె మనసుకూడా గురువడికి చూడాలని అలమటిస్తోంది. అతడైనా దగ్గరున్నట్టయితే. చనిపోయిన వారి స్థానాన్ని కొంతైనా భర్తీ చెయ్యగలిగే వాడు. తండ్రిముది వయసులో ఆసరాగా ఉండేవాడు అనిఆలోచించసాగింది. కాని, కిరస్తానీ అయిన అతనితో కలవాలంటే. తామూ కిరస్తానీల వ్వాలి. తమకిక ఏ దేవుడయితేనేమిటట! అని కూడా అనుకుంది. మరుక్షణమే పాడు మన్నేలుడి మీద తపన కూడా కలిగింది. ఆ బ్రతుకు మీద మళ్ళీ మోహం కలిగింది. ఒక్కోసారి తాను మన్నే లుడి భార్య అయినట్లు కలగనేది. గురువడు మారిని పెళ్లి చేసుకో లేదూ!

తండ్రిని సమీపించి, "మనమిక పాద్రిమతానికి చేరితేనేం? అప్పుడైనా నీకు నాగలిపట్టేయోగం పట్టవచ్చు" అంది. అతడి ఆలోచనలూ అదే దిక్కులో పయనిస్తున్నాయి.

"అందరూ చెయ్యి వదిలాక, ఏదైతేనేం?"

చోముడు నిర్ణయమిప్పుడు బల పడింది. అతడికి అడ్డు చెప్పగల బెళ్ళి అతడికి అనుకూలంగా ఉంది. అయితే పాద్రి గారిని అడిగి భూమి కౌలుకి తీసుకునే ఏర్పాటు చేసుకుందామనుకొని, "అయితే నేను పాద్రిగారి దగ్గరకి వెళ్ళిరానా?" అని అడిగాడు. బెళ్ళి అతని ఈ ఆలోచనను ప్రోత్సహించేందుకు మారుగా, "అయ్యా, పోయిన వాళ్ళు పోయారు, ఉన్న వాళ్లమీద కోప మెందుకూ?" అంది. చోముడుకు అర్థం కాలేదు. "అయ్యా గురువన్నను తీసుకు రారాదూ? వాడు బాగుంటే మనం కూడా వాడి తోటే ఉండొచ్చు. నీ ఆశా తీరినట్టవుతుంది" అంది మళ్ళి.

కూతురి ఆలోచన యుక్తంగానే తోచింది. పాద్రి దగ్గరకి వెళ్ళే బదులు గురువడిని చూడాలని నిశ్చయించుకున్నాడు. సరిగ్గా అదే సమయంలో మన్వేలుడు ముంగిట్లో అడుగుపెట్టాడు. అతడు "చోమూ" అని పిలవడంతో తండ్రీ కూతుళ్ళు బయటికి వచ్చారు. బెళ్ళి గుండె వేగంగా కొట్టుకోసాగింది. మెల్లిగా లోపలికి జారు కుంది.

చోముడు మన్వేలుడితో, "మీరు ఎందుకొచ్చారిక్కడికి? మీ అప్పు తీరిపోయిందిగా! నాతో మీకేం పనిలేదు" అన్నాడు.

"నేను దానికోసం రాలేదు. ఈ ఊళ్ళో పని ఉండి వచ్చాను. ఎవరో అన్నారు మీ చిన్న కుర్రాడు పోయాడని. పాపం! చూసిపోదామని వచ్చాను."

"అయ్యో దేవుడా! చనిపోయినవారి సంగతి ఎందుకెత్తు తారు? ఎన్నెన్ని రోజులు మనతో వీళ్ల ఋణం ఉంటుందో అన్ని రోజులు ఉంటారు. తరువాత పోతారు అంతే!"

"....... ...."

" అవునోయ్. నేను వస్తూ కొక్కడం వెళ్ళివచ్చాను. నీ కొడుకు అక్కడ సాగుచేసుకుంటున్నాడుగా ! మిమ్మల్నందర్నీ చూడాలని ఉందట. రానా అని అడిగాడు. రెండు రోజుల్లో నేను మళ్ళీ కొక్కడం వెడతాను, ఏమైనా చెప్పమంటావా ? "

లోపలనుండి వీళ్ళ మాటల్ని వింటున్న బెళ్ళి గురువడి పేరు వినిపించగానే బయటికి వచ్చింది. మన్వేలుడు ఆమెను చూసి నవ్వాడు. బెళ్ళి నవ్వింది. వెంటనే నవ్వు దాచుకుని, తలవంచుకుని కాలివేళ్ళతో నేలని గోకుతూ, " అయ్యో అయితే వెళ్ళి అన్నను తీసుకురా. మనం రెండు రోజులు ఇక్కడుండి ఆ తరువాత ఇక్కడ ఋణం తీర్చుకుని వెళ్ళిపోదాం " అంది.

వాళ్ళు అనుకుంటున్నదేమిటో చూచాయగా తెలిసింది మన్వేలుడికి.

" చోమూ నీకొడుకుతో కలసి. నువ్వూ కొక్కడంలో సుఖంగా ఉండిపోకూడదూ ? " అన్నాడు.

" దాన్ని గురించే ఆలోచిస్తున్నాం ఇక మాకు మిగిలిన ఆధారం అతడొక్కడే. అతడితో మేము దెబ్బలాడ్డం సరికాదు. "

" కాని అతడితో మీరు ఉంటే మీజాతివాళ్ళు ఏమంటారు ? "

" మేస్త్రీగారూ, మేమిక పాద్రిమతానికి చేరాలని నిశ్చయించు కున్నాం. " అంది బెళ్ళి.

మన్వేలుడు నవ్వాడు.

మరుసటి రోజు కొడుకుని తీసుకురావటానికి చోముడు కొక్కడానికి వెళ్ళాలని నిశ్చయించుకున్నాడు.

18

మరుసటి రోజు ఉదయమే బెళ్ళి లేచి. ప్రయాణం చెయ్యబోయే తండ్రి కోసం గంజి కాచింది. అడవికి వెళ్ళి ఆదుంప, ఈ ఈదుంప అని కాసిని దుంపలను తెచ్చి, ఉడికించి మూటకట్టి ఇచ్చింది. అన్నకేమయినా పంపించాలని ఎంత ఆలోచించినా ఏమీ తోచలేదు. ఆఖరికి వర్షాకాలం కోసం దాచిఉంచిన పనసగింజలను తెచ్చి, కాల్చి, పొట్టు వలిచి ఒక ఆకులో చుట్టి ఇచ్చి, ' ఇది అన్నకోసం ' అని చెప్పింది. చోముడు భోజనం కానిచ్చి, బెళ్ళి ఇచ్చిన 'చద్దిమూట' చేతిలో పట్టుకుని, ఓ దుడ్డుకర్ర చేతికి తీసుకుని బయల్దేరాడు. అతని వెనకాలే బాడుకూడా బయల్దేరింది. బెళ్ళి "బాడు వస్తోంది, రానిమ్మంటావా ?" అంది. ఉత్సాహపు పొంగులో ఉన్నసోముడు, 'రానీయ్' అన్నాడు. బాడు బయల్దేరింది.

బెళ్ళి కాళని ఆకుకోసం పంపి, తను ఎడ్లని మేతకి తోలి, యజమానిగారి ఇంటికి వెళ్ళే ప్రయత్నంలో ఉంది. అప్పుడు మన్వేలుడి సవారి అక్కడికి విజయం చేసింది, "ఏం బెళ్లీ, ఎలా ఉన్నావ్ ?" అంటూ నవ్వాడు. ఈసారి బెళ్ళి నవ్వలేదు.

"ఇదిగో, ఇలా ఉన్నాం." అని ఊరుకుంది.

"అయ్య ఉన్నాడా ? కొక్కడం వెళ్ళాడా ?"

"లేదు, కొక్కడం వెళ్ళాడు."

"ఇంటిలో ఇంకెవరున్నారు ?"

"ఎవరూ లేరు."

మన్వేలుడికి ధైర్యం కలిగింది. తమ పాత స్నేహాన్ని పురస్కరించుకుని, ఆ కోరికతోనే వచ్చాడతడు. ఇంటిలో బెళ్ళి ఒక్కతే ఉందని తెలిసి, అతడికి కలిగిన ఆనందం అపారం. బెళ్ళికి దగ్గరగా వచ్చి నుంచున్నాడు. బెళ్ళి మనసు అటూ, ఇటూ ఊగుతోంది. కోరికల వ్యామోహం ఒకవైపు, తోటలోని జ్ఞాపకాలు ఒకవేపు, మారిన పరిస్థితులు, తనున్నచోటు, సమయం - వీటిని గురించిన భయం ఒకవేపు. ఆమె తల పైకెత్తకుండా, నుంచున్న చోటులోనే ఉండిపోయింది.

కాని మన్వేలుడికేం భయం? ఇలాగే ఎన్నో కుటుంబాల్లో సమస్యగా తయారయిన అనుభవముందతనికి, ధైర్యంగా ఆమె భుజం మీద చేతులువేసి, "నామీద కోపమా? మాటాడవేం?" అన్నాడు. అప్పటికీ బెళ్ళి మాటాడలేదు. మన్వేలుడు ధైర్యంగా మరో అడుగు ముందుకువేసి, గుడిసెలోనికి ప్రవేశించాడు. ఆమె వివశురాలిలా అతడిని అనుసరించింది.

ఇటు చోముడు పెద్ద పెద్ద అంగలు వేసుకుంటూ కొక్కడం వేపు బయల్దేరాడు. అతను గుడిసెనుండి బయల్దేరి ఎటు వెళ్ళాలన్నా, వెళ్ళేటప్పుడు త్రోవలోవున్న పంజుర్లి శక్తికి సాష్టాంగపడి దండంపెట్టి లేచాకనే ముందుకు వెళ్ళడం అలవాటు. అతని కన్నా ముందు దారి చూపేదానిలా పరుగెత్తే బాడు కూడా పంజుర్లి గుడి రాగానే ఆగిపోయేది. చోముడు దండం పెట్టి లేచాకనే బయల్దేరేది. ఈ రోజు కూడా గుడి రాగానే బాడు ఆగిపోయింది.

చోముడు తటస్థ భావంతో కేవలం అభ్యాస బలంతో మోకాళ్ళు నేలకు ఆన్చాడు. గుండె గుభేలు మంది తాను ప్రాద్రిమతం చేరబోయేవాడు. ఇంకా పంజుర్లి ముందు మోకాళ్ల వంచాలా? అనిపించింది. విటారుగా నుంచోబోయాడు. కాళ్ళు స్వాధీనంలోకి

రాలేదు. పంజుర్లి భూతం తన ఎదుట నుంచునట్టుగా అనిపించింది.

“చోమూ, మీసాలు తెల్లబడేదాకా నన్నే నమ్ముకుని. ఇప్పుడు చావుకు మూడురోజులు ముందు నన్ను కాదని పాద్రి వెనకాల పడతావా? అంటునట్లనిపించింది. వణికిపోయాడు. తర తరాలుగా నమ్ముకున్న దేవుడిని కాదని ఇలాటి పని చెయ్యడం సరి కాదనిపించింది. పాద్రి మతంలోని వారు మాత్రం చావరూ?

కష్టసుఖాలు క్రిస్టియన్లకి మాత్రం రావా? అన్న ఆలోచన వచ్చింది. ఇటు తాను నమ్మిన గ్రామశక్తిని వదిలి పెడితే చచ్చే వరకూ దాని ఉపద్రవం తప్పదు కదా! అన్న భీతి కలిగింది. ఆలోచించాడు. ఆఖరికి ధైర్యం తెచ్చుకుని, “ఏమయినా సరే. ఇలాగే ఉండి వచ్చిన కష్టాలన్నీ అనుభవిస్తాను” అని తీర్మానించు కున్నాడు వెనక్కి తిరిగాడు.

వచ్చేటప్పటికి గుడిసె తలుపులు తీసే ఉండటంతో లోపలికి వెళ్లాడు. ఎదురుగా మన్వేలుడు, బెళ్ళి ఒకే చాపమీద కూర్చుని మాటాడుతూ ఉండడం కనిపించింది. ఒళ్ళు మండిపోయింది.

కూర్చున్న వారిద్దరూ ఒక్క గంతులో లేచి నుంచున్నారు. చోముడు నిశ్చేష్టుడై రెండు క్షణాల దాకా చూస్తూ నుంచున్నాడు. ఆఖరికి చేతిలోని దుడ్డుకర్రని మన్వేలుడి మీదకి విసిరాడు. అది మన్వేలుడి కాలికి తగిలింది. అతడు ప్రాణం మీది ఆశతో బయటకి పరుగు తీశాడు. అక్కడ నుంచోలేదు, మరుక్షణం ఆ ప్రదేశంలో కనపడకుండా మాయమయ్యాడు.

బెళ్ళినేం చెయ్యాలో తోచలేదు. తటాలున ఆమె చేతిని పట్టుకున్నాడు. బెళ్ళి ఒళ్ళంతా చెమటతో తడిసిపోయింది. అలాగే మూఢుడిలా ఆమెను చూశాడు. ఆమె గొంతు పట్టుకుని. పిచ్చి

పట్టిన వాడిలా ఆమెను ముద్దుపెట్టుకున్నాడు. పెట్టుకుని వికటంగా నవ్వసాగాడు. అతని నవ్వు ఎక్కువైనప్పుడల్లా బెళ్ళి పంచప్రాణాలూ క్షీణించసాగాయి. ఆఖరికి చోముడు ఆమె మెడపట్టుకుని లాగి బైటకి గెంటివేశాడు. తలుపు వేసేసుకున్నాడు. బెళ్ళి ఇంటిముందు నేలమీద బోర్లాపడింది. అక్కడినుంచి పైకి లేచే సాహసం కలుగలేదామెకు.

మిట్టమధ్యాహ్నమయింది. కాళ ఇంటికొచ్చాడు. లోపలికి వెళ్లగానే చోముడు కర్ర పైకెత్తి, "పో బయటికి, నీ అక్క దగ్గిరకు పో. నాకిక పిల్లల్లేరు " అని అరిచాడు. కాళ బెదిరిపోయి బయటికి వచ్చి "అక్కా! అక్కా!" అన్నాడు. ఒక చెట్టు మొదట్లో పడిఉంది అక్క. వెళ్ళి అక్కను కౌగలించుకుని ఏడవసాగాడు. ఎంత పలకరించినా బెళ్ళి ఉలకదు, పలుకదు. అతడికి నీరసం వచ్చి అక్కప్రక్కనే పడి నిద్రపోయాడు. సాయంకాలమయింది. చోముడు బయటికి వచ్చి బెళ్ళిని చూసి, ఇది నాఇల్లు, మీరెవరూ అందులో అడుగుపెట్ట కూడదు. " అన్నాడు. పశువుల పాకలోకి వెళ్ళి ఎడ్లని నాగలిని తీసుకుని బయల్దేరాడు.

యజమాని పొలంలోకి వెళ్ళి నాలుగు వరసలు బాగాదున్నాడు. మళ్ళీ ఇంటికి వచ్చి నాగలిని విప్పేసి ఎడ్లని ఏటికి తీసికెళ్ళి ఒళ్ళంతా రుద్ది రుద్ది కడిగాడు. ఇంటికి వచ్చాడు. మళ్ళీ కాసేపుండి ఎడ్లని తోలుకుని ఎక్కడికో వెళ్ళాడు. 'ఎక్కడికి?" అని అడిగే ధైర్యం లేదు బెళ్ళికి. అడగటం మాట అటే ఉంచి, తలెత్తి చూడనూ చూడలేకపోయింది. అలాగే ఉపవాసం పడి ఉంది తన తప్పుకు తండ్రి దగ్గర క్షమాపణ అడుగుదామని నిశ్చయించుకుంది. తనమీద తండ్రి చూపిన ప్రేమా, వాత్సల్యమూ, తన కృతఘ్నతా తల్చుకుంది. తన మీద తనకే అసహ్యం కలిగింది. నేలమీద పొర్లి పొర్లి ఏడ్చింది.

అర్థరాత్రి వేళకు చోముడొక్కడే వెనక్కి వచ్చాడు. క్షీణంగా ఉన్న వెన్నెల వెలుగు ముంగిట ప్రసరించింది. ఆ వెలుగులో అతడు ఇంటికి రావడం కనిపించింది. వచ్చినవాడు వచ్చినట్టే లోపలకి వెళ్ళి కూర్చున్నాడు. ఇక అతడి ప్రపంచంలో బెళ్ళికి చోటులేదు. యజమాని ఋణం తీర్చడానికి దున్ని వచ్చాడు. ఎడ్ల ఋణం తీర్చడం కోసం వాటివి రుద్ది, కడిగి నీళ్ళు పోశాడు. వాటి జ్ఞాపకాల తెంచుకోవడం కోసం వాటివి తీసికెళ్ళి, దూరలుగా ఉన్నపుడవి ఎక్కడ దొరికాయో అక్కడే వదలిపెట్టి వచ్చాడు. ఇక మిగిలిన ఆశ ఒక్కటే, నాగలిపట్టే ఆశ. మళ్ళీ బయటకి వచ్చాడు. నాగలి క్రింద పడేసి, విరిచి ముక్కలు ముక్కలు చేసి, ఆ ముక్కలు రాశి చేశాడు. బయటివెళ్లాడు ఒక్క కాగడా వెలిగించి తెచ్చాడు, ఇదంతా చూస్తోంది బెళ్ళి. ఆమె కళ్ళలో నీరుబికింది. కాని చోముడు యజ్ఞం చేస్తున్న అధ్వర్యుడి లాగా గంభీరంగా ఉన్నాడు. కనురెప్పలు కూడా కదలటంలేదు. ఇంత పనీ చేసి మళ్లీ వెళ్ళి లోపల కూర్చున్నాడు.

"నా బెళ్ళి నన్ను మోసం చేసిందా?" అని ఆలోచించాడు. తరువాత ఆమె యవ్వనం, తను ఆమె పెళ్ళి చేయకుండా వాయిదా వేస్తూ రావటంలోని పొరపాటు, తన కోసం ఆమె కాఫీతోటకు వెళ్లటం, తన ఋణాన్ని అంత త్వరగా తీర్చేసి రావడం అన్నీ గుర్తొచ్చాయి. "అయ్యో పాపం! అనిపించింది. నేను ఆమెలా ఆడదాన్నయ్యుంటే నాగతేమయ్యేది? అని ఆలోచించాడు. ఇదంత ఒక్క క్షణమే. మరుక్షణమే "నా రోజులు అయిపోయాయి. నా కేమయితేనేం? ఎవరెక్కడ పోతే నాకేమిటి? గురువదలా అవనీ, బెళ్ళి ఇలా అవనీ, కాళ ఇంకా ఎక్కువ పాడవనీ, నాకేం?" అని నవ్వాడు. వికటంగా నవ్వాడు, మరీ మరీ నవ్వాడు.

సరే. ఇక దప్పు చేతికి తీసుకుని మ్రోగించసాగాడు. ఆ ఆనందం ఇంకెవరికీ దొరకక్కూడదనో ఏమిటో తలుపులు ముందుకు చేరవేశాడు. మళ్ళి వచ్చికూర్చుని దప్పు వాయించసాగాడు. ఆరోజులాగ దప్పుని జీవిత కాలంలో ఎప్పుడూ వాయించి ఎరుగడు. ఇక వాయించడు. చాలా కొద్దిసేపే అది. అయితేనేం? నిజంగా అది ప్రళయ తాండవపుఢమరు వినాదం. దప్పు—'దమ్మ దమ్మ' నాదం ఆగిపోయింది. అదీ ఒక్కసారిగా ఆగిపోయింది. ఎందుకో బెళ్ళికి భయంవేసి తలుపు దగ్గరకు పరుగెత్తుకు వచ్చింది. తలుపుకు అడ్డంగా ఎడ్లు రెండూ వచ్చినించున్నాయి. బాడుకూడా వచ్చింది. వాటిని తోసుకుంటూ బెళ్ళి లోపలకి వెళ్ళింది. మసక చీకటిలో కని పించింది చోముడి సమాధి.

పట్టుకున్న దప్పు ఎత్తిన చెయ్యి పొంగిన ఆవేశం! అన్నీ ఉన్నట్టే ఉన్నాయి. కాని.

చోముడు మాత్రం లేడు!!!

సమాప్తం

ఎమెస్కో పాకెట్ పుస్తకాలు

ఒక్కొక్క ప్రతి వెల రు 3—50

EPB No.

162 వైతరణి - వాసిరెడ్డి సీతాదేవి (,,)
168 ఉద్యోగపర్వాలు - లేళ్లపల్లి వెంకట లక్ష్మీనారాయణ
177 అలకాపురి - చామర్తి దుర్గా ప్రసాద్ (నవల)
181 పున్నమి మనకలు - కళ్యాణ సుందరి జగన్నాథ్ (,,)
182 అత్తగారూ నక్సలైట్లు - భానుమతి రామకృష్ణ (,,)
190 జీవఫలం - ఐ.జె. రావు
191 ఏటి అవతల - హిందీ మూలం : గుల్షన్ నందా (నవల)
అనువాదం ఆచంట అంజని
192 సంపూర్ణ రామాయణం - ఆరుద్ర, ముళ్లపూడి (సినీస్క్రిప్టు) (,,)
200 శశిరేఖ—గుడిపాటి వెంకటచలం
201 చైతన్య స్రవంతి - బుచ్చిబాబు - కథలు
202 సర్దారు పాపడు - డా॥ పా॥ వెం॥ రాజమన్నారు నాటికలు
203 కర్పూర వసంతరాయలు సి. నారాయణ రెడ్డి
205
206
207
208
ప్రకాశం పంతులుగారి "నా జీవిత యాత్ర"
(4 సంపుటాలు)
ఒకే సంపుటంగా మేలి బైండు పుస్తకం రు. 15/-
211 రాజా రామమోహనరాయ్ - జమునా నాథ్
(అనువాదం ; తారకం) (నవల)
212 హంసగీతి బెంగాల్ మూలం: ధనంజయ బైరాగి
అను: వేదాంతం సుబ్రహ్మణ్యం
213 ముక్తి-ఇతర కథలు—రేవనూరి శమంత
214 శరన్మేఘం—పోలాప్రగడ రాజ్యలక్ష్మి (నవల)
216 భావబంధం—ఇతర కథానికలు—ద్వివేదుల విశాలాక్షి
217 దూరతీరాలు—మంజుశ్రీ (,,)
219 కృష్ణాతీరం—మల్లాది రామకృష్ణ శాస్త్రి (నవల)
221 ఆశల ఆరాటంలో జీవన పోరాటం—కావిలిపాటి విజయలక్ష్మి
222 వెన్నెలలో పిల్లనగ్రోవి—కొలిపాక రమామణి (,,)

223 దేశం కొంచెం మందు పుచ్చుకుంది—గొల్లపూడి మారుతీరావు
నాటికాసంకలనం

224 అభయధామం - కన్నడ మూలం: 'నిరంజన'
తెలుగు సేత: శర్వాణి' (నవల)

226 సాహిత్య—హింసావలోకనం—నండూరి పార్థసారథి (,,)

228 జలదేవతలు—అరిపిరాల విశ్వం (,,)

232 నైవేద్యం—స్మరణ - బెజవాడ గోపాలరెడ్డి (కవిత)

233 తాతాచార్ల కథలు సి. పి. (బ్రౌన్ సంతరించినవి)
సంకలన - పరిశోధన: బంగోరే 5-00

236 కామాయని హిందీ: మూలం:
జయశంకర ప్రసాద్, తెలుగు సేత:
ఇలపావులూరి పాండురంగారావు 5-00 (కావ్యం)

239 బానిసలు భగవానువాచ డా॥ కేశవరెడ్డి నవలిక

240 దీపావళి వేదుల సత్యనారాయణశాస్త్రి కావ్యం

241 బ్రెయిన్ డ్రెయిన్ కె. వి. యస్. శర్మ. (కథలు)

242 కిరణ్మయి విమలారామం 5-00 (నవల)

243 మరుపులో మెరుపులు చెరుకూరి రమాదేవి (,,)

244 నీరజ -దోషులెవరు సి. ఆనందరామం (నవలిక)

245 బహురూపి జనమంచి రామకృష్ణ (నవలిక)

246 శంఖారావం వై. శేఖర్ (,,)

247 ఎదగని మనసులు మాదిరెడ్డి సులోచన (,,)

248 శ్రీమంతులు మాదిరెడ్డి సులోచన (,,)

249 కలకాదు సుమా: మాదిరెడ్డి సులోచన (,,)

251 అశ్రు డా॥ చామర్తి దుర్గాప్రసాద్ (,,)

253 ఆఖరిమజిలీ — కాశీనాధుని సువర్చలాదేవి (,,)

254 సీలంగేటు అయ్యగారు - శివరాజు సుబ్బలక్ష్మి (,,)

255 చరణాంజలి శరణు (,,)

256 జాతర దేవహారతినాగ్ (,,)

257 చీకటివర్ధాక దొడ్డవరం కామేశ్వరరావు (,,)

258 వరద వి. రాజరామమోహనరావు (కథలు)

259 రంగవల్లి పోరంకి దక్షిణామూర్తి (నవల)

260 దీనబంధు— వి. ఆనందారామం (నవల)

261 వాహిని—కవిత (6-00) (డబుల్ నవల)

262 నాకీ యిల్లు చాలు—సుషమ (నవల)

263 "నారస్త్రా" గుంటూరు శేషేంద్ర శర్మ 'కవిత'— కవితా సంకలనం

264 కొండగాలి తిరిగింది— ఆరుద్ర సినీ గేయాలు

265 ఉరిత్రాడు—వాసిరెడ్డి సీతాదేవి (నవల)

266 అర్చన— ,, ,,

267 మానని మనసు— ,, ,,

268 వెన్నెల మండుతోంది—,, ,,

269 ఇంద్ర ధనుస్సు—రేవనూరి శమంత ,,

270 ఆలోచించు—మాలతీ చందూర్ ,,

272 తప్పు శిఖా వెంకట రమణరాజా (నవల)

274 నువ్వా, నేను చిన్నారావూ ఎమ్. పార్థసారథి ,,

275 అన్నపూర్ణ పి. సత్యవతి ,,

276 శ్యామల శిష్ట్లు కృష్ణమూర్తి ,,

277 అడవి శ్రీకృష్ణఅలనహళ్లి అను శ్రీకంఠమూర్తి ,,

278 బృందావనం గుళ్లపల్లి సుందరమ్మ ,,

279 ఆనందనిలయం ఆనందారామం ,,

280 కనువిప్పు ఆనందారామం ,,

281 రక్షరేకు ఆనందారామం ,,

282 మబ్బు విడిపోయింది ,, ,,

283	జయలక్ష్మి	మాలతీచందూర్	(నవల)
284	కృష్ణవేణి	,,	,,
285	రాగరక్తిమ	,,	,,
286	వద్యోగం	,,	,,
287	అపస్వరం	త్రివేణి - శర్వాణి	,,
288	అపజయం	,,	,,
289	కీలుబొమ్మ	,,	,,
290	వెండిమబ్బు	,,	,,
291	ప్రవాసులు	ఉన్నవ విజయలక్ష్మి	,,
292	ఎవరికి చెప్పుకోను	,,	,,
293	లత, బి. ఏ.	,,	,,
294	ఎవరికోసం	,,	,,
296	వెన్నెల విలువెంత	వందూరి సుబ్బారావు	,,
297	దీప	బొమ్మ హేమాదేవి	,,
298	స్నేహలత	నెల్లూరి వేదవతీదేవి	,,
299	స్వర్ణరేఖలు	వాడపల్లి విజయభాస్కరరామారావు	,,
301	ఎమెస్కో పాకెట్ తెలుగు-ఇంగ్లీషు డిక్షనరీ-1	బొమ్మగంటి శ్రీనివాసాచార్యులు M. A.	,,
302	రవిచంద్ర	మాదిరెడ్డి సులోచన	(నవల)
303	అగుపించని అంకుశం	ముద్దంశెట్టి హనుమంతరావు	,,
304	పిపాసి	శారదా అశోకవర్ధన్	,,
305	ఎన్ని మెట్లెక్కినా	మాలతీచందూర్	,,
306	పరాయిసీత	వి. రాజారామమోహనరావు	,,
307	బ్రాహ్మణపిల్ల	లత	,,
308	ఇదే నేను కోరేది	ఆనందారామం	,,

309	ఇంకెంతదూరం	హెచ్. ఎ. కె. మురళీధర్	,,
310	ప్రేమేదైవం	చిపుకుల పురుషోత్తం	,,
311	లేమిలోకలిమి	కోమలాదేవి	,,
312	ముగింపేమిటి	పవని నిర్మల ప్రభావతి	,,
313	ది లవ్ జర్మ్	మల్లాది కృష్ణమూర్తి	,,
314	కవిభీమన్న	కొవ్వలి	,,
315	ఆర్తి	వేదుల శకుంతల	,,
316	రచయిత్రి మళ్ళీ పుట్టింది - హరికిషన్		,,
317	దీపం - జ్యోతి	నండూరి సుబ్బారావు	,,
318	రాగమయి	మాదిరెడ్డి సులోచన	,,
319	పీడవిబంధం	కడా పద్మ	,,
320	ఓ. పిలిమ కథ	లత	,,
321	ముక్తయురి	వేమకోటి సీతారామశాస్త్రి	,,
322	జీవనపల్లవి	అంగర విజయలక్ష్మి	,,
323	రత్న మందిర్	మాదిరెడ్డి సులోచన	,,
324	సుభద్రాపరిణయం	బి. అన్నపూర్ణాదేవి	,,
325	పొద్దు తిరగనిపువ్వు	గంటి వెంకట రమణ	,,
326	మోహనరాగం	మాధవపెద్ది పుణ్యశీలా ప్రసాదు.	,,
327	దేవుటిలీల - మనుషుల గోల	అలపాటి	,,
328	గ్లామర్ లెస్ గర్ల్	వేదుల శకుంతల	,,
329	అందని చందమామ	పి. గణపతిశాస్త్రి	,,
330	దిష్టిబొమ్మ	వంశీ	,,
331	ఒక అత్త చెప్పిన కథ	ఇల్లాదేవి	,,
332	రంగనాథంబాబాయి	నండూరి	,,

333	ఖేల	నాయని కృష్ణమూర్తి	„
334	వెన్నెలపిడుగు	ఇచ్ఛాపురపు రామచంద్రం	„
335	సిరిమల్లె	ఆదివిష్ణు	„
336	దైవమిచ్చిన భర్త	ఉన్నవ విజయలక్ష్మి	„
337	జరుగుతున్నకథ	పవని నిర్మల ప్రభావతి	„
338	కోరికల హరివిల్లు	ఉమాశశి	„
339	లయతప్పిన విన్యాసం	వేదుల శకుంతల	„
340	వీరకేసరి	మాదిరెడ్డి సులోచన	„
341	చోముని డప్పు	శివరామ కరంత్ (అను) శర్వాణి	„
342	పడుచుదనం రైలుబండి	పి. సత్యవతి	„
343	అశ్రుతర్పణం	శారదా అశోకవర్ధన్	„

చో ము ని ద ప్పు

కన్నడమూలం
శివరామకారంత

అనువాదం
"శర్వాణి"

చోముడి యాభై ఏళ్ళ జీవితంలో అనుభవాలు అనేక రకాలు. కష్టాలకి అంతేలేదు.

తండ్రి ఎప్పుడో చేసిన అప్పు తీర్చటానికి కాఫీ తోటల పనికి వెళ్ళిన చోముడి యిద్దరు కొడుకులు తలో దారీ అయ్యారు. కొడుకులవల్ల తీరని అప్పుతీర్చటానికి తప్పని సరై ఎదిగిన కూతురు బెళ్ళిని కాఫీతోటల పనికి పంపుతాడు ఆ నరకంలో శరీర శ్రమతో తీరని ఆ అప్పుకి తన వయసు తొందరపాటుని పణంగా పెట్టింది బెళ్ళి.చోముడి కుటుంబాన్ని చిన్నా భిన్నం చేసిన ఆర్థిక వ్యవస్థ విశ్వరూపానికి జ్ఞానపీఠ్ బహుమతి గ్రహీత శ్రీ శివరామ కారంత నవలా రూపం చో ము ని ద ప్పు.